


'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 250

శుక్రవారం 1-12-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నాలుగు పెద్ద కులాలు..

పేదలు, యువత, మహిళలు, రైతులు.. వీరి అభివృద్ధే దేశాభివృద్ధి: మోదీ -6లో



సిరీస్ వేటలో భారత్

ఆసీస్‌తో నాలుగో టి20లో గెలుపే లక్ష్యంగా బరిలోకి టీమిండియా -13లో

ఎగ్జిట్ పోల్స్ అంచనాలు

కాంగ్రెస్ ● బీజేపీ ● ఎంఎన్ఎఫ్ ● జెడ్‌పీఎం ● బీఆర్ఎస్ ● మజ్లిస్

మధ్యప్రదేశ్

సంస్థ	కాంగ్రెస్	బీజేపీ
ఇండియాటుడే - యాక్సిస్ మై ఇండియా	68-90	140-162
టైమ్స్ నౌ - ఈటీజీ	109-125	105-117
రిపబ్లిక్ టీవీ	97-107	118-130
ఇండియా టీవీ- సీఎన్ఎక్స్	70-89	140-159
ఏబీపీ-సీవోటర్	113-137	88-112
జన్ కీ బాత్	102-125	100-123
టుడేస్ చాణక్య	74	151

రాజస్తాన్

సంస్థ	బీజేపీ	కాంగ్రెస్
ఇండియాటుడే- యాక్సిస్ మై ఇండియా	86-106	80-100
రిపబ్లిక్ టీవీ	108-128	56-72
టైమ్స్ నౌ - ఈటీజీ	105-125	69-81
ఇండియా టీవీ- సీఎన్ఎక్స్	80-90	94-104
ఏబీపీ-సీవోటర్	94-114	71-91
జన్ కీ బాత్	100-122	62-85
టుడేస్ చాణక్య	101	89

ఛత్తీస్‌గఢ్

సంస్థ	కాంగ్రెస్	బీజేపీ
ఇండియాటుడే - యాక్సిస్ మై ఇండియా	40-50	36-46
టైమ్స్ నౌ - ఈటీజీ	48-56	32-40
రిపబ్లిక్ టీవీ	44-52	35-42
ఇండియా టీవీ- సీఎన్ఎక్స్	46-56	30-40
ఏబీపీ-సీవోటర్	41-53	36-48
టుడేస్ చాణక్య	57	33
జన్ కీ బాత్	42-53	34-45

మిజోరం

సంస్థ	ఎంఎన్ఎఫ్	జెడ్‌పీఎం	కాంగ్రెస్	బీజేపీ
ఇండియాటుడే- యాక్సిస్ మై ఇండియా	3-7	28-35	2-4	0-2
టైమ్స్ నౌ - ఈటీజీ	14-18	10-14	9-13	0-2
రిపబ్లిక్ టీవీ	17-22	7-12	7-10	1-2
ఇండియా టీవీ- సీఎన్ఎక్స్	14-18	12-16	8-10	0-2
ఏబీపీ-సీవోటర్	15-21	12-18	2-8	
జన్ కీ బాత్	10-14	15-25	5-9	0-2

తెలంగాణ

సంస్థ	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ	మజ్లిస్
టైమ్స్ నౌ - ఈటీజీ	37-45	60-70	6-8	5-7
రిపబ్లిక్ టీవీ	46-56	58-68	4-9	5-9
ఇండియా టీవీ- సీఎన్ఎక్స్	31-47	63-79	2-4	5-7
ఏబీపీ-సీవోటర్	38-54	49-65	5-13	5-9
జన్ కీ బాత్	40-55	48-64	7-13	4-7
టుడేస్ చాణక్య	33	71	7	8

పోలింగ్ 70.66 శాతం!

ప్రశాంతంగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్... ఈ నెల 3న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

గడప దాటని సిటీ

చెంతనే పోలింగ్ కేంద్రం.. అయినా సిటీ ఓటరు గడప దాటలేదు. సెలవును సరదాగా గడిపేశారు. ఓటేసేందుకు కదల్లేదు. క్రితం సారితో పోలిస్తే 5% పోలింగ్ తగ్గింది.

పట్నమిలా..



హైదరాబాద్ భరత్‌నగర్‌లోని పోలింగ్ కేంద్రం

ఓటెత్తని హైదరాబాద్

గతంలో కంటే 5 శాతం తగ్గిన పోలింగ్

జిల్లాల్లో ఓటింగ్ తీరు ఇదీ..

- వివరాలు 2లో

- ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం
- ఉదయం వడివడిగా పోలింగ్.. మధ్యలో మందకొడిగా
- ఈవీఎంల మొరాయింపుతో పలుచోట్ల ఆలస్యంగా ప్రారంభం
- ఓటేసేందుకు మళ్లీ బద్ధకించిన జంట నగరాల జనం
- స్వల్ప ఉద్రిక్తతలు.. గతంతో పోల్చితే తగ్గిన ఓట్ల గల్లంతు ఘటనలు
- సజావుగా ముగియడంతో ఊపిరిపీల్చుకున్న ఎన్నికల సంఘం

2లో

అత్యధిక పోలింగ్ జరిగిన సెగ్మెంట్: మునుగోడు 91.51 శాతం

అత్యల్పంగా పోలింగ్ జరిగిన సెగ్మెంట్: యాకుత్‌పుర 39.69 శాతం

అత్యధిక పోలింగ్ జరిగిన జిల్లా: యాదాద్రి భువనగిరి 90.03 శాతం

అత్యల్పంగా పోలింగ్ జరిగిన జిల్లా: హైదరాబాద్‌లో 46.65 శాతం

(కడపటి వార్తలు అందే సరికి లెక్క ఇది. పోలింగ్ శాతాలు మారే అవకాశం ఉంది.)

పల్లె ఇలా..



16 కి.మీ. నడిచొచ్చి.. ఓటేసి

వీరంతా ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల పంచాయతీ పరిధిలోని పెనుగోలు ఆదివాసీలు. మూడు గుట్టలు ఎక్కి దిగి, మధ్యలో మూడు వాగులు దాటి 16 కిలోమీటర్లు నడిచి వచ్చి మరీ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమ గోడు పట్టించుకోవడం లేదని వారు గోడు వెళ్లబోసుకున్నారు. ఈసారి ఎన్నికలకు దూరంగా ఉండాలనుకున్నా.. రాజ్యాంగం కల్పించిన హక్కును ఉపయోగించుకోవాలనే ఇంతదూరం నడిచి వచ్చామని చెప్పారు. - వాజేడు

తెలంగాణ అంచనాలు

కాంగ్రెస్‌వైపే!

మెజారిటీ ఎగ్జిట్ పోల్స్‌ది అదే మాట

- రాజస్తాన్‌లో కమల వికాసమన్న సర్వేలు
- మధ్యప్రదేశ్‌నూ నిలుపుకోనున్న బీజేపీ!
- ఛత్తీస్‌లో మళ్లీ కాంగ్రెసే, మిజోరంలో హంగ్!
- ఐదు రాష్ట్రాల్లోనూ ఈనెల 3న ఫలితాల వెల్లడి

లోక్‌సభ ఎన్నికలకు సెమీఫైనల్స్‌గా దేశవ్యాప్తంగా ఆసక్తి రేపిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ నువ్వా నేనా అన్నట్టుగా తలపడ్డట్టు ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. తెలంగాణలో మాత్రం అన్ని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలూ కాంగ్రెస్ వైపే మొగ్గడం విశేషం. రాష్ట్రంలో హస్తం పార్టీ తొలిసారి అధికారంలోకి రానుందని అవి పేర్కొన్నాయి. అయితే వీటిలో చాలా ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు గురువారం సాయంత్రం ఒకవైపు ఇంకా పోలింగ్ కొనసాగుతుండగానే వెలువడటం గమనార్హం. ఈ నేపథ్యంలో తెలంగాణపై తన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను శుక్రవారం ప్రకటించనున్నట్టు ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా పేర్కొంది. ఇక ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అధికారం నిలుపుకోనుందని ఎగ్జిట్ పోల్స్‌లో చాలావరకు పేర్కొన్నాయి. ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియాతో పాటు టైమ్స్ నౌ-ఈటీజీ, ఇండియా టీవీ-సీఎన్ఎక్స్, టుడేస్ చాణక్య కాంగ్రెస్‌కు మెజారిటీ సీట్లు కట్టబెట్టాయి. బీజేపీ, కాంగ్రెస్‌ల్లో ఎవరిదైనా పై చేయి కావచ్చని ఏబీపీ-సీవోటర్, జన్ కీ బాత్ పేర్కొన్నాయి. ఇక రాజస్తాన్‌లో అధికార

మిగతా 10వ పేజీలో ▶

కాంగ్రెస్-2, బీజేపీ-2, హంగ్-1

5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ఎగ్జిట్‌పోల్స్ జోస్యం -6లో

మహిళల సమస్యలపై 'సాహస్' అస్త్రం

పని ప్రదేశాల్లో భద్రతపై ప్రత్యేక యాప్

- సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని సూచించిన మహిళా భద్రత విభాగం
- 7331194540 ఫోన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చిన యంత్రాంగం

- వివరాలు 14లో

హ్యాట్రిక్‌పై బీఆర్ఎస్ ధీమా!

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పోలింగ్ సరళిపై పార్టీ పెద్దల పోస్ట్‌మార్టం

- 70కిపైగా స్థానాల్లో పార్టీ అభ్యర్థులే గెలుస్తారని వార్‌రూమ్ నివేదిక
- పోల్ మేనేజ్‌మెంట్‌లో ప్రతిపక్షాల కంటే మెరుగ్గా ఉన్నట్టు లెక్కలు
- ఉత్తర తెలంగాణ, రంగారెడ్డి జిల్లాలో బీజేపీకి వచ్చే ఓట్లపై విశ్లేషణ
- ఖమ్మం, నల్లగొండ, వరంగల్, పాలమూరులోనే కాంగ్రెస్‌తో పోటీ
- 'గ్రేటర్', ఉమ్మడి మెదక్‌లో పైచేయి!

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో పార్టీ సాధించబోయే ఫలితంపై బీఆర్ఎస్ పోస్టుమార్టం ప్రారంభించింది. 70కిపైగా అసెంబ్లీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారని ప్రాథమికంగా అంచనాకు వచ్చింది. పార్టీ సొంత బలంతోనే వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పోలింగ్ ముగిశాక తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటివరకు వెలువడిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలకు భిన్నంగా మిగతా 3వ పేజీలో ▶

గెలుస్తున్నాం



"పోలింగ్ ప్రక్రియ పూర్తి కాకమునుపే వెల్లడైన ఎగ్జిట్ పోల్ ఫలితాలు 'రబ్బిష్'. డిసెంబర్ 3న వెలువడే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 70కిపైగా స్థానాల్లో గెలిచి తీరుతాం. వందకు వంద శాతం మరోసారి అధికారంలోకి వస్తున్నాం. - మంత్రి కేటీఆర్

హస్తం గాలి 'వీచినట్టేనా'!

కాంగ్రెస్ శిబిరంలో ధీమా... పోలింగ్ అనుకూలంగా జరిగిందని అంచనా..

- 70కి పైగా సీట్లు గెలుస్తామని లెక్కలు...
- ఆ నాలుగు జిల్లాలు ఏకపక్షమే
- నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాలపై భారీ ఆశలు
- సింగరేణి సహకరించిందంటున్న హస్తం పార్టీ.. హైదరాబాద్ శివారు ఓటర్లూ తమవైపేనని ధీమా
- వార్ రూమ్ నుంచి పోలింగ్ సరళి సమీక్షించిన ఠాక్రే, దీపాదాస్ మున్షీ, కుసుమ కుమార్

సాక్షి, హైదరాబాద్: ఈసారి అధికారం కచ్చితంగా దక్కుతుందనే ధీమా కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. గురువారం జరిగిన పోలింగ్ సరళిని బట్టి చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా తమకు అనుకూల పరిస్థితులు కనిపించాయని, 70కి పైగా స్థానాల్లో గెలుపొంది అధికారంలోకి వస్తామని ఆ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా ఇప్పటికి ప్రజలు తమను ఆదరించారని, బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ పాలన పట్ల వ్యతిరేకతతో ఉన్న అన్ని వర్గాలూ తమవైపు మొగ్గుచూపాయనే అభిప్రాయం రాష్ట్ర కాంగ్రెస్ నేతల్లో కనిపిస్తోంది. దక్షిణ తెలంగాణతో పాటు మిగతా 10వ పేజీలో ▶

కాంగ్రెస్ సునామీ



"బీఆర్ఎస్‌కు 25కు మించి సీట్లు రానేరావు. గెలిచే అవకాశమే ఉంటే సీఎం మీడియా ముందుకు వచ్చి గొప్పలు చెప్పేవారు. తెలంగాణ సమాజం చైతన్యవంతమైనది. కేసీఆర్‌ను కామారెడ్డిలో ఓడిస్తున్నందుకు సంతోషంగా ఉంది. - రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు

ఓట్లు, సీట్లు పెరుగుతాయ్!

12-15 అసెంబ్లీ సీట్లలో గెలిచే అవకాశం ఉందంటూ కమలదళం ధీమా

పోలింగ్ సరళిపై అమిత్‌షా, నడ్డా ఆరా...

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళి అంచనాలకు అందని విధంగా ఉండటంతో బీజేపీలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే కచ్చితంగా ఎక్కువ సీట్లు గెలుపొందడంతోపాటు, గణనీయంగా ఓటింగ్ శాతాన్ని పెంచుకుంటామనే ధీమా పార్టీ నాయకుల్లో వ్యక్తమవుతోంది. కొన్ని నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌లలో సాయంత్రం 5 గంటల తర్వాత కూడా ఓటర్లు పెద్దసంఖ్యలో క్యూలైన్లలో వేచి ఉన్న పరిస్థితులనూ పార్టీ బేరీజు వేస్తోంది. వివిధ వర్గాల ప్రజలు పోలింగ్‌కు హాజరైన తీరు తదితర అంశాలను బట్టి ఓటర్ల నాడిని పసిగట్టడం సాధ్యం కాకపోవడంతో నమోదైన తుది పోలింగ్ శాతాన్ని బట్టి పరిస్థితి అంచనా వేయొచ్చనే అభిప్రాయంతో పార్టీ నేతలున్నారు. యువత ఎక్కువ శాతం ఓటింగ్‌లో పాల్గొన్నదనే అంచనాల మధ్య ఈసారి ఎక్కువ చోట్ల పార్టీకి అనుకూలంగా ఫలితాలు రావొచ్చనే ఆశాభావం వ్యక్తమవుతోంది. 45-50 చోట్ల పార్టీ అభ్యర్థులు గట్టి పోటీ ఇస్తారని (బీఆర్ఎస్, కాంగ్రెస్‌లతో ముఖాముఖి, త్రిముఖ పోటీలు కలుపుకుని), వాటిలో అధిక స్థానాల్లో రెండోస్థానంలో మిగతా 5వ పేజీలో ▶

మా పక్షానే ప్రజలు



"కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీపడి డబ్బు పంచాయి. ప్రలోభాలకు గురిచేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. ఇంత ఒత్తిడి ఉన్నా.. యువత, ఇతరవర్గాల ప్రజలు ధైర్యంగా బీజేపీ పక్షాన నిలిచారు. ధైర్యంగా పోరాడిన బీజేపీ కార్యకర్తలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. - కిషన్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ చీఫ్

హెన్రీ కిసింజర్ కన్నుమూత

ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన దౌత్యవేత్తగా గుర్తింపు



అమెరికా విదేశాంగ శాఖ మాజీ మంత్రి, అంతర్జాతీయ దౌత్య నిపుణుడు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, అమెరికా విదేశాంగ విధానం రూపశిల్పిగా పేరుగాంచిన హెన్రీ కిసింజర్ తుదిశ్వాస విడిచారు. అమెరికా విదేశాంగ విధానం గురించి ఎక్కడ చర్చ జరిగినా కిసింజర్ పేరు ప్రస్తావనకు రావాల్సిందే. అంతలా ఆయన తనదైన ముద్ర వేశారు. 1973లో ఆయనకు నోబెల్ శాంతి బహుమతి లభించింది. ఆయన వయసు వందేళ్లు.

- వివరాలు 6లో

ఇదండీ జాతర



ఏమో సార్! గుర్తు లేదు!! తొందరెందుకు రేపు మూడోతేదీన తెలుస్తుంది కదా!



హైదరాబాద్‌లోని భోలక్‌పూర్‌లో ఓటు వేయడానికి బారులుతీరిన ఓటర్లు



హైదరాబాద్ నుంచి సొంత గ్రామాలకు ఓటు వేసేందుకు వెళ్లడంతో యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద ప్రయాణికుల రద్దీ



హుస్నాబాద్ నియోజకవర్గం అకునూర్‌లో రాత్రి వరకు కొనసాగుతున్న పోలింగ్

పోలింగ్ 70.66 శాతం!

ప్రశాంతంగా ముగిసిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ | ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం | ఈ నెల 3న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో (ఈవీఎం) నిక్షిప్తమైంది. గురువారం రాత్రి వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 70.66 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం అంచనా వేసింది. కచ్చితమైన గణాంకాలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ శుక్రవారం ప్రకటిస్తారని ఆయన కార్యాలయం తెలిపింది. రాష్ట్ర శాసనసభకు 2014లో జరిగిన ఎన్నికల్లో 69.5 శాతం, 2018 ఎన్నికల్లో 73.2 శాతం పోలింగ్ నమోదైంది. తాజా పోలింగ్‌లో కడపటి వార్తలు అందేసరికి 70.66 శాతంగా నమోదైంది. ఇది మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ నెల 3న (ఆదివారం) ఓట్ల లెక్కింపు నిర్వహించి, ఫలితాలను ప్రకటించనున్నారు.

ఇంటింటికీ ఓటింగ్‌కు భారీ స్పందన: సీఈసీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 80ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు కలిపి 25,400 మంది తొలిసారిగా ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకున్నారని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. తొలిసారి కల్పించిన ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకున్నారని ఒక ప్రకటనలో తెలిపింది.

అత్యధికంగా జనగామలో..

గురువారం సాయంత్రానికల్లా అత్యధికంగా.. మునుగోడు 91.51, ఆలేరు 90.16, భువనగిరి 89.9 శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా యాకూత్‌పురలో 39.69 శాతం, మలక్‌పేట 41, నాంపల్లిలో 42.76, చార్మినార్‌లో 43.26 శాతం పోలింగ్ నమోదైంది.

- జిల్లాల వారీగా పోలింగ్ శాతాలను పరిశీలిస్తే.. అత్యధికంగా యాదాద్రి భువనగిరిలో 90.03 శాతం, మెదక్‌లో 86.69శాతం జనగామలో 85.74, నల్లగొండలో 85.49శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా హైదరాబాద్‌లో 46.65 శాతం, రంగారెడ్డిలో 59.94 శాతమే ఓట్లు వేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం తగ్గిపోయినట్టు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.
- మొత్తం 119 నియోజకవర్గాలకుగాను 13 వామపక్ష తీవ్రవాద ప్రభావిత స్థానాల్లో సాయంత్రం 4 గంటలకు, మిగతా 106 చోట్ల సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసింది. అయితే పోలింగ్ ముగిసే సమయానికల్లా.. పోలింగ్ కేంద్రాలకు చేరుకుని, క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ ఓటేసే అవకాశం కల్పించారు. కొన్నిచోట్ల ఇలా రాత్రి వరకు పోలింగ్ సాగింది. ఈ క్రమంలోనే పోలింగ్ శాతాలపై శుక్రవారం ఉదయమే స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెప్తున్నాయి.

పలుచోట్ల ఆలస్యంగా..

అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 5.30 గంటలకే మాక్ పోలింగ్ నిర్వహించారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ మొదలుకావాలి. అయితే పలుచోట్ల ఈవీఎంలు, ఓటర్ వెరిఫయబుల్ ఆడిట్ ట్రయల్ (వీవీ ప్యాట్) యంత్రాలు మొరాయించడంతో గంట నుంచి రెండు గంటలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి? ఎన్నింటిని రిప్లేస్ చేశారన్న అంశంపై సీఈఓ కార్యాలయం ప్రకటన జారీ చేయలేదు.

ఉదయమే బారులు తీరిన ఓటర్లు

రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల ఓటర్లు ఉదయమే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. దీనితో వడివడిగా ఓటింగ్ సాగింది. మధ్యాహ్నం కొంత మందగించినా తర్వాత పుంజుకుంది. ఉదయం 9 గంటల వరకు 7.78 శాతం, 11 గంటల వరకు 20.64 శాతం, మధ్యాహ్నం 3 గంటల సమయానికి 51.89 శాతం, సాయంత్రం 5 గంటలకు 64.42 శాతం పోలింగ్ నమోదైంది. కడపటి వార్తలు అందేసరికి 70.66 శాతంగా నమోదైంది. రాత్రి వరకు పలుచోట్ల ఓటింగ్ కొనసాగిన నేపథ్యంలో ఆ లెక్కలన్నీ క్రోడీకరించాల్సి ఉంది. దీనితో ఓటింగ్ శాతం పెరగనుందని ఎన్నికల సంఘం అంచనా వేసింది.

తగ్గిన ఓట్ల గల్లంతు ఫిర్యాదులు

గత శాసనసభ ఎన్నికల సందర్భంగా భారీ సంఖ్యలో ఓట్లు గల్లంతైనట్టు ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా హైదరాబాద్ జంట నగరాల్లో లక్షల ఓట్లు తొలగించినట్టు విమర్శలు వచ్చాయి. అయితే ఈసారి ఎన్నికల్లో ఓట్ల గల్లంతుపై ఫిర్యాదులు నామమాత్రంగానే వచ్చాయి.

వివరాలు వెల్లడించని ఎన్నికల ప్రధానాధికారి

శాసనసభ ఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధిగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) విలేకరుల సమావేశం నిర్వహించి.. వివరాలను వెల్లడించడం ఆనవాయితీ. అంతేకాదు.. పోలింగ్ కొనసాగుతున్న సమయంలోనూ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేవారు. అయితే సీఈఓ వికాస్‌రాజ్ గురువారం శాసనసభ ఎన్నికల పోలింగ్ ముగిశాక ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. దీంతో మీడియా ప్రతినిధులు సీఈఓ కార్యాలయం ప్రజాసంబంధాల విభాగం అధికారులను సంప్రదించారు. పోలింగ్ తీరుపై విలేకరుల సమావేశం నిర్వహించాలని కోరారు. కానీ సీఈఓ వికాస్‌రాజ్ అంగీకరించలేదని అధికారులు బదులిచ్చారు. కేవలం పోలింగ్ శాతంపై ప్రాథమిక అంచనాలు మినహా ఎలాంటి ఎలాంటి సమాచారాన్ని సీఈఓ కార్యాలయం వెల్లడించలేదు.

ఈవీఎంల తరలింపుపై ఉద్రిక్తత



సూర్యాపేట జిల్లా నాగారం మండలం పేరబోయినగూడెంలో అధికారులు ఎస్కార్ట్ లేకుండా ఈవీఎంలను తరలిస్తున్నారని, ఈవీఎంలను మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. పోలీసులు వచ్చి సర్దిచెప్పడంతో గ్రామస్తులు వెనక్కి తగ్గారు. అయితే ఖాళీ ఈవీఎంలను కారులో తరలిస్తున్న సెక్టోరియల్ అధికారిని అడ్డుకుని అద్దాలను ధ్వంసం చేశారు.

బందోబస్తుతో ప్రశాంతం

రాష్ట్రవ్యాప్తంగా పోలీసుశాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, అనుక్షణం పర్యవేక్షించడంతో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాల్లో పలుచోట్ల చెదురుమదురు ఘటనలు జరిగి, ఉద్రిక్తత నెలకొన్నా అక్కడి పోలీసు సిబ్బంది వేగంగా స్పందించి పరిస్థితిని చక్కదిద్దారు. రాష్ట్ర పోలీస్‌శాఖ నుంచి 45వేల మంది పోలీసు సిబ్బంది, 375 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, కర్నాటక, ఏపీ, మహారాష్ట్రల నుంచి 23,500 మంది హోంగార్డులు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. మావోయిస్టులు ఎన్నికల బహిష్కరణ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో.. ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు చేపట్టారు. కూంబింగ్, ఏరియా డామినేషన్ సెర్చ్ చేపట్టారు.

ఓటెత్తని హైదరాబాద్!

- ఎప్పటిలాగే అతి తక్కువగా పోలింగ్ నమోదు
- గతంలోకన్నా తక్కువగా 46.65%
- 'సెలవు' తీసుకున్న జనం.. పోలింగ్ కేంద్రాలకు తరలని తీరు
- రెండు చోట్లా ఓట్లు ఉండటం కూడా కారణమే!

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ జిల్లా పరిధిలో రాష్ట్రంలోనే తక్కువగా పోలింగ్ నమోదైంది. అధికారులు ఎంతగా అవగాహన కల్పించే ప్రయత్నం చేసినా.. ఎప్పటిలాగే హైదరాబాద్ జనం ఓటు వేసేందుకు తరలివెళ్లలేదు. పోలింగ్ కేంద్రాల్లో ఎంత క్యూ ఉందో, ఎంత సమయంలో ఓటేయవచ్చో ఆన్‌లైన్‌లో ముందే తెలుసుకునే సదుపాయం కల్పించినా ఫలితం రాలేదు. చాలా వరకు సెలవురోజుగానే భావించి విశ్రాంతి తీసుకునేందుకు, వినోద కార్యక్రమాల్లో మునిగిపోయి ఉండటమే దీనికి కారణమని అధికారవర్గాలు చెప్తున్నాయి. అంతేగాకుండా ఒకటి కంటే ఎక్కువచోట్లా ఓట్లున్నవారూ ఇక్కడ గణనీయంగా ఉండటం, వారంతా స్వస్థలాలకు తరలడం కూడా పోలింగ్ తగ్గడానికి మరో కారణమని పేర్కొంటున్నాయి. హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించిన సమాచారం మేరకు.. జిల్లాలో కడపటి వార్తలు అందేసరికి 46.65 శాతమే పోలింగ్ నమోదైంది. గత అసెంబ్లీ ఎన్నికల (50.51 శాతం)తో పోలిస్తే ఐదు శాతం తగ్గడం గమనార్హం.

జిల్లాల్లో ఓటింగ్ తీరు ఇదీ..



జనగామలో గౌట్ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద వాగ్వాదానికి దిగిన బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, దశమంతరెడ్డి

ఉమ్మడి ఆదిలాబాద్.. గిరిజన ప్రాంతాల్లో ధాటిగా ఓటింగ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని మారుమూల, గిరిజన ప్రాంతాల్లో అధికంగా పోలింగ్ నమోదైంది. ఆసిఫాబాద్, సిర్పూర్, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి తదితర స్థానాల్లో పలుచోట్ల రాత్రి దాకా ఓటింగ్ జరిగింది. కాగజ్‌నగర్ పట్టణంలోని 90వ పోలింగ్ కేంద్రం వద్ద బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సిర్పూర్ బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు ధర్నాకు దిగారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీఎస్పీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. వారిని అదుపు చేసే క్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రావు, ఎస్సై గంగన్న, కానిస్టేబుల్ రత్నాకర్, మరికొందరికి గాయాలయ్యాయి. ఇక్కడ రీపోలింగ్ నిర్వహించాలని ప్రవీణ్‌కుమార్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. మంచిర్యాల జిల్లా వరిపేట, ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం కొత్తపల్లిలలో ప్రజలు తమ సమస్యలు తీర్చలేదంటూ నిరసన వ్యక్తం చేయగా.. అధికారులు నచ్చజెప్పడంతో ఓటేశారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం గొల్లఘాట్ గ్రామస్తులు.. తమ ఊరిగి రోడ్డు, మంచినీటి సౌకర్యం కల్పించాలంటూ ఓటు వేయలేదు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్‌లో నిలబడి ఇద్దరు మృతి చెందారు.

ఉమ్మడి నల్లగొండ.. పలుచోట్ల లాఠీచార్జి

నల్లగొండ జిల్లా ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల లాఠీచార్జిలు, చెదురుమదురు ఘటనలు జరిగాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాలు బాహాబాహీకి దిగాయి. ఆలేరు మండలం కొలనుపాకలో టీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత భర్త మహేందర్‌రెడ్డి గులాబీ కండువాతో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడంపై కాంగ్రెస్ నేతలు అభ్యంతరం చెప్పారు. ఈసమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. కొందరు రాళ్లు రువ్వడంతో మహేందర్‌రెడ్డి కారు అద్దాలు పగిలాయి. పోలీసులు లాఠీచార్జి చేసి అందరినీ చెదరగొట్టారు. హుజూర్‌నగర్‌లోనూ గులాబీ కండువా వేసుకుని పోలింగ్ కేంద్రంలోకి వెళ్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డిని పోలీసులు ఆపడంతో వాగ్వాదం జరిగింది. నారాయణపురం మండల కేంద్రంలో ఇద్దరు వ్యక్తులు టెండర్ ఓట్లు వేశారు.

ఉమ్మడి కరీంనగర్.. డబ్బుల కోసం నిరసనలతో..

కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో పెద్దగా అవాంఛనీయ ఘటనలు జరగలేదు. కరీంనగర్ జిల్లాలో రేకుర్తిలో కాంగ్రెస్ ఎన్నికల ఏజెంట్ వాహనాన్ని బీఆర్ఎస్ నాయకులు అడ్డగించారని పోలీసులకు ఫిర్యాదు అందింది. మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్ గులాబీ చొక్కా ధరించి పోలింగ్ కేంద్రాలకు వచ్చారంటూ మొగిలిపాలెం, గన్నేరువరం గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం చెప్పడంతో వాగ్వాదం జరిగింది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారంలో అధికార పార్టీ అభ్యర్థి పంచిన డబ్బులు తమకు అందలేదంటూ కొందరు ఓటర్లు రోడ్డుపై బైఠాయించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా లింగంపేటలో తమకు డబ్బులు ఇవ్వలేదంటూ బీజేపీ నాయకుడి ఇంటి వద్ద మహిళా గ్రూపు సభ్యులు నిరసన వ్యక్తం చేశారు.

ఉమ్మడి ఖమ్మం.. గ్రామాల్లో పోలింగ్ బహిష్కరణ

ఖమ్మం ఉమ్మడి నియోజకవర్గాల్లో పలుచోట్ల రాత్రి 8వరకు కూడా పోలింగ్ జరిగింది. కొత్తగూడెం రూరల్, ఏన్కూరు, సత్తుపల్లి మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం లేదంటూ పోలింగ్‌ను బహిష్కరించారు. అధికారులు ఆయా గ్రామాలకు వెళ్లి సర్దిచెప్పడంతో మధ్యాహ్నం ఓట్లు వేశారు. కూసుమంచి, ఎర్రుపాలెం, తల్లాడ, బోనకల్, కొనిజర్ల, తిరుమలాయపాలెం, అశ్వారావుపేట, మణుగూరు, పినపాక మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఘర్షణలు జరిగాయి. పోలీసులు లాఠీచార్జి చేసి పరిస్థితిని చక్కదిద్దారు. ఖమ్మం రూరల్ మండలంలోని గోళ్లపాడులో ఏనుగు సీతారాంరెడ్డి(75) ఓటు వేసి పోలింగ్ బూత్ నుంచి బయటికి వస్తూ కుప్పకూలి కన్నుమూశాడు.

ఉమ్మడి రంగారెడ్డి.. బాగా తగ్గిన పోలింగ్

చెదురుమదురు ఘటనలు మినహా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. గత ఎన్నికల కంటే ఈసారి ఓటింగ్‌శాతం తగ్గింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఖానాపూర్‌లో, రాజేంద్రనగర్ నియోజకవర్గం మణికొండలో, మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లిలో స్వల్ప ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి.

ఉమ్మడి మహబూబ్‌నగర్.. ప్రశాంతంగా పోలింగ్..

పాలమూరు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ జరిగింది. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించాయి. అచ్చంపేట నియోజకవర్గం పదర మండలం వంకేశ్వరంలో డబ్బులు పంచుతున్నారంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. పలుచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య, మరికొన్నిచోట్ల బీఆర్ఎస్-బీజేపీ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. నారాయణపేట జిల్లా మాగనూరు మండలం వర్కూర్‌లో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య గొడవ చోటు చేసుకుంది.

ఉమ్మడి నిజామాబాద్.. మందకొడిగా మొదలై..

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో పోలింగ్ మందకొడిగా ప్రారంభమై మధ్యాహ్నానికి పుంజుకుంది. పలుచోట్ల రాత్రిదాకా ఓటర్లు క్యూలలో ఉన్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని పలుచోట్ల గుమిగూడిన పార్టీల కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జి చేశారు. పలువురికి గాయాలయ్యాయి. కామారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డిని నాన్‌లోకల్ అంటూ బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారు.

ఉమ్మడి వరంగల్.. బీఆర్ఎస్-కాంగ్రెస్ జగడం

వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని వర్ధన్నపేట నియోజకవర్గం పర్వతగిరిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య గొడవ జరిగింది. మహబూబాబాద్ జిల్లా పరిధిలో పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడం, మరికొన్ని చోట్ల తమ గ్రామాలను అభివృద్ధి చేయలేదంటూ జనం రాకపోవడంతో ఓటింగ్ జరగలేదు. దంతాలపల్లి బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. మంగపేటలో బీఆర్ఎస్ నేత మాజీ జెడ్పీటీసీ వైకుంఠం ఓట్లకు డబ్బులిస్తానని మోసం చేశారంటూ పలువురు ఓటర్లు నిరసన వ్యక్తం చేశారు. జనగామ నియోజకవర్గ కేంద్రంలోని ఓ పోలింగ్ స్టేషన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమ, కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి, కోడలు దివ్యల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రెండు పార్టీల కార్యకర్తలు గొడవకు దిగడంతో పోలీసులు లాఠీచార్జి చేసి చెదరగొట్టారు. జనగామ మండలం శామీర్‌పేట పోలింగ్ కేంద్రంలో ఎదురుపడిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పరుష పదజాలంతో దూషించుకున్నారు. ఇక్కడా బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పరస్పర దాడులకు దిగడంతో పోలీసులు లాఠీచార్జి చేశారు.

ఉమ్మడి మెదక్.. స్వల్ప ఘర్షణల మధ్య..

మెదక్ ఉమ్మడి జిల్లాలో పోలింగ్ సందర్భంగా పలుచోట్ల స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాటలు జరగడంతో పోలీసులు లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. మునిపల్లి మండలం పెద్దగోకులారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య, సదాశివపేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద, పటాన్‌చెరులో మూడుచోట్ల బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య గొడవ జరిగింది.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం (కడపటి వార్తలు అందేసరికి) ఎన్నికల సంఘం విడుదల చేసిన సమాచారం ప్రకారం..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా (14)

	2018	2023
నారాయణపేట	79.67	78.29
మహబూబ్‌నగర్	74.93	70.41
జడ్చర్ల	82.32	81.18
దేవరకద్ర	85.11	82.33
మక్తల్	77.77	75.26
వనపర్తి	81.40	77.54
గద్వాల	83.94	82.42
అలంపూర్	82.66	79.80
నాగర్‌కర్నూల్	83.21	78.50
అచ్చంపేట	81.85	79.97
కల్వకుర్తి	87.21	83.23
షాద్‌నగర్	88.07	81.96
కొల్లాపూర్	83.17	79.89
కొడంగల్	81.98	80.90

హైదరాబాద్ జిల్లా (15)

	2018	2023
ముషీరాబాద్	53	49.61
మలక్‌పేట	42	41.00
అంబర్‌పేట	56	50.52
ఖైరతాబాద్	54	51.31
జూబ్లీహిల్స్	46	45.20
సనత్‌నగర్	52	50.74
నాంపల్లి	45	42.76
కార్వాన్	53	46.50
గోషామహల్	59	54.93
చార్మినార్	50	41.45
చాంద్రాయణగుట్ట	48	45.00
యాకుత్‌పురా	43	39.69
బహదూర్‌పురా	50	44.86
సికింద్రాబాద్	55	49.60
కంటోన్మెంట్	49	49.40

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా (14)

	2018	2023
ఇబ్రహీంపట్నం	76.38	74.80
ఎల్బీనగర్	49.58	49.11
మహేశ్వరం	55.34	55.33
రాజేంద్రనగర్	56.89	55.86
శేరిలింగంపల్లి	48.61	48.85
చేవెళ్ల	79.02	74.25
వికారాబాద్	74.18	75.30
తాండూరు	77.48	73.01
పరిగి	76.44	76.62
మేడ్చల్	60.56	62.09
మల్కాజిగిరి	53.08	53.99
కుత్బుల్లాపూర్	55.84	56.74
కూకట్‌పల్లి	57.73	53.90
ఉప్పల్	51.54	51.35

ఉమ్మడి మెదక్ (10)

	2018	2023
మెదక్	86.29	85.30
నర్సాపూర్	90.74	88.04
సంగారెడ్డి	82.83	70.15
నారాయణఖేడ్	89.27	81.00
జహీరాబాద్	81.35	81.20
పటాన్‌చెరు	75.97	69.80
అందోల్	89.27	84.76
సిద్దిపేట	79.77	76.29
దుబ్బాక	86.23	84.68
గజ్వేల్	88.97	80.32

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా (10)

	2018	2023
సిర్పూర్	85.96	81.16
ఆసిఫాబాద్	86.27	80.48
చెన్నూర్	82.57	79.97
బెల్లంపల్లి	83.33	81.19
మంచిర్యాల	73.37	69.06
ఆదిలాబాద్	82.36	77.20
ఖానాపూర్	80.87	77.46
బోథ్	85.52	82.93
నిర్మల్	79.79	76.60
ముథోల్	84.47	80.50

ఉమ్మడి కరీంనగర్ జిల్లా (13)

	2018	2023
కరీంనగర్	69.29	64.17
చొప్పదండి	79.73	77.68
మానకొండూరు	85.36	81.32
హుజూరాబాద్	84.40	80.62
హుస్నాబాద్	83.97	78.75
కోరుట్ల	75.84	75.46
జగిత్యాల	78.83	73.91
ధర్మపురి	80.19	79.00
రామగుండం	71.94	68.71
మంథని	85.41	79.14
పెద్దపల్లి	84.08	81.01
వేములవాడ	80.62	78.43
సిరిసిల్ల	80.88	74.02

ఉమ్మడి నల్లగొండ జిల్లా (12)

	2018	2023
నల్లగొండ	85.59	81.50
నకిరేకల్	88.9	86.67
మునుగోడు	91.3	91.51
దేవరకొండ	86.24	82.33
నాగార్జునసాగర్	86.8	85.58
మిర్యాలగూడ	85.30	83.47
సూర్యాపేట	87.08	79.95
తుంగతుర్తి	86.33	87.51
హుజూర్‌నగర్	86.94	86.31
కోదాడ	89.44	85.38
భువనగిరి	90.77	89.90
ఆలేరు	91.47	90.16

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా (9)

	2018	2023
నిజామాబాద్ అర్బన్	62.65	62.56
నిజామాబాద్ రూరల్	79.15	76.42
కామారెడ్డి	78.83	74.86
ఎల్లారెడ్డి	86.32	83.16
బాన్సువాడ	84.10	81.26
జుక్కల్	85.56	81.61
బోధన్	81.34	71.08
ఆర్మూర్	79.08	76.01
బాల్కొండ	79.70	79.30

ఉమ్మడి ఖమ్మం జిల్లా (10)

	2018	2023
ఖమ్మం	77.7	71.53
పాలేరు	99.9	90.28
మధిర	97.9	87.83
వైరా	94.2	86.66
సత్తుపల్లి	95.9	85.27
కొత్తగూడెం	90.5	76.50
పినపాక	90.5	79.60
ఇల్లెందు	89.6	79.30
అశ్వారావుపేట	97.8	80.13
భద్రాచలం	87.3	78.40

ఉమ్మడి వరంగల్ జిల్లా (12)

	2018	2023
వరంగల్ పశ్చిమ	59.21	53.00
వరంగల్ తూర్పు	73.45	66.82
జనగామ	86.19	84.01
స్టేషన్‌ఘన్‌పూర్	88.14	86.44
పాలకుర్తి	89.01	86.68
డోర్నకల్	88.96	86.71
మహబూబాబాద్	85.06	81.09
నర్సంపేట	90.35	87.89
పరకాల	89.51	83.70
వర్ధన్నపేట	83.92	80.22
భూపాలపల్లి	82.33	81.20
ములుగు	82.75	91.51

ఎన్నికల విధుల్లో గుండెపోటుతో ఉద్యోగి మృతి

పటాన్‌చెరుటౌన్/కైలాస్‌నగర్: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగిన ఈ సంఘటనపై ఎస్ఐ సురేందర్ రెడ్డి కథనం ప్రకారం.. కొండాపూర్ మండలం గొల్లపల్లికి చెందిన నీరడి సుధాకర్ (43) కొండాపూర్‌లో వెటర్నరీ విభాగంలో సహాయకునిగా పని చేస్తున్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామం (248) పోలింగ్ బూత్‌లో ఎన్నికల విధులు నిర్వహించేందుకు వచ్చారు. ఈ క్రమంలో అర్ధరాత్రి గుండెపోటు రావడంతో సీపీఆర్ చేసి పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే చెందినట్లు వెల్లడించారు.

ఓటు వేయడానికి వచ్చి మృతి

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ కాలనీకి చెందిన చంద్రగిరి రాజన్న (65) ఓటు వేసేందుకు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి వచ్చాడు. క్యూలో నిల్చున్న సమయంలో కళ్లు తిరిగి కింద పడ్డాడు. వెంటనే స్థానికులు హుటాహుటిన రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వృద్ధుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు.

కాంగ్రెస్.. ఎంఐఎం మధ్య ఘర్షణలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ జిల్లాలో పాతబస్తీ పరిధిలోని కొన్ని నియోజకవర్గాల్లో ఎంఐఎం, కాంగ్రెస్‌ల మధ్య ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, మలక్‌పేట, నాంపల్లి నియోజకవర్గాల్లో ఈ పరిస్థితులు తలెత్తాయి. బహదూర్‌పురాలో సాయంత్రం 5 గంటలకు పోలింగ్ బూత్‌ను పరిశీలించి వెళ్తున్న కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్‌పై ఎంఐఎం కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. కిషన్‌బాగ్ ఎంఐఎం కార్పొరేటర్ హుస్సేనీపాషా కాంగ్రెస్ కార్యకర్తలపై దాడికి దిగారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినందుకు యాకుత్‌పురా ఎంబీటీ అభ్యర్థి అమ్జదుల్లాఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లిలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ జరిగిందనే ప్రచారంతో కాంగ్రెస్ అభ్యర్థి ఫిరోజ్‌ఖాన్ అక్కడకు చేరుకున్నారు. ఎంఐఎం ఏజెంట్లు ఆయనను వెంబడించడంతో కాసేపు పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఎంఐఎం అభ్యర్థి మాజిద్ హుస్సేన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చింతమడకలో ఓటేసిన కేసీఆర్ దంపతులు

సాక్షి, సిద్దిపేట: బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ గురువారం సిద్దిపేట నియోజకవర్గంలోని చింతమడక గ్రామంలో సతీమణి శోభారాణితో కలసి ఓటేశారు. చింతమడకలోని 13వ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. హెలికాప్టర్‌లో ఉదయం 11:50 గంటలకు చింతమడకకు చేరుకున్న కేసీఆర్ దంపతులు అక్కడి నుంచి వాహనంలో 11:56 గంటలకు పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. 11:58కు లోపలికి వెళ్లి 12 గంటలకు ఓటేసి బయటకు వచ్చారు. తిరిగి హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణం అయ్యారు.

సిద్దిపేటలో ఓటేసిన హరీశ్, కుటుంబ సభ్యులు
మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటలోని అంబిటాస్ స్కూల్‌లో ఓటు వేశారు. హరీశ్‌రావు సతీమణి శ్రీనిత, కుమారుడు ఆర్చిస్‌మన్‌తో కలసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం హరీశ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చాలా పాజిటివ్ ఓటింగ్ జరిగిందన్నారు.


చింతమడకలో ఓటు వేయడానికి వచ్చిన సీఎం కేసీఆర్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న మహిళ


హైదరాబాద్ నందినగర్‌లో ఓటు వేసిన మంత్రి కేటీఆర్ దంపతులు


సిద్దిపేటలో కుటుంబ సభ్యులతో కలసి ఓటు వేసిన మంత్రి హరీశ్‌రావు

రాష్ట్రవ్యాప్తంగా 'పింక్ వేవ్': ఎమ్మెల్సీ కవిత




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా గులాబీ ప్రభంజనం(పింక్ వేవ్) ఉందని, తెలంగాణ ప్రజలు చరిత్ర సృష్టించబోతున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు ఖాయమని, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా రికార్డు సాధిస్తారన్నారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్సీ కవిత జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మతల్లి గుడిలో పూజలు చేశారు. క్షేత్రస్థాయి నుంచి తమకు అందుతున్న సమాచారం ప్రకారం బీఆర్‌ఎస్ పార్టీకి సానుకూలత ఉందని తెలుస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వస్తు న్న పింక్ వేవ్ చూస్తే బీఆర్‌ఎస్ పార్టీని, సీఎం కేసీఆర్‌ని ఆశీర్వదించి ప్రజలు చరిత్ర సృష్టించబోతున్నారని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి అనేక ఫేక్ సర్వేలు వస్తుంటాయని, గత ఎన్నికల్లోనూ ఇలానే జరిగిందని కవిత అన్నారు. కాగా, బంజారాహిల్స్‌లోని బీఎస్ డీఏవీ స్కూల్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గురువారం ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఎమ్మెల్సీ కవితపై కేసు నమోదు
బంజారాహిల్స్: ఎమ్మెల్సీ కవితపై ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కేసు నమోదైంది. గురువారం బంజారాహిల్స్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటేసిన అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ ప్రజలంతా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. సీఎం కేసీఆర్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని... ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రచార గడువు ముగిశాక ఓటు అడగటం నేరం కావడంతో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు ప్రజాప్రాతినిధ్య చట్టం కింద కేసు నమోదు చేశారు.

హ్యాట్రిక్‌పై బీఆర్‌ఎస్ ధీమా!

▶ మొదటి పేజీ తరువాయి

ఆదివారం వెలువడే ఫలితాలు ఉంటాయని బీఆర్‌ఎస్ గట్టిగా విశ్వసిస్తోంది. సీఎం కేసీఆర్ దంపతులు గురువారం ఉదయం ఎర్రవల్లి ఫామ్ హౌజ్ నుంచి హెలికాప్టర్‌లో వెళ్లి సిద్దిపేట నియోజకవర్గం చింతమడకలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. తిరిగి ఫామ్ హౌజ్‌కు చేరుకున్న కేసీఆర్.. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ సరళిని పరిశీలిస్తూ పార్టీ అభ్యర్థులు, నేతలకు ఫోన్ ద్వారా దిశానిర్దేశం చేశారు. మరోవైపు కేటీఆర్, హరీశ్‌రావు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల, సిద్దిపేట సెగ్మెంట్లలో పోలింగ్ సరళిని పరిశీలిస్తూనే, తమకు బాధ్యతలు అప్పగించిన నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.



అధికారం ఖాయమంటూ వార్‌రూమ్ నివేదిక

అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక నియోజకవర్గాల్లో, హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వార్ రూమ్‌లను ప్రారంభించింది. ఎన్నికల ప్రచారం, పోల్ మేనేజ్‌మెంట్ సహా అనేక అంశాలను అవి సమన్వయం చేస్తూ వచ్చాయి. క్షేత్రస్థాయి పరిస్థితిపై ఎప్పటికప్పుడు నివేదికలను అందజేశాయి. ఆ నివేదికల ఆధారంగా నియోజకవర్గాల వారీగా ఫలితాలను బీఆర్‌ఎస్ అంచనా వేసుకుంది. ఈ క్రమంలో పోల్ మేనేజ్‌మెంట్‌లో ప్రతిపక్షాల కంటే ముందంజలో ఉన్నామని, అది కలసి వస్తుందని ధీమా గా ఉంది. పార్టీ సాంప్రదాయ ఓటు బ్యాంకు, ప్ర భుత్వ పథకాల లబ్ధిదారులు, విద్యావంతులైన యు వత, క్షేత్రస్థాయిలో పోల్ మేనేజ్‌మెంట్ అనుకూలించినట్టు భావిస్తోంది. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా లబ్ధిదారుల్లో 90శాతం మంది ఓటర్లు బీఆర్‌ఎస్‌కే ఓటేశారని.. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు కూడా గంపగుత్తగా కాంగ్రెస్‌కు పడలేదని వార్‌రూమ్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్‌తోపాటు రంగారెడ్డి జిల్లాలో కొన్ని నియోజకవర్గాలు కలిపి మొత్తంగా 40కిపైగా సీట్లలో బీజేపీ గణనీయంగా ఓట్లు సాధించే పరిస్థితి ఉందని, ఇది కాంగ్రెస్‌కు పగ్గాలు వేసిందని బీఆర్‌ఎస్ అంచనా వేస్తోంది. హైదరాబాద్‌తోపాటు ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మెజారిటీ సీట్లు తమకే దక్కుతాయని లెక్కలు వేసుకుంటోంది. కేవలం ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలో మాత్రం కాంగ్రెస్ తమపై పైచేయి సాధించే అవకాశం ఉన్నట్టు పోలింగ్ సరళిని బట్టి అంచనాకు వస్తోంది.

వర్గాల వారీగా లెక్కలు..

ప్రభుత్వ వ్యతిరేక ఓట్లలో గ్రామీణ ప్రాంత యువత ఓట్లు చాలా వరకు కాంగ్రెస్ కంటే బీజేపీకే ఎక్కువ పడ్డాయని బీఆర్‌ఎస్ అంచనా వేస్తోంది. తొలిసారి ఓటు హక్కు పొందిన వారిలో మెజారిటీ ఓటర్లు బీఆర్‌ఎస్‌కే వేశారని అంటోంది. క్షేత్రస్థాయిలో చాలాచోట్ల కాంగ్రెస్‌కు పటిష్ట యంత్రాంగం లేకపోవడాన్ని బీఆర్‌ఎస్ అభ్యర్థులు అనువుగా మల్చుకోవడంలో సఫలమయ్యారని క్షేత్రస్థాయిలో పని చేసిన ఏజెన్సీలు పేర్కొన్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇక క్షేత్రస్థాయిలో సామాజిక వర్గాల వారీగా ఓటింగ్ తీరునూ బీఆర్‌ఎస్ మదింపు చేస్తోంది. దళితబంధు, బీసీ బంధు, డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ యువత అంశాలతోపాటు పార్టీ అభ్యర్థులపై, వారి అనుచరులపై వ్యతిరేకత వంటివి కొంత మేర ప్రతికూలత చూపినట్టు భావిస్తోంది.

ఓటు వేయలేకపోయిన తమ్మినేని



ఖమ్మం రూరల్: ఖమ్మం జిల్లా పాలేరు సీపీఎం అభ్యర్థి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తన ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. గతంలో ఆయనకు హైదరాబాద్‌లో ఓటు హక్కు ఉండగా ఇటీవలే స్వగ్రామమైన ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లికి మార్చించుకున్నారు. దీంతో గుర్తింపు కార్డు కూడా జారీ అయింది. అయితే గురువారం ఓటు వేయడానికి పోలింగ్‌కు బూత్‌కు వెళ్లగా గుర్తింపు కార్డులో చిరునామా మారినా నియోజకవర్గం దగ్గర పాలేరుగా నమోదు కాలేదు. దీంతో అధికారులు అభ్యంతరం చెప్పడంతో తమ్మినేని ఓటు వేయకుండానే వెనుదిరిగారు.

బలపడుతున్న అల్పపీడనం

- శుక్రవారం ఉదయం వాయుగుండంగా మారే అవకాశం
- 3న తుపానుగా బలపడే సూచన
- ఏపీలో ఒకట్రెండు చోట్ల మోస్తరు వర్షాలకు అవకాశం



సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి: ఆగ్నేయ బంగాళాఖాతం, దక్షిణ అండమాన్ సముద్ర ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్న తీవ్ర అల్పపీడనం మరింత బలపడి శుక్రవారం ఉదయానికి వాయుగుండంగా మారనుంది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తోందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది మరింత బలపడి 3వ తేదీ మధ్యాహ్నానికి నైరుతి బంగాళాఖాతానికి చేరుకొని తుపానుగా మారనుంది. మరోవైపు.. నైరుతి బంగాళాఖాతం, దాన్ని ఆనుకొని దక్షిణ శ్రీలంకపై సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటరలఎత్తు వరకూ ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. తుపాను ప్రభావం కోస్తా తీరం వెంబడి ఉండే అవకాశం ఉంది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే సూచనలున్నట్లు వెల్లడించారు.

భద్రాద్రి ప్రధాన రహదారిపై మందుపాతర గుర్తింపు

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కలివేరు – పెదమిడిసిలేరు మార్గంలో మావోయిస్టులు ప్రధాన రహదారిపై పోలీసులే లక్ష్యంగా ఏర్పా టు చేసిన మందుపాతరను భద్రతా బలగాలు గురువారం గుర్తించాయి. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు ఈ మార్గంలో వారం రోజుల క్రితం కూడా రోడ్డుకు ఇరువైపులా ట్రాక్టర్ నాగళ్ల తో దున్ని తనిఖీ చేశారు. అయితే రహదారి మధ్యలో మందుపాతర ఏర్పా టు చేసిన మావోయిస్టులు..గురువారం పోలింగ్ ప్రదేశాలకు వెళ్లే బలగాల ను మట్టుబెట్టేలా వ్యూహం పన్నారు. ఉదయం తనిఖీ చేస్తున్న పోలీసులకు రోడ్డుపక్కన ఎలక్ట్రిక్ వైరు కనిపించడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించడంతో మందుపాతర బయటపడింది. పోలీసులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉండటంతో దానిని బయటకు తీయకుండా అలాగే వైర్లను తొలగించారు. శుక్రవారం ఉదయం అదే ప్రాంతంలో నిర్వీర్యం చేయనున్నట్లు తెలిసింది.

తెలంగాణను గెలుస్తున్నాం: కేటీఆర్

- మరోమారు అధికారం మాదే
- 70కి పైగా స్థానాల్లో గెలిచి తీరుతాం..
- ఎగ్జిట్ పోల్స్ అన్నీ రబ్బిష్



తెలంగాణ భవన్‌లో ఎగ్జిట్ పోల్స్‌పై మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: పోలింగ్ ప్రక్రియ పూర్తి కాకమునుపే వెల్లడైన ఎగ్జిట్ పోల్ ఫలితాలు 'రబ్బిష్' అని, డిసెంబర్ 3న వెలువడే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 70కి పైగా స్థానాల్లో గెలిచి తీరుతామని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ధీమా వ్యక్తం చేశారు. వందకు వంద శాతం తాము మరోమారు అధికారంలోకి వస్తున్నామని, తెలంగాణను గెలుస్తున్నామని అన్నారు. గురువారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పోలింగ్ ప్రక్రియ పూర్తి కాకమునుపే కొన్ని మీడియా సంస్థలు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను విడుదల చేయడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ ప్రక్రియ పూర్తిగా ముగియకుండా కొనసాగుతుండగానే ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదల చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఎలా అనుమతి ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. ఎగ్జిట్ పోల్ ఫలితాల వెల్లడి గడువు కుదించడంలో తమ ప్రమేయం లేదని, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకే జరిగిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి చెప్పారని కేటీఆర్ పేర్కొన్నారు.

ఇలాంటి ఎగ్జిట్ పోల్స్ మాకు కొత్తకాదు

'మేము 88కి పైగా స్థానాల్లో గెలుస్తామని అనుకున్నా చిన్న చిన్న ఆటంకాలు వచ్చాయి. జాతీయ మీడియాలో కొన్ని సంస్థలు సర్వే చేయకుండానే కొద్దిపాటి గణాంకాలను రాకెట్ సైన్స్ లాగా చూపుతారు. ఎగ్జిట్ పోల్స్ పేరిట వారు చేసే న్యూసెన్స్, నాన్సెన్స్‌తో ఆ సంస్థల ప్రతిష్ట దెబ్బతింటుందనే విషయాన్ని గమనించాలి. ఈ రకమైన ఎగ్జిట్ పోల్స్ మాకు కొత్త కాదు, గతంలోనూ ఇదే తరహాలో ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడించి, ఆ తర్వాత నాలుక కరుచుకున్నారు. ప్రజలు ఓ వైపు ఓటు వేస్తున్న సమయంలోనే ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఎలా సాధ్యమని మేము మిమ్మల్ని నిలదీయవచ్చు కానీ అంతదూరం వెళ్లదలుచుకోలేదు. అనని మాటలు అన్నట్లు సోషల్ మీడియా, ఇతర మీడియాల్లో చేస్తున్న ప్రచారంపైనా ఎలక్షన్ కమిషన్ దృష్టి సారించాలి. హైదరాబాద్ సహా దేశంలోని అనేక పెద్ద పట్టణాల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉంటోంది. రాష్ట్రంలో ఏవో చిన్నా చితకా ఘటనలు తప్ప పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మా పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు అన్ని పార్టీల సహకారంతో ఇది సాధ్యమైంది..'అని కేటీఆర్ అన్నారు.

ఆర్టీసీకి డబ్బులే డబ్బులు..

ఎన్నికల వేళ భారీగా ఆదాయం నమోదు
- రాజకీయ సభలకు 10వేలకుపైగా బస్సులు అద్దెకు
- ఒక్కో బస్సుకు రూ.22 వేల చొప్పున వసూలు
- పోలింగ్ సందర్భంగా 1700 స్పెషల్ బస్సుల నిర్వహణ



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల నేపథ్యాన్ని ఆర్టీసీ బాగానే వినియోగించుకుంది. వీలైనన్ని బస్సులను రాజకీయ పార్టీల సభలకు అద్దెకివ్వటం ద్వారా మంచి ఆదాయాన్ని పొందింది. గత నెలన్నర సమయంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ తమ బహిరంగ సభలకు దాదాపు 10 వేల నుంచి 12 వేల బస్సులను అద్దెకు తీసుకున్నట్టు తెలిసింది. ఒక్కో బస్సుకు రోజుకు రూ.22 వేల అద్దెలను అవి చెల్లించాయి. వెరసి ఈ రూపంలో ఆర్టీసీకి మంచి ఆదాయం నమోదైంది.

వంద శాతం ఆక్యుపెన్సీరేషియో..
ఆర్టీసీ బస్సులకు సగటున 65 శాతం మేర ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతుంటుంది. అంటే 35 శాతం సీట్లు ఖాళీగా ఉంటాయన్నమట. అంతమేర ఆదాయాన్ని ఆర్టీసీ కోల్పోతుంది. కానీ, ప్రైవేటు కార్యక్రమాలకు బస్సులను అద్దెకిస్తే, ఎన్ని సీట్లు నిండుతాయన్న విషయంతో సంబంధం లేకుండా.. మొత్తం సీట్లకు చార్జీ లెక్క కట్టి అద్దెను ఖరారు చేస్తుంది. రాజకీయ పార్టీలకు అద్దెకిస్తే ఒక్కో బస్సుకు రూ.22 వేల చార్జీని వసూలు చేస్తోంది. ఎన్నికల ప్రక్రియ మొదలైన తర్వాత ఐదు పర్యాయాలు ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రంలో పర్యటించారు. ఎనిమిది బహిరంగ సభలు, ఒక రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఆయన సభలను బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పెద్ద ఎత్తున జనాన్ని సమీకరించింది. ఇందుకోసం ఒక్కో సభకు వేయి చొప్పున ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకున్నట్టు తెలిసింది. ఇక అమిత్‌షా సభలకు కూడా బీజేపీ భారీగా బస్సులను అద్దెకు తీసుకుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. ఆయన సభలను కూడా బీఆర్‌ఎస్ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని జన సమీకరణ జరిపారు. ఆయన పాల్గొన్న ఒక్కో సభకు దాదాపు 650 నుంచి 800 వరకు బస్సులు వినియోగించారు. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ సభలకు కాంగ్రెస్ కూడా అదే తరహాలో బస్సులు అద్దెకు తీసుకుంది. ఇవి కాకుండా వేరే రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాష్ట్ర నేతలు పాల్గొన్న సభలకు కూడా బస్సులను అద్దెకు తీసుకున్నారు.

వ్యాన్లకు బదులు ఆర్టీసీ బస్సులే బెటర్ అనుకుని..
చిన్న చిన్న వ్యాన్లకు బదులు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకోవటం నేతలకు సులభంగా మారింది. ఎక్కడికక్కడ డిపోలు అందుబాటులో ఉండటం, ఫోన్ల మీద బస్సులను బుక్ చేసుకునే వెసులుబాటు, డ్రైవర్లు, నిర్వహణ పరంగా సమస్య లేకపోవటంతో ఆర్టీసీ బస్సుల వైపే అన్ని పార్టీల నేతలు మొగ్గు చూపారు. దీన్ని రోడ్డు రవాణా సంస్థ తనకు అనుకూలంగా మలుచుకుంది. ప్రస్తుతం ఆర్టీసీ గ్రాండ్ ఫెస్టివల్ ఛాలెంజ్ పేరుతో ఆదాయాన్ని పెంచుకునే కసరత్తు చేస్తోంది. దసరా నుంచి సంక్రాంతి వరకు ఇది కొనసాగనుంది. ఎన్నికల నేపథ్యంలో, ఇతర ప్రధాన పండగలతోపాటు ఎన్నికలను కూడా ఫెస్టివల్ చాలెంజ్‌లో చేర్చి, రాజకీయ పార్టీలు బస్సులను బుక్ చేసుకునేలా చూడాలంటూ సిబ్బందికి ఆదేశాలిచ్చింది. అలా ఆర్టీసీ అధికారులు పార్టీల నేతలను సంప్రదిస్తూ వీలైనన్ని బస్సులు బుక్ అయ్యేలా చూశారు.

రోజుకు రూ. కోటికి మించే?

ఈ అద్దె బస్సులు వాస్తవంగా ఎన్ని బుక్ అయ్యాయి, వాటి ద్వారా ఎంత ఆదాయం వచ్చిందన్న విషయాన్ని ఆర్టీసీ బహిరంగంగా వెల్లడించటం లేదు. కానీ, గతేడాది ఇదే సమయంతో పోలిస్తే గత నెలన్నరగా నిత్యం ఆదాయం అదనంగా నమోదైంది. నిత్యం దాదాపు రూ.కోటిని మించి ఆదాయం ఎక్కువగా నమోదైంది. అందులో సింహభాగం ఈ అద్దె బస్సుల ద్వారానే అని తెలుస్తోంది. ఇక ఓటేసేందుకు ప్రజలు సొంతూళ్లకు ఎక్కువగా వెళ్తారని ముందుగానే ఊహించి నవంబరు 29, 30 తేదీల్లో భారీ సంఖ్యలో ప్రత్యేక బస్సులు తిప్పింది. బుధవారం ఒక్కరోజే ఏకంగా 1500 వరకు తిప్పగా, గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మరో 500కుపైగా నడిపింది. ఈ రూపంలో కూడా అదనపు ఆదాయం సమకూరింది. 2022 నవంబరు 29న ఆర్టీసీకి టికెట్ల రూపంలో రూ.13.29 కోట్ల ఆదాయం సమకూరింది. సరిగ్గా అదే ఈ నవంబరు 29న రూ.16.77 కోట్ల ఆదాయం సమకూరిందని తెలుస్తోంది.

ఆకాశాలకూ, భూమికీ మరియు వాటి మధ్యనున్న సమస్తానికీ ఆయనే ప్రభువు.
కావున మీరు ఆయననే ఆరాధించండి, ఆయన ఆరాధనలోనే స్థిరంగా వుండండి.
– ఇస్లాం ధర్మం

ఫోకస్

సాక్షి

శుక్రవారం, 1 డిసెంబర్ 2023

అమెరికా నిందలో నిజమెంత?

ఖండాంతరాలు దాటి వెళ్లి శత్రువుగా భావించినవారిని చడీచప్పుడూ లేకుండా అంతం చేయటం అంతర్జాతీయంగా ఎప్పటినుంచో వినిపిస్తున్న కథే. ఈ విషయంలో తరచుగా ఇజ్రాయెల్, రష్యాల పేర్లు వస్తుంటాయి. ప్రచ్ఛన్నయుద్ధకాలంలో ఎక్కువగా అమెరికా గూఢచార సంస్థ సీఐఏ పేరు వినబడేది. దాని లక్ష్యాలన్నీ దేశాధినేతలే. అది సాగించిన హత్యలపై ఆ సంస్థనుంచి రిటైరైనవారు ఎన్నో పుస్తకాలు రాశారు. సీఐఏ సాగించిన ఆపరేషన్లు ఇతివృత్తంగా 30కి పైగా చలనచిత్రాలొచ్చాయి. టీవీ సీరియల్స్ కూడా తక్కువేం కాదు. చిత్రమేమంటే ఈమధ్య కొత్తగా వెలుగులోకొచ్చిన సీఐఏ ఫైళ్ల ఆధారంగా 'ది లుముంబా ప్లాట్' అనే పేరుతో అప్పటి కాంగో ప్రధాని పాట్రిస్ లుముంబాను 1961లో హతమార్చిన తీరుపై స్టువార్ట్ ఏ. రీడ్ అనే ఆయన ఒక పుస్తకాన్ని వెలువరించాడు. అలాంటి అమెరికా గడ్డపై ఖలిస్తానీ ఉద్యమకారుణ్ణి హతమార్చటానికి జరిగిన కుట్రలో భారత ప్రభుత్వ అధికారి ప్రమేయం వున్నదని అమెరికా ఆరోపిస్తోంది. మొన్న జూన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా సందర్శించిన తర్వాత ఈ కుట్ర గురించి మన ప్రభుత్వాన్ని అమెరికా హెచ్చరించిందని నవంబర్ 22న బ్రిటన్‌కు చెందిన 'ద ఫైనాన్షియల్ టైమ్స్' వెల్లడించింది. బుధవారం న్యూయార్క్ సిటీ కోర్టులో ప్రభుత్వ అటార్నీ విలియన్స్ 15 పేజీల అభియోగపత్రాన్ని కూడా దాఖలు చేశారు. అందులో ఈ కుట్ర లక్ష్యం ఎవరన్న పేరు ప్రస్తావించికపోయినా సిఖ్స్ ఫర్ జస్టిస్ సంస్థ నాయకుడు పత్వంత్‌సింగ్ పన్నూన్ అని అక్కడి మీడియా అంటున్నది. ఇటీవల కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో సైతం ఇటువంటి ఆరోపణే చేశారు. అక్కడ దుండగుల కాల్పుల్లో మరణించిన ఖలిస్తాన్ వేర్పాటువాది హర్‌దీప్ సింగ్ నిజ్జార్ హత్యలో భారత్ పాత్ర వున్నదని ఆయన అభియోగం. ఇందుకు సంబంధించి మన దౌత్యవేత్తను బహిష్కరించింది కూడా. నిరాధారమైన ఆరోపణ చేయడాన్ని మన దేశం తప్పుబట్టి ప్రతీకారంగా ఢిల్లీలోని కెనడా దౌత్యవేత్తను బహిష్కరించింది. దౌత్య సిబ్బందిని తగ్గించుకోమని కెనడాను కోరింది. ఆ అంకం ముగియకుండానే తాజాగా అమెరికా సైతం ఆ మాదిరి ఆరోపణే చేయటం సహజంగానే అందరినీ ఆశ్చర్యపరుస్తుంది.

సాధారణంగా మిత్ర దేశాలమధ్య ఈ తరహా పొరపొచ్చాలు రావు. ప్రచ్ఛన్నయుద్ధకాలంలో మనం సోవియెట్ యూనియన్‌తో సన్నిహితంగా వుండటాన్ని జీర్ణించుకోలేక అమెరికా పాకిస్తాన్‌కు అండదండలందించేది. ప్రపంచీకరణ తర్వాత అంతా మారింది. ఇప్పుడు మనకు అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలు బలంగా వున్నాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనాను కట్టడి చేసేందుకు భారత్ సహాయసహకారాలు అవసరమని అమెరికా విశ్వసిస్తోంది. తన ఆరోపణను నిర్ద్వంద్వంగా రుజువుచేసే సాక్ష్యాధారాలు అమెరికా దగ్గరున్నాయా? భారత ప్రభుత్వ అధికారి ఒకరు నిఖిల్ గుప్తా అనే భారత పౌరుడి ద్వారా ఒక కిరాయి హంతకుణ్ణి వినియోగించి పన్నూన్‌ను హతమార్చటానికి కుట్ర చేశారని అటార్నీ దాఖలు చేసిన అభియోగపత్రం చెబుతోంది. అయితే నిఖిల్ గుప్తా అమెరికా మాదకద్రవ్య నిరోధక సంస్థ తాలూకు ఏజెంట్‌ను కిరాయి హంతకుడిగా పొరబడి పన్నూన్ హత్యకు లక్షన్నర డాలర్లు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడని, అడ్వాన్స్‌గా 15,000 డాలర్లు అందజేశాడని అటార్నీ ఆరోపణ. దీనికి సంబంధించిన ఫొటోలు కూడా అభియోగపత్రానికి జత చేశారు. ఈ హత్య చేయించగలిగితే అతనిపై గుజరాత్‌లో వున్న క్రిమినల్ కేసును రద్దు చేయిస్తానని భారత అధికారి వాగ్దానం చేశారని ఎఫ్‌బీఐ చెబుతోంది. మాదకద్రవ్యాలు, మారణాయుధాల విక్రయం కేసులో నిందితుడైన నిఖిల్ గుప్తా చెక్ రిపబ్లిక్‌కు వెళ్లిన సమయంలో అతన్ని అరెస్టు చేయాలంటూ ఎఫ్‌బీఐ కోరటంతో మొన్న జూన్ 30న అక్కడి పోలీసులు అదుపులోనికి తీసుకుని అమెరికాకు అప్పజెప్పారు. కెనడాలో జరిగిన నిజ్జార్ హత్యలో తమ హస్తమున్నదని గుప్తా ఎఫ్‌బీఐ ఏజెంట్ దగ్గర అంగీకరించాడంటున్నారు.

ఖలిస్తాన్‌పై రిఫరెండమ్ జరగాలని పత్వంత్ సింగ్ డిమాండ్ చేస్తున్నారు. ఆయనకు అమెరికా, కెనడా పౌరసత్వాలున్నాయి. ఖలిస్తాన్ వాదాన్ని మన ప్రభుత్వం ఎప్పుడూ అంగీకరించలేదు. 80, 90 దశకాల్లో ఖలిస్తాన్ పేరిట పంజాబ్‌లో ఉగ్రవాదులు సాగించిన మారణకాండను కఠినంగా అణిచేసింది. 1985 జూన్ 23న 329మంది ప్రయాణికులతో కెనడానుంచి ఢిల్లీ వస్తున్న ఎయిరిండియా కనిష్క విమానాన్ని ఉగ్రవాదులు బాంబులతో పేల్చివేశారు. ఆ విషయంలో కెనడా ప్రభుత్వం భారత్‌కు ఎలాంటి సహకారమూ అందించలేదు సరిగదా...కీలకమైన సాక్ష్యాధారాలను పోలీసులు ధ్వంసం చేశారని కూడా ఆరోపణలొచ్చాయి. ఈనాటికీ ఈ కేసు అతీగతీ లేకుండాపోయింది. అమెరికా చేసిన ఆరోపణలపై మన దేశం ఇప్పటికే ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటుచేసింది. అది అందించే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపింది. నిఖిల్ గుప్తాతో ఒప్పందం కుదుర్చుకున్న వ్యక్తి నిజంగానే ప్రభుత్వాధికారా? అధికారే అయితే అత్యుత్సాహంతో అతను పరిధి దాటి ప్రవర్తించాడా? వేరే దేశాల్లో వ్యక్తులను లక్ష్యంగా చేసుకోవటం తమ విధానం కాదని నిజ్జార్ కేసు సందర్భంగా మన దేశం చెప్పింది. పైగా పకడ్బందీ వ్యవస్థలు అమల్లోవున్న అమెరికాలో అలాంటి పనికి ఎవరైనా సాహసిస్తారా అన్నది సందేహాస్పదం. పంజాబ్‌లో కనుమరుగైన ఖలిస్తాన్ ఉద్యమాన్ని మన దేశం ఇంత సీరియస్‌గా తీసుకుంటుందా అన్నది కూడా అనుమానమే. అమెరికా దగ్గరున్న సాక్ష్యాలు నిజంగా అంత బలంగా వున్నాయా, వుంటే దీన్ని తెగేదాకా లాగుతుందా అన్నది చూడాలి. ఈ కేసు సంగతెలావున్నా మన ప్రభుత్వం భవిష్యత్తులో ఈ మాదిరి ఆరోపణలకు తావు లేకుండా చూసుకోవాల్సిన అవసరం వుంది.

వాస్తవ రూపంలో 'దున్నేవాడిదే భూమి'


ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

'ఎవరెన్ని చెప్పినా పేద ప్రజల ప్రయోజనాలకు మాత్రం రక్షణ లేదు. మన ప్రభుత్వం నమ్రతతో ఈ సత్యాన్ని అంగీకరించి తీరాలి' అని ఒకప్పుడు కఠోర సత్యం చెప్పారు మహాత్మా గాంధీ. కానీ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా కూడా ఆ ధోరణిలో మార్పు రాలేదు. తరాలుగా పేద ప్రజలు కాయకష్టం చేసి సంపద సృష్టిస్తున్నారు. అలాంటి పేద ప్రజలకు నిర్ణయాధికారం లేదు. వారి యాజమాన్య హక్కులకు ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రాణం పోశారు. అసైన్డ్ భూముల మీద వారికి పూర్తి హక్కులు కల్పించడం ఒక చారిత్రక నిర్ణయం. దశాబ్దాలుగా పోరాటాల రూపంలో వెల్లడైన పేదల కాంక్షలకు నేటి ఈ నిర్ణయం అంతిమ విజయంగా భావించుకోవాలి.

"కోట్లాది దేశ ప్రజలకు ఆహార పంటలు అందించే రైతులకన్నా దేశంలోని పెట్టుబడిదారులకే ప్రభుత్వాలు సర్వ సౌకర్యాలు కల్గిస్తున్నాయి. ఇది కంటికి కన్పించే నగ్న సత్యం. నేను పెట్టుబడిదారులకు వ్యతిరేకిని కాదు. నిజం చెప్పాలంటే, నేను ఒక పెట్టుబడిదారుడికి చెందిన ఇంట్లోనే ఉంటున్నాను. కానీ పెక్కుమంది పెట్టుబడిదారుల వైఖరి ఎలా ఉంటుందో నాకు తెలుసు. ప్రభుత్వాలు మాత్రం తాము పేద ప్రజలకు చేయవలసిందంతా చేస్తున్నామని పైకి చెప్పొచ్చుగాక. ఆ మాటకొస్తే వలస పాలకులైన బ్రిటిష్ వాళ్ళు కూడా అలాగే చెబుతూండేవాళ్లు. అసలు సత్యం ఏమంటే – ఎవరెన్ని చెప్పినా పేద ప్రజల ప్రయోజనాలకు మాత్రం రక్షణ లేదు. మన ప్రభుత్వం నమ్రతతో ఈ సత్యాన్ని అంగీకరించి తీరాలి. అంతేగాదు, ఏ ప్రయివేట్ ఆస్తి అయినా సరే, అది సిగ్గుఎగ్గూ లేకుండా దొంగిలించిన ఆస్తిగానే నేను పరిగణిస్తాను. ఎవరైనా సరే తన కాయకష్టం ద్వారా సంపాదించని ఆస్తి, లేదా బతుకుతెరువుకు అవసరమైన కనీస శ్రమ ఫలితంగా దక్కని సొమ్ము... సిగ్గూ ఎగ్గూ లేని సంపాదన అవుతుంది."

– మహాత్మా గాంధీ (11.12.1947). వి. రామ్మూర్తి 'హిందూ' పత్రిక తరపున ఎడిటర్‌గా సంకలనం చేసి 'కస్తూరి అండ్ సన్స్ లిమిటెడ్ (చెన్నై) తరపున 2003లో ప్రచురించిన గ్రంథం నుంచి.

తరాలుగా పేద ప్రజలు కాయకష్టం చేసి సంపద సృష్టిస్తున్నారు. ఆ బడుగు, బలహీన వర్గాలకు చెందిన హక్కులను మొట్టమొదటి సారిగా సాధికారికంగా క్రోడీకరించి... 'దున్నేవాడిదే భూమి' అన్న దశాబ్దాల వామపక్ష ఉద్యమాల స్ఫూర్తిని కొలది రోజుల నాడు ఆచరణలోకి తెచ్చారు ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి. పేద ప్రజల సాగు హక్కులకు ప్రాణం పోశారు. దీనితో పది రకాల వ్యాఖ్యానాల ద్వారా పేదల భూమి హక్కులను, సాగు హక్కులను తారుమారు చేసే మోతుబరుల ప్రయత్నాలకు స్వస్తి పలికారు. రాష్ట్రంలో మరే ప్రభుత్వం వచ్చినా, దీన్ని చెదరగొట్టే ప్రయత్నాలు చెల్లవు. ఆ ప్రయత్నాల్ని తిప్పికొట్టే శక్తినిచ్చేదే ఈ ముందడుగు.

రెండో మాట



వామపక్షాలు దశాబ్దాల తరబడిగా ఆంధ్ర, తెలంగాణలలో కౌలుదారీ చట్టాల కోసం చేస్తూ వచ్చిన పోరాటాలతో సాధించిన పాక్షిక విజయాలకు... నేటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేదలకు అసైన్డ్ భూములపై హక్కులు ఇచ్చిన తీరు భూ చరిత్రలో అంతిమ విజయంగా భావించుకోవాలి. పేదలకు ఈ యాజమాన్య హక్కులు రావడం వలన వారు అవసరం అయితే తమ భూమిని విక్రయించుకోవచ్చు.

ఇక, ఇంతకుపూర్వం కౌలు రైతులకు రుణాలు పొందే అర్హత కార్డులు ఉండేవి కావు. ఈ కార్డులు లేకనే బ్యాంకులు రుణాలివ్వలేదు. ఎంతసేపూ భూములకు పట్టాలున్న రైతుల్నే గుర్తిస్తారు. కౌలు రైతులను గుర్తించేది లేదన్న వైఖరిని కేసీఆర్ లాంటి నాయకులు కనబరిచారు. ఏదైనా ఇంట్లో అద్దెకు ఉంటే, ఆ ఇంటిపై హక్కు అతనికి ఇవ్వగలమా అని కూడా ప్రశ్నించారు. కానీ ఒకప్పుడు వై.ఎస్. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిత్వంలో నాలుగు లక్షల మందికి పైగా కౌలు రైతులు రుణ అర్హత కార్డులు పొందారు. తద్వారా అనేకమంది బ్యాంకు రుణాలు పొందగలిగారు.

కౌలుదారులకు విధిగా వర్తించాల్సిన రక్షణ చట్టాల కోసం సుదీర్ఘ పోరాటాలు జరిగిన చరిత్ర ఉంది. ఆంధ్ర–తెలంగాణ వామపక్ష నాయకులు ఆ యా ప్రాంతాలలో విడివిడిగానూ, ఉమ్మడిగానూ కలిసి పోరాటం జరిపారు. చండ్రరాజేశ్వరరావు, చలసాని వాసుదేవరావు, రావి నారాయణరెడ్డి, భీమిరెడ్డి నరసింహారెడ్డి, మగ్దుం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, ఎస్వీకే ప్రసాద్–సుగుణ దంపతులు లాంటివాళ్లు ఇందులో ఉన్నారు. ఉభయ రాష్ట్రాల చరిత్రలో తొలి భూపోరాటాలు, పాక్షిక విజయాలన్నీ వామపక్షాల నేతృత్వంలోనే సాధ్యమయ్యాయి. ఒక్క ముక్కలో, పాత ఫ్యూడల్ శక్తులకు ముగుదాడు వేసి సాధించిన విజయాలన్నీ వామపక్షాలు బలంగా ఉన్నప్పటివే. అవి ఎప్పుడు బలహీనపడ్డాయో అప్పటినుంచీ పటిష్ఠమైన పార్టీగా ఉమ్మడి వామపక్షాల మాట గతకాలపు 'ముచ్చట'గానే మిగిలిపోయింది.

కానీ ప్రస్తుత దశ వేరు. కార్పొరేట్ శక్తుల చేతిలో దేశం నడుస్తున్నది. చాలక, వారి ఆధ్వర్యంలో ప్రసార మాధ్యమాలు కూడా లొంగిపోతున్నాయి. దేశీయ, విదేశీయ ఆశ్రిత పెట్టుబడుల పెత్తనం స్వతంత్ర భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను పాతి పెట్టింది. ఈ దుస్థితిని కనిపెట్టిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్, 'రానున్న రోజుల్లో ప్రజలు పార్లమెంట్‌ను కూల్చేస్తా'రని ముందుగానే హెచ్చరించారు. గత పదేళ్లుగా ప్రతియేటా భారత పరిశోధనా సంస్థ 'ఏడీఆర్' నివేదికలు విషాద వాస్తవాన్ని చెబుతున్నాయి. అటు పార్లమెంట్ సభ్యులలో (అన్ని రకాల పార్టీల వాళ్ళు), ఇటు రాష్ట్రాల శాసన సభ్యులలో, మంత్రులలో ఎంత భారీ స్థాయిలో అవినీతి పేరుకు పోయిందో, సవరణకు వీలుకాని స్థాయిలో అవినీతి ఎలా రాజ్యమేలుతోందో ఏడీఆర్ నివేదికలు వెల్లడిస్తున్నాయి.

అందుకే మన పాలకుల్ని ఉద్దేశించి ఒక మహాకవి ఇలా హెచ్చరించాడు:

'విజ్ఞానం వికసించదు విదేశాలు తిరిగొస్తేనే
పరిణతమతి ప్రసరించదు పురాణాలు తిరగేస్తేనే!'

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పడని శిక్ష



హెన్రీ కిసింజర్ (అమెరికా విదేశాంగ శాఖ మాజీ మంత్రి; తన నూరో ఏట మరణించారు) కోసం ఇండియా, బంగ్లాదేశ్‌లో కన్నీళ్లు కార్చేవారెవరూ లేరు. యుద్ధ నేరాలకు విచారణ ఎదుర్కోకుండానే ఆయన చనిపోయారు. అదే చింత.

– సునందా వశిష్ట్, రాజకీయాంశాల వ్యాఖ్యాత

వాళ్ల సంగతేమిటి?



పాకిస్తాన్! పాలస్తీనా కోసం పోరాడు. కానీ బలోచిస్తాన్ గురించి కూడా ఆలోచించు. అది నీ దేశంలోనే ఉంది. పైగా ఆ ప్రాంతంలో జరుగుతున్న వ్యవస్థీకృత హింసకు నిజానికి రాజ్యమే జవాబుదారీ.

– నిదా కిర్‌మానీ, యాక్టివిస్ట్

అందమైన వివాహం



రణదీప్ హుడా (హరియాణా; నటుడు). లిన్ లైశరామ్ (మణిపూర్; మోడల్) దంపతులకు శుభాకాంక్షలు. ఈ అద్భుతమైన జంట ఇంఫాల్‌లో జరిగిన అందమైన మైతేయి సంప్రదాయ వివాహ వేడుక ద్వారా ఒక్కటైంది. సంవత్సరాలు గడిచే కొద్దీ మీ ప్రేమ బలోపేతం కావాలి.

– కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రి

చారిత్రక సాక్ష్యం



రెండు వేల ఏళ్ల కిందట బెత్లేహేములో జన్మించిన ఒక యూదు జన్మదిన వేడుకను ప్రపంచవ్యాప్తంగా ఉన్న 260 కోట్లమంది త్వరలో జరుపుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ ఇప్పటికీ కొంతమంది జనాలు ఆ ప్రాంతంలో యూదులు ఎవరూ 1948 కంటే ముందు లేరని అనుకుంటున్నారు.

– డేనియల్ ల్యూకోవిట్జ్, సెక్యూరిటీ ఇవాంజెలిస్ట్

బాధ్యతా రాహిత్యం



'నెట్‌ఫ్లిక్స్'లో 'రైల్వేమెన్' (వెబ్ సిరీస్) చూస్తున్న వాళ్లు తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే, యూనియన్ కార్బైడ్ కంపెనీకి హెన్రీ కిసింజర్ సలహాదారు. ఘోరమైన భోపాల్ గ్యాస్ దుర్ఘటనకు ఆ కంపెనీ బాధ్యత వహించకుండా తప్పుకోవడంలో ఆయన సాయపడ్డారు.

– ఆదిల్ హొస్సేన్, అసిస్టెంట్ ప్రొఫెసర్

గొప్ప దౌత్యవేత్త



ప్రేమించండి, ద్వేషించండి (రెండింటికీ బలమైన కారణాలు న్నాయి), కానీ హెన్రీ కిసింజర్ సంక్లిష్టమైన, అద్భుతమైన దౌత్య రాజనీతి ప్రపంచాన్ని ఆవిష్కరించారు... ముఖ్యంగా నాలాంటి అంతర్జాతీయ సంబంధాల విద్యార్థుల కోసం! ఆయన రాసిన 'డిప్లొమసీ' పుస్తకం అత్యుత్తమం, నా ఫేవరెట్. ఇది దౌత్యం, చరిత్ర, రాజకీయాలు, రాజనీతిల మేలు కలయిక.

– హేమంత్ జాకబ్, ప్రొఫెసర్

ఇంత నిర్లక్ష్యమా?



నిజ్జార్ నుంచి పన్నూ వరకు అన్నింటా మోదీ ప్రభుత్వపు నిర్లక్ష్యం జాతీయ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తోంది. న్యూయార్క్‌లో ఒక హత్యకు పథకం రచిస్తున్నారని ఓ భారత అధికారికి వ్యతిరేకంగా మూడు యూఎస్ ఏజెన్సీలు తెచ్చిన ఆరోపణలు ఒకవేళ నిజమైతే, దేశ భద్రతా నాయకత్వపు ఇమేజ్ పడిపోతుంది.

– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ప్రజల ప్రాణాలకు పరిహారమేది?

అభిప్రాయం


విశ్వ జంపాల

దోమలు, కుక్కలు, కోతులను అత్యంత ప్రమాదకరమైన ప్రాణుల జాబితాలో చేర్చాలి. వీధికుక్కలు, కోతుల బెడదపై దేశవ్యాప్తంగా పెద్ద చర్చ జరుగుతోంది. కొన్ని కేసుల్లో న్యాయస్థానాలు తీర్పులు ఇస్తున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వాల్లో ఏమాత్రం చలనం రావడం లేదు. ప్రతి సంవత్సరం అనేక మంది ప్రజలు, ముఖ్యంగా చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు వీటిబారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. దోమల వల్ల డెంగ్యూ, మలేరియా, విష జ్వరాలు వచ్చి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు, వైద్యం కోసం అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేయవలసి వస్తుంది. కొన్ని సందర్భాల్లో చనిపోతున్నారు. ఖమ్మం పట్టణానికి చెందిన ఎం.డి జనరల్ మెడిసిన్ చదువుతున్న యువ డాక్టర్ మాధవరపు గోపి (26 ఏళ్లు) ఇటీవల డెంగ్యూతో చనిపోవడం చాలా బాధాకరం. గత సెప్టెంబర్ నెలలో ములుగు జిల్లాలో 10 మంది, హనుమకొండ జిల్లాలో ఇద్దరు వ్యక్తులు డెంగ్యూతో మరణించడం అత్యంత విషాదకరం.

కోతులు, కుక్కలు కరవడం వలన కొందరు ప్రాణాలు కూడా పోతున్నాయి. కుక్కలు, కోతులు రోడ్లపై వాహన దారులుకు అడ్డువచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతీ ఇంటి పైభాగాన, ఇంటి ఆవరణలో, వీధుల్లో కుక్కలు, కోతుల మల–మూత్రాలు కుప్పలు కుప్పలుగా పేరుకు పోయి విపరీతమైన దుర్వాసన వస్తోంది. వీటి ద్వారా అనేక అనారోగ్య సమస్యలు, విష జ్వరాలు వస్తూ ప్రజలు మృత్యువాత పడుతున్నారు. దోమలు, కుక్కలు, కోతుల నిర్వహణ లేదా నిర్మూలన బాధ్యత ప్రభుత్వానిదే. ముఖ్యంగా స్థానిక ప్రభుత్వ సంస్థలది. కానీ వీరు ఏమాత్రం పట్టించుకోకపోవడం వలన ప్రజల ప్రాణాలు పోతున్నారు. కోతులు పంటపొలాలను నాశనం చేయడంతో రైతులు లబోదిబో మంటున్నారు. దోమలు, కుక్కలు, కోతుల మూలంగా చనిపోయిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలూ, స్థానిక సంస్థలూ ఉమ్మడిగా నష్టపరిహారం చెల్లించాలి.

హరియాణా–పంజాబ్ హైకోర్టు కుక్క కాటు కేసులపై ఇటీవల సంచలన తీర్పు వెలువరించింది. కుక్క కాటుకు రాష్ట్ర ప్రభుత్వాలే ప్రధాన బాధ్యత వహించాలని ధర్మాసనం పేర్కొంది. కుక్క కాటు కేసుల్లో ఒక్కోక్క గాటుకు రూ.10,000 చొప్పున బాధితుడికి నష్టపరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చింది. ప్రతి పురపాలక ప్రాంతంలో కుక్కల సంతతి నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణా హైకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసింది. కానీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. 2023 జనవరి నుండి ఆగస్టు 31 వరకు నల్లగొండ జిల్లాలోని 1,253 మంది కుక్కకాటు బారిన పడ్డారు. 2023 మే లో మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో 23 రోజుల్లో 108 మందికి కుక్క కాటుకు ఇచ్చే ఏ.ఆర్. వి. ఇంజక్షన్లు ఇచ్చారు. 2023 ఫిబ్రవరి 19న వీధి కుక్కల దాడిలో ఐదు సంవత్సరాల బాలుడు చనిపోవడం అందరినీ కలచివేసింది. ఇలా దేశంలో సగటున ప్రతి రెండు సెకండ్లకొక వీధికొక్క దాడి లేదా కుక్కకాటు ఘటన నమోదు అవుతోంది. కుక్కల దాడిలో ప్రతి అరగంటకు ఒక మనిషి మరణిస్తున్నాడు. 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్' అంచనా ప్రకారం దేశవ్యాప్తంగా రెండు కోట్ల కుక్కలు ఉన్నాయి. వీటిలో వీధి కుక్కల సంఖ్య ఎక్కువ. ఈ కుక్కల్లో ఉండే 'రేబిస్' వైరస్ కారణంగా ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి. 2030 వరకు రేబిస్ వల్ల కలిగే మరణాలను పూర్తిగా నివారించాలని ఇండియాతో పాటు ప్రపంచ దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది ఎంతవరకు నెరవేరుతుందో పాలకులే సమాధానం ఇవ్వాలి.

వ్యాసకర్త న్యాయవాది I 77939 68907

ఎయిడ్స్ విధ్వంసాన్ని నివారిద్దాం!

సందర్భం


డాక్టర్ యినమదల మురళీకృష్ణ

మానవ చరిత్రలో ఎయిడ్స్ వ్యాధి సృష్టించిన విధ్వంసం, బీభత్సం, విషాదాలతో ఏ ఒక్క ఇతర అంశాన్నీ సరిపోల్చలేము. 1981 జూన్‌లో బయటపడిన ఎయిడ్స్ అత్యధిక కాలంగా కొనసాగుతున్న ప్రపంచ పీడ. 42 ఏళ్ల కాలంలో ఎనిమిది కోట్ల 56 లక్షల మంది ఎయిడ్స్ జబ్బుకు దారి తీసే హెచ్ఐవీ క్రిమి బారిన పడ్డారు. ఇప్పటికే నాలుగు కోట్ల నాలుగు లక్షల మంది ఎయిడ్స్ జబ్బుతో మరణించారు.

చాలా ప్రపంచ పీడలు పరిమిత కాలంలోనే కల్లోలాన్ని సృష్టించి పోతుంటాయి. కానీ ఎయిడ్స్ జీవితకాలపు సాంక్రమిక జబ్బు. అందువల్ల హెచ్ఐవీ సోకిన వారు, వారి కుటుంబాలు నిరంతర చికిత్సతో, అప్పుడప్పుడు తలెత్తే అనారోగ్యాలతో ఆర్థికంగా కష్టాల పాలవుతుంటారు. సకాలంలో తగిన చికిత్స అందనిచో వారి కథ విషాదాంతమవుతుంది. ఎయిడ్స్ జబ్బుకి కారణమైన హెచ్ఐవీ క్రిమి ప్రధానంగా లైంగికంగా వ్యాప్తి చెందుతుంది. అన్ని సాంక్రమిక వ్యాధుల వలెనే... హెచ్ఐవీ వ్యాప్తికి అవగాహన లేమి, పేదరికం, ఆరోగ్య వైద్య సదుపాయాల కొరత, చదువు లేకపోవడం ముఖ్యమైన కారణాలు. ఈ పరిస్థితులు నెలకొని ఉన్న ఆఫ్రికా, ఆసియా దేశాలలో హెచ్ఐవీ ప్రబలంగా వ్యాపించింది.

2022 నాటికి ప్రపంచవ్యాప్తంగా మూడు కోట్ల 90 లక్షల మంది ఎయిడ్స్‌తో బాధపడుతున్నారు. వీరిలో 15 లక్షల మంది 15 సంవత్సరాల లోపువారే. ప్రపంచవ్యాప్తంగా 2022లో ఆరు లక్షల 30 వేల మంది ఎయిడ్స్ జబ్బుతో చనిపోయారు. 17 లక్షల మంది కొత్తగా హెచ్ఐవీ బారిన పడ్డారు. భారతదేశంలో అందుబాటులో ఉన్న 2019 వివరాల మేరకు 23 లక్షల 49 వేల మంది హెచ్ఐవీ సంక్రమించిన వారున్నారు. వీరిలో పది లక్షల మంది మహిళలు. అదే ఏడాది దేశంలో దాదాపుగా 60 వేలమంది ఎయిడ్స్‌తో మరణించారు. తెలుగు రాష్ట్రాలలో దాదాపు 5 లక్షల మంది హెచ్ఐవీ బాధితులున్నారని అంచనా.



సహారా ఎడారికి దిగువన ఉన్న దక్షిణాది ఆఫ్రికాలోని బోట్స్‌వానా, ఉగాండా, జింబాబ్వే, జైరి, స్వాజిలాండ్, ఇథియోపియా, కాంగో, మలావి వంటి దేశాలలో హెచ్ఐవీ బయటపడిన మొదటి దశకంలో 15 నుండి 49 సంవత్సరాల మధ్య వయసు వారిలో 40 శాతం మంది వరకూ హెచ్ఐవీ బారిన పడ్డారు. వారు అనారోగ్యంతో ఫ్యాక్టరీలకు, పనులకు వెళ్లలేక పోవడంతో ఆ యా దేశాలలోని ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి.

వైద్యశాస్త్రంలో అనేక కొత్త విధానాలకు హెచ్ఐవీ / ఎయిడ్స్ దారులు చూపింది. ఒక జబ్బు కోసం పరిశోధన చేసి రూపొందించిన మందును వేరే జబ్బుకు వాడే ప్రక్రియ (రీపర్పసింగ్ డ్రగ్)ను మొదట హెచ్ఐవీ చికిత్సలోనే ప్రవేశపెట్టారు. ప్రస్తుతం జిడోవుడిన్‌గా పిలుస్తున్న అజిడోథైమిడిన్ మందును క్యాన్సర్ చికిత్స కోసం రూపొందించారు. కాగా జిడోవుడిన్ ఔషధం హెచ్ఐవీ వృద్ధిలో పాత్ర ఉన్న ఒక ఎంజైము పనిని అడ్డుకొని, దాని వృద్ధిని నిరోధిస్తుంది. అందువల్ల అజిడోథైమిడిన్‌ని హెచ్ఐవీ పీడ ప్రారంభమైన ఐదు సంవత్సరాల తర్వాత, 1987 మార్చిలో హెచ్ఐవీ చికిత్సకు మొదటి ఫలవంతమైన చికిత్సగా ప్రవేశపెట్టారు. హెచ్ఐవీ చికిత్సలో వాడే కొన్ని మందులను ఈ క్రిమి సోకే అవకాశం ఉన్న వారికి ముందుగానే ఇవ్వడం మూలంగా సంక్రమణను అడ్డుకునే విధానాన్ని నిపుణులు రూపొందించారు. దీనినే 'ప్రీఎక్స్‌పోజర్ ప్రొఫైలాక్సిస్' అంటారు. ఇది హెచ్ఐవీకే పరిమితమైన కొత్త నిరోధక విధానం.

ప్రపంచ వ్యాప్తంగా హెచ్ఐవీ–ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడంతో హెచ్ఐవీ వ్యాప్తిని చాలా వరకు తగ్గించగలిగాము. ఎయిడ్స్ జబ్బుకి దారి తీసే హెచ్ఐవీ క్రిమి ప్రధానంగా ఆ క్రిమి సోకిన వారితో లైంగిక చర్యలో పాల్గొన్నందు వల్లనే వ్యాప్తి చెందుతుంది. హెచ్ఐవీ బాధితురాలు అయిన తల్లి నుండి గర్భస్థ శిశువుకి కూడా వచ్చే అవకాశం ఉంది. ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు, ఎయిడ్స్ వల్ల తమ వారిని కోల్పోయిన బాధితులు, హెచ్ఐవీకి గురయ్యే ప్రమాదం ఉన్నవారు– ఈ సమూహాలకు చెందినవారు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడానికి ముందుండాలని 'యూఎన్ ఎయిడ్స్' పిలుపునిచ్చింది.

వ్యాసకర్త సాంక్రమిక వ్యాధుల నిపుణులు
మొబైల్: 94406 77734

(నేడు ప్రపంచ ఎయిడ్స్ డే)

మాటే మధురం

'నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంద'నే నానుడి తెలుగునాట ప్రసిద్ధమైనది. సందర్భం ఏదైనా అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా మాట్లాడగలిగే నైపుణ్యం కలిగిన వ్యక్తులను 'సంభాషణా చాతుర్యం' కలిగిన వాళ్ళుగా జనం మెచ్చుకోవడం చూస్తుంటాం. అలాంటి వ్యక్తులు అందరికీ స్నేహితులుగా ఉండటం, సాధారణంగా వారంటే గిట్టనివాళ్ళు ఎవరూ ఉండకపోవడం కూడా గమనిస్తూ ఉంటాం. నోటి మంచి తనంలో ఉండే మహత్తు అది అని అలాంటి వ్యక్తులను చూసినప్పుడు మనకు అర్థమౌతుంది. అటువంటి 'సంభాషణా చాతుర్యం' మనం కూడా నేర్వగలిగితే ఎంతో బాగుంటుందని అనిపిస్తుంది.

జ్యోతిర్మయం

సహజంగా వచ్చినా లేక ప్రయత్నపూర్వకంగా సాధించినా, మాటనేర్పరితనం అనే లక్షణం మనిషికి ఒక కనపడని అలంకారం వంటిది. ఆ కారణం చేతనే సంకుసాల నృసింహకవి తాను రచించిన 'కవికర్ణ రసాయనము' అనే కావ్యం ద్వితీయాశ్వాసంలోని ఈ కంద పద్యంలో ఇలా అన్నాడు:

కాకేమి తన్ను దిట్టెనె?
కోకిల తనకేమి ధనము కోకొమ్మనెనే?
లోకము పగయగు బరుసని
వాకున జుట్టమగు మధుర వాక్యము వలనన్.

రోజువారీ జీవితంలో సర్వసాధారణంగా అనుభవానికి వచ్చేటువంటి ఉదాహరణలను ప్రస్తుతించి, నోటి మంచి తనం లేదా మాట మంచితనంలోని మహత్తును గురించి సులభంగా అర్థమయ్యే మాటలతో చాలా హృద్యంగా ఈ పద్యంలో చెప్పడం జరిగింది. కాకి 'కావుకావు' మనే దాని కరకు అరుపుతో ఎవరినైనా నిందిస్తుందా? నిందించదు. ప్రకృతి సహజంగా వచ్చిన దాని అరుపుతో, కాకి ఒకరికి చేసే హాని ఏమీ ఉండదు. అలాగే, మరోవైపు కోకిల దాని విన సొంపైన 'కుహూ కుహూ' అనే పాటవంటి కూతతో ఎవరికీ ఏమీ ప్రత్యేకంగా సంపదలను తెచ్చి పెట్టదు. కర్ణపేయమైన దాని స్వరం వలననే కోకిల అందరికీ ప్రియమైన దయ్యింది. కాబట్టి పరుషపు మాటల వలన ఏ లోకమైతే ఒకనికి దూరమైపోతుందో, అదే లోకం మధురమైన మాటతో దగ్గరదై చెలిమిని పాటిస్తుంది అని దీని సారాంశం.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.చవితి ప.3.06 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** పునర్వసు సా.5.06 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** రా.1.46 నుండి 3.26 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.28 నుండి 9.16 వరకు, తదుపరి ప.12.11 నుండి 12.59 వరకు, **అమృతఘడియలు:** ప.2.34 నుండి 4.15 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.17, **సూర్యాస్తమయం:** 5.20.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు భవిష్యత్ లేదు: ఈటల


ఓటు వేసిన ఈటల దంపతులు

కమలాపూర్ (హనుమకొండ జిల్లా)/గజ్వేల్ : హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు భవిష్యత్ లేదని, ఆ రెండు పార్టీలకు నియోజకవర్గ ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పబోతున్నారని బీజేపీ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి ఈటల రాజేందర్ జోస్యం చెప్పారు. అనంతరం ఆయన గజ్వేల్, హుజూరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ...గజ్వేల్‌లో సర్వేలకు అందని ఫలితం రాబోతుందన్నారు. ఓటర్లు నిశ్శబ్ద విప్లవం ప్రదర్శించారని పోలింగ్ సరళిని చూస్తే అర్థమవుతోందని చెప్పారు. ఈటల లేని హుజూరాబాద్‌ను ఊహించుకోలేమంటూ ప్రజలు తనకు అక్కడ కూడా భారీ మెజారిటీ అందించబోతున్నారని తెలిపారు. అంతకుముందు హనుమకొండ జిల్లా కమలాపూర్‌లోని 262 పోలింగ్ కేంద్రంలో గురువారం తన సతీమణి జమునతో కలిసి ఈటల రాజేందర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్రంలో బీజేపీ 25–30 సీట్లను గెలవబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. అధికార పార్టీ ప్రజలను ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా సుపరిపాలన కోసం బీజేపీకే ఓట్లు వేశారని తెలిపారు.

భారీ మెజారిటీతో గెలవబోతున్నా

- తెగించి కొట్లాడిన కార్యకర్తలే నిజమైన హీరోలు: బండి


ఓటు వేసిన బండి సంజయ్ దంపతులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తాను భారీ మెజారిటీతో గెలవబోతున్నట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలో తమ పార్టీ మెజారిటీ స్థానాలు గెలుచుకుంటుందని అన్నారు. అధికార పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కాషాయ జెండా పట్టుకుని తెగించి కొట్లాడిన కార్యకర్తలే నిజమైన హీరోలని అభివర్ణించారు. కరీంనగర్‌లో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పుతామన్నారు. పేదల ఇండ్లను కబ్జా చేసే వాళ్లను, భూ కబ్జాదారుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించిన ఎన్నికల సంఘానికి, పోలీసులకు అభినందనలు తెలిపారు. కరీంనగర్‌లో విజయంపై తనకు నమ్మకం ఉందని అన్నారు. ఎన్నికల్లో సహకరించిన మంద కృష్ణమాదిగతోపాటు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ పై ఎవరి అభిప్రాయాలు వారివని, గతంలో దుబ్బాక, జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో వెల్లడైన ఎగ్జిట్‌పోల్స్ తారుమారయ్యాయని గుర్తు చేశారు. డిసెంబర్ 3న వాస్తవ ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ఫలితాలు వెలువడ్డాక ఎమ్మెల్యేల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని జాతీయ నాయకత్వం తదుపరి నిర్ణయం తీసుకుంటుందన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్యం పటిష్టం

హరియాణా, త్రిపుర గవర్నర్లు దత్తాత్రేయ, ఇంద్రసేనారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసేందుకు ఓటు హక్కును అందరూ సద్వినియోగం చేసుకోవాలని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి సూచించారు. కుటుంబ సమేతంగా వారు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్ర మంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ సైతం కుటుంబంతో కలసి ఓటేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ముఖ్యమైనదని, ఓటేయకుండా ప్రశ్నించే అవకాశం ఉండదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

అంతా బీఆర్‌ఎస్ కనుసన్నల్లోనే పనిచేశారు

- పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగంపై కిషన్‌రెడ్డి ఆరోపణ
- ఈసీ మరింత కఠినంగా వ్యవహరించి ఉండాల్సిందని వ్యాఖ్య
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంచాయని ధ్వజం
- బీజేపీ శక్తి మేరకు పోరాడిందని వెల్లడి


కుటుంబంతో కలిసి ఓటేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సంఘం అజమాయిషీలోనే పోలీసులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పనిచేయాల్సి ఉన్నా... బీఆర్‌ఎస్ సర్కార్ కనుసన్నల్లోనే వారంతా పనిచేశారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. పోలింగ్ సందర్భంగా అనేక ప్రాంతాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి డబ్బులు, మద్యం పంపిణీ చేశాయని విమర్శించారు. ముఖ్యంగా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించలేదని ధ్వజమెత్తారు. పలు ప్రాంతాల్లో వారి కళ్లముందే వేల రూపాయలు ఓటర్లకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు పంపిణీ చేసినా చూస్తుండిపోయారని మండిపడ్డారు. గురువారం పోలింగ్ ముగిశాక పార్టీ నేతలు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, డా. కాసం వెంకటేశ్వర్లు యాదవ్, డా.బూర నర్సయ్యగౌడ్, మాజీ డీజీపీ కృష్ణప్రసాద్‌తో కలిసి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇలాంటి వ్యవహారాలపై ఈసీ మరింత కఠినంగా వ్యవహరించి ఉండాల్సిందని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఓటర్లను భయపెట్టాయి

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పోటీపడి డబ్బు, ఇతరరూపాల్లో ప్రలోభాలకు దిగినట్లు, అనేక ప్రాంతాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినట్టు తమకు నివేదికలు అందాయని కిషన్‌రెడ్డి చెప్పారు. ఇంత ఒత్తిడి ఉన్నా, యువత, ఇతరవర్గాల ప్రజలు ధైర్యంగా బీజేపీ పక్షాన నిలిచి పార్టీ అభ్యర్థుల విజయం కోసం పనిచేశారన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల గూండాయిజానికి వెరవకుండా రాష్ట్రవ్యాప్తంగా మొక్కవోని ధైర్యంతో పోరాడిన బీజేపీ కార్యకర్తలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామన్నారు. గత వారం రోజులుగా చూస్తే కొన్ని చోట్ల బీఆర్‌ఎస్ నేతలు బీజేపీ అభ్యర్థులు, కార్యకర్తలపై భౌతికదాడులకు సైతం దిగారని, పోలింగ్ సందర్భంగా కూడా బీజేపీ కార్యకర్తలపై దాడి చేసి దొంగ ఓట్లు వేసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. దీక్షాదివస్ పేరిట బీఆర్‌ఎస్ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే ప్రయత్నం చేయగా, కాంగ్రెస్ పార్టీ పోలింగ్ రోజు కూడా పత్రికా ప్రకటనలతో బీజేపీపై బురదజల్లే ప్రయత్నం చేసిందని ధ్వజమెత్తారు.

మంచి ఫలితాలు సాధిస్తామన్న నమ్మకముంది

బీజేపీ శక్తి మేరకు సమర్థవంతంగా పోరాడిందని, ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధిస్తుందనే ధీమా, విశ్వాసం తమకు ఉందని కిషన్‌రెడ్డి చెప్పారు. కాగా, పోలింగ్ నాడే నాగార్జునసాగర్ వద్ద రెండు రాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలకు దారి తీయడంపై కేంద్రం జోక్యం చేసుకోవాలని లేఖ రాస్తానని కిషన్‌రెడ్డి చెప్పారు.

బీఆర్‌ఎస్‌తో ఒప్పందం ఉండదు

తెలంగాణలో బీజేపీ అధిక సీట్లు గెలుస్తుందని, అధికారాన్ని సొంతం చేసుకునేంత స్థాయిలో ఫలితాలు వస్తాయనే ఆశాభావాన్ని కిషన్‌రెడ్డి వ్యక్తం చేశారు. గురువారం ఆయన టీవీ చానళ్ల ప్రతినిధులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌తో ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పందం కుదుర్చుకునే పరిస్థితి ఉండదని తేల్చిచెప్పారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 24 సీట్లలో ముఖ్యంగా విద్యావంతులు ఎక్కువగా ఉన్న చోట్ల పోలింగ్ శాతం తక్కువగా ఉండడం మంచి పరిణామం కాదన్నారు. తక్కువ ఓటింగ్ శాతం (50 శాతం కంటే తక్కువ ఉన్నచోట్ల) కారణంగా పట్టణ ప్రాంతాల్లో కొద్దిమేర బీజేపీకి నష్టం జరిగే అవకాశం ఉండొచ్చని అంచనా వేశారు.

ఓట్లు, సీట్లు పెరుగుతాయ్!

▶ మొదటి పేజీ తరువాయి

నిలుస్తామని, కనీసం 12–15 స్థానాల్లో గెలిచే అవకాశాలు ఉన్నట్లు పార్టీలో అంతర్గత చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో గతంలో కంటే ఓట్ల శాతంతోపాటు సీట్లు కూడా పెరుగుతాయనే ధీమా పార్టీ నాయకుల్లో వ్యక్తమౌతోంది.

పుంజుకున్న బలం

2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 7 శాతం ఓట్లతో ఒకేఒక సీటు సాధించగా, 2019 లోక్‌సభ ఎన్నికల్లో 18 శాతానికి ఓటింగ్ శాతం పెరిగి, 4 ఎంపీ సీట్లను గెలుచుకుంది. దీన్ని బట్టి చూస్తే గత లోక్‌సభ ఎన్నికల నుంచి రాష్ట్రంలో బీజేపీ బలం పుంజుకుందని అంటున్నారు. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో గెలుపొందడం, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 48 సీట్లు సాధించడం, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలవడం వంటి సానుకూల పరిణామాలను ఉదహరిస్తున్నారు. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం 20కి చేరుకోవడంతోపాటు 12–15 స్థానాలు సాధిస్తామనే ధీమా వ్యక్తమవుతోంది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల ప్రచారం పార్టీకి కలిసి వస్తుందని పార్టీ నేతలు భావిస్తున్నారు. బీజేపీ బీసీ నినాదం, అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎం చేస్తామనే ప్రకటన, ఎస్సీ వర్గీకరణపై అనుకూల నిర్ణయం వంటివి పార్టీకి అనుకూలంగా పనిచేస్తాయంటున్నారు.

బిజీబిజీగా ముఖ్యనేతలు

గురువారం పోలింగ్ సందర్భంగా... క్షేత్రస్థాయిలోని నాయకులు, కార్యకర్తల నుంచి పోలింగ్ తీరు, ఇతర అంశాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ పార్టీ ముఖ్యనేతలు బిజీబిజీగా గడిపారు. నాంపల్లిలోని పార్టీ కార్యాలయం నుంచి ఓటింగ్ సరళి, పార్టీ పరిస్థితి, ఇతర అంశాలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ పరిశీలించారు. ఫోన్ ద్వారా పార్టీ నాయకుల నుంచి కిషన్‌రెడ్డి సమాచారాన్ని క్రోడీకరించే ప్రయత్నం చేశారు. పలుచోట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థులు, కార్యకర్తలు ఎన్నికల అక్రమాలకు పాల్పడినా పోలీసులు, అధికారులు ప్రేక్షకపాత్ర పోషించారంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)కు కిషన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. పోలింగ్ సరళిపై బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరా తీశారు. మధ్యాహ్నం 3 గంటలకు వారు కిషన్‌రెడ్డికి ఫోన్ చేసి ఓటింగ్ ప్రక్రియ ఎలా సాగుతోంది, ఎన్ని సీట్లలో గెలుస్తామనే విషయాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం.

రోడ్లన్నీ నిర్మానుష్యం

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల వేళ గ్రేటర్‌లో రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. ఓటు హక్కు వినియోగించుకునేందుకు నగరవాసులు సొంతూర్లకు వెళ్లిపోయారు. దీంతో నిత్యం వాహనాలతో కిక్కిరిసే ప్రధాన రహదారులన్నీ ఖాళీగా కనిపించాయి. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, ఐటీ కంపెనీలు ఉద్యోగులకు గురువారం సెలవు దినం ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రధానంగా ప్రతి రోజు వాహనాలతో కిటకిటలాడే జూబ్లీబస్ స్టేషన్, సికింద్రాబాద్, బేగంపేట,అమీర్‌పేట్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాసబ్‌ట్యాంక్, ఖైరతాబాద్, రాజ్‌భవన్ రోడ్, లక్డీకాపూల్, హిమాయత్‌నగర్, సోమాజిగూడ, పంజగుట్ట, మాదాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాలు గురువారం నిర్మానుష్యంగా మారాయి.

రూ.87.29 కోట్ల నగదు, వస్తువుల స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్ జిల్లాలో బుధవారం నుంచి గురువారం వరకు ఒక్కరోజే రూ. 54.03 లక్షల విలువైన నగదు, ఇతరత్రా వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువుల విలువ మొత్తం రూ.87.27 కోట్లకు చేరుకుంది. ఒక్కరోజు 44ఎఫ్‌ఐఆర్‌లు నమోదు కాగా, మొత్తం ఎఫ్‌ఐఆర్‌లు వెయ్యికి చేరుకున్నాయి.



క్లుప్తంగా...

2023.. అత్యంత వేడి సంవత్సరం !

ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ అంచనా

దుబాయ్: నెల రోజుల్లో ముగిసిపోనున్న 2023 ఏడాది.. చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరంగా రికార్డులకెక్కనుందని ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ) గురువారం నివేదించింది. నివేదిక తాలూకు వివరాలు నేచర్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పారిశ్రామిక విప్లవం ముందునాటి కాలంతో పోలిస్తే ఈ ఏడాది 1.4 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరిగిందని డబ్ల్యూఎంఓ ప్రధాన కార్యదర్శి పిటేరీ టాలస్ చెప్పారు. ''ఈ ఏడాది తొలినాళ్లలో పసిఫిక్ మహాసముద్ర ఉపరితర జలాలు వేడెక్కి సంభవించిన 'ఎల్‌నినో' పరిస్థితి కారణంగా వచ్చే ఏడాది సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రి సెల్సియస్‌ను దాటనుంది. మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా వచ్చే నాలుగేళ్లు 1.5 డిగ్రీ సెల్సియస్ నమోదయ్యే వీలుంది. ఆ తర్వాత దశాబ్దంలో ఇది సర్వసాధారణ స్థితిగా నిలిచిపోయే ప్రమాదముంది'' అని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు.

వరవరరావు హైదరాబాద్‌కు వెళ్లొచ్చు

ప్రయాణ అనుమతి మంజూరుచేసిన ముంబై కోర్టు

ముంబై: ఎల్గార్ పరిషత్– మావోయిస్టుల తో సంబంధాల కేసులో అరెస్టయి బెయిల్ మీద బయటికొచ్చిన విప్లవకవి వరవరరావు హైదరాబాద్ వెళ్లేందుకు ముంబైలోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం అనుమతి మంజూరుచేసింది. ఎడమ కంటికి చికిత్స నిమిత్తం డిసెంబర్ 5–11 తేదీల మధ్య హైదరాబాద్ వెళ్లేందుకు అనుమతినిస్తూ బుధవారం జడ్జి రాజేశ్ కటారియా ఉత్తర్వులిచ్చారు. హైదరాబాద్‌కు వెళ్లాక ఎక్కడ ఉండేది, చిరునామా, ఫోన్ నంబర్, షెడ్యూల్ తదితర సమగ్ర వివరాలను ముందుగానే ముంబైలో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు సమర్పించాలని ఆదేశించింది. ప్రయాణ అనుమతిని దుర్వినియోగం చేయొద్దని హెచ్చరించింది.

రూ. 2.23 లక్షల కోట్లతో 'రక్షణ' కొనుగోలు ప్రాజెక్టులు

డీఏసీ ఆమోదం

న్యూఢిల్లీ: రూ.2.23 లక్షల కోట్ల విలువైన రక్షణ సంబంధిత కొనుగోలు ప్రాజెక్టులకు భారత రక్షణ శాఖ రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్(డీఏసీ) గురువారం ప్రాథమికంగా ఆమోదం తెలియజేసింది. ఈ ప్రాజెక్టుల్లో భాగంగా 97 తేజస్ తేలికపాటి యుద్ధ విమానాలు, 156 ప్రచండ్ హెలికాప్టర్లను త్రివిధ దళాల కోసం రక్షణ శాఖ కొనుగోలు చేయనుంది. దీనివల్ల భారత సైనిక దళాలు మరింత శక్తివంతంగా మారుతాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. భారత్–పాకిస్తాన్, భారత్–చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా పెద్ద సంఖ్యలో యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు సమకూర్చుకోవాలని రక్షణ శాఖ ఇప్పటికే నిర్ణయించింది. రూ.2.23 లక్షల కోట్లతో కొనుగోలు చేస్తే యుద్ధ విమానాలు, హెలికాప్టర్లలో 98 శాతం స్వదేశంలోనే తయారవుతాయని రక్షణ శాఖ పేర్కొంది.

తూర్పు ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణుల వాన

కీవ్: ఉక్రెయిన్‌లోని డొనెట్‌స్క్ ప్రాంతం లక్ష్యంగా రష్యా మిలటరీ బుధవారం రాత్రి ఎస్–300 దీర్ఘ శ్రేణి క్షిపణులతో విరుచుకుపడింది. ఆ ప్రాంతంలోని పాక్రోవ్‌స్క్, నోవోహ్రోడివ్కా, మిర్నోహ్రాడ్ నగరాలపై జరిగిన దాడుల్లో ఒకరు చనిపోగా పదుల కొద్దీ భవనాలు నేలమట్టమయ్యాయి. భవనాల శిథిలాల్లో కొందరు చిక్కుకుని ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది నెలలుగా భీకర పోరాటం కొనసాగుతున్న అవ్‌డివ్కా నగరానికి సమీపంలోనే పై మూడు నగరాలున్నాయి. బఖ్‌ముత్ చుట్టుపక్కల ప్రాంతం, కీలకమైన అవ్‌డివ్కాలపై పట్టుసాధించేందుకు రష్యా బలగాలు వరుస దాడులకు పాల్పడుతున్నట్లు ఉక్రెయిన్ సైన్యం తెలిపింది.

రసాయనాల ఫ్యాక్టరీలో ఘోర అగ్ని ప్రమాదం

ఏడుగురు మృతి, మరో 25 మందికి గాయాలు

సూరత్: గుజరాత్‌లోని సూరత్‌లోని ఓ రసాయనాల కర్మాగారంలో సంభవించిన పేలుడు, ఘోర అగ్ని ప్రమాదంలో ఏడుగురు సజీవదహనమయ్యారు. మరో 25 మంది గాయాలపాలయ్యారు. సచిన్ పారిశ్రామిక ప్రాంతంలోని ఈథర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీలో గురువారం అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో రసాయనాలు నిల్వ ఉన్న ట్యాంకులో అకస్మాత్తుగా పేలుడు సంభవించింది. అనంతరం చెలరేగిన మంటలు కర్మాగారాన్ని చుట్టుముట్టాయి. అగ్నిమాపక సిబ్బంది సుమారు 9 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.

పేద దేశాలకు 'వాతావరణ మార్పుల' నష్టపరిహారం

దుబాయ్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లోని దుబాయి నగరంలో కాప్–28 సదస్సు గురువారం ప్రారంభమైంది. 12 రోజులపాటు సదస్సు జరగనుంది. తొలిరోజు కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. శిలాజ ఇంధనాల వాడకం మితిమీరుతుండడం, తద్వారా పెరుగుతున్న కాలుష్యం, సంభవిస్తున్న వాతావరణ మార్పుల వల్ల పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. వాతావరణ మార్పుల్లో ఆయా దేశాల పాత్ర తక్కువే. అయినప్పటికీ నష్టాన్ని మాత్రం భరించాల్సి వస్తోంది. అందుకే వాటికి పరిహారం చెల్లించాలన్న ప్రతిపాదనకు కాప్–28 సదస్సులో ఆమోద ముద్ర వేశారు.

కాంగ్రెస్-2, బీజేపీ-2, హంగ్-1!


5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ఎగ్జిట్ పోల్స్ జోస్యం | అన్ని రాష్ట్రాల్లోనూ 3న కౌంటింగ్, ఫలితాల వెల్లడి

రాజస్థాన్‌లో బీజేపీ, మధ్యప్రదేశ్‌లోనూ మొగ్గు	
తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌ల్లో కాంగ్రెస్	మిజోరంలో హంగ్ అసెంబ్లీ

న్యూఢిల్లీ: నెలన్నరకు పైగా సాగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పోరు ముగింపునకు వచ్చింది. గురువారంతో అన్ని రాష్ట్రాల్లోనూ పోలింగ్ ప్రక్రియ ముగిసింది. మిజోరంలో నవంబర్ 7న, ఛత్తీస్‌గఢ్‌లో నవంబర్ 7, 19 తేదీల్లో రెండు దశల్లో, మధ్యప్రదేశ్‌లో 19న, రాజస్థాన్‌లో 25న పోలింగ్ జరగడం తెలిసిందే. తెలంగాణలో కూడా గురువారం ఒకే దశలో పోలింగ్ ముగిసింది. ఐదు రాష్ట్రాల్లోనూ డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు వెలువడనున్నాయి. తెలంగాణలో పోలింగ్ ముగియగానే ఐదు రాష్ట్రాల్లోనూ ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. తెలంగాణలో అధికార బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ ఓడించనుందని దాదాపుగా అన్ని ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో అధికారం నిలబెట్టుకుంటుందని పలు పోల్స్ పేర్కొన్నాయి. ఇక కాంగ్రెస్ పాలిత రాజస్థాన్‌లో బీజేపీ గెలుస్తుందని చాలావరకు తేల్చాయి. మధ్యప్రదేశ్‌ను కూడా బీజేపీ నిలబెట్టుకోవచ్చని, మిజోరంలో హంగ్ రావచ్చని తెలిపాయి...

మధ్యప్రదేశ్... బీజేపీకే మొగ్గు!

మధ్యప్రదేశ్‌లో బీజేపీ ఘనవిజయం సాధించనుందని ఇండియాటుడే–యాక్సిస్ మై ఇండియా, టుడేస్ చాణక్య, ఇండియా టీవీ–సీఎన్ఎక్స్ వంటి పలు సంస్థ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. రాష్ట్రంలో మొత్తం అసెంబ్లీ సీట్లు 230. మెజారిటీ మార్కు 116 కాగా బీజేపీకి ఏకంగా 140 నుంచి 162 సీట్లు వస్తాయని ఇండియాటుడే––యాక్సిస్ మై ఇండియా పేర్కొంది. కాంగ్రెస్ 68 నుంచి 90 సీట్లకు పరిమితం కానుందని చెప్పింది. టుడేస్ చాణక్య కూడా బీజేపీకి 151, కాంగ్రెస్‌కు 74 స్థానాలిచ్చింది. ఇండియా టీవీ–సీఎన్ఎక్స్ ఎగ్జిట్ పోల్స్‌లోనూ బీజేపీకి 140 నుంచి 159 సీట్లు రాగా కాంగ్రెస్ 70 నుంచి 89 సీట్లకు పరిమితమైంది. రిపబ్లిక్ టీవీ కూడా బీజేపీకి 118 నుంచి 130 సీట్లిచ్చింది. కాంగ్రెస్‌కు 97 నుంచి 107 రావచ్చని పేర్కొంది. టైమ్స్ నౌ–ఈటీజీ మాత్రం కాంగ్రెస్‌కు 109–125 సీట్లివ్వగా బీజేపీకి 105–117 వస్తాయని పేర్కొంది. ఏబీపీ–సీవోటర్ కూడా కాంగ్రెస్‌కు 113 నుంచి 137 స్థానాలొస్తాయని, బీజేపీ 88 నుంచి 112కు పరిమితమవుతుందని చెప్పింది. జన్ కీ బాత్ మాత్రం రెండు పార్టీలూ 100 నుంచి 125 సీట్ల మధ్య గెలుచుకుంటాయని జోస్యం చెప్పింది.



రాజస్థాన్‌లో కమల వికాసమే

రాజస్థాన్‌లో బీజేపీ విజయం ఖాయమని చాలా ఎగ్జిట్ పోల్స్ తేల్చాయి. మూడు మాత్రం కాంగ్రెస్ బహుశా రాజస్థాన్‌లో నెగ్గే అవకాశముందని అంచనా వేశాయి. రాష్ట్రంలో మొత్తం 200 అసెంబ్లీ సీట్లు కాగా మెజారిటీకి 101 స్థానాలు రావాలి. టైమ్స్ నౌ సర్వేలో బీజేపీకి 108 నుంచి 128, కాంగ్రెస్‌కు 56 నుంచి 72 సీట్లొచ్చాయి. ఇక బీజేపీ 105 నుంచి 125 స్థానాలు సాధిస్తుందని రిపబ్లిక్ టీవీ పేర్కొంది. కాంగ్రెస్ 69 నుంచి 81కి పరిమితమవుతుందని చెప్పింది. ఏబీపీ–సీవోటర్ బీజేపీకి 94–114, కాంగ్రెస్‌కు 71–91 సీట్లిచ్చింది. జన్ కీ బాత్ సర్వే కూడా బీజేపీ 100 నుంచి 122 సీట్లు గెలుస్తుందని, కాంగ్రెస్ 62 నుంచి 85కు పరిమితమవుతుందని పేర్కొంది. టుడేస్ చాణక్య బీజేపీకి 101, కాంగ్రెస్ 89 సీట్లిచ్చింది. ఇండియాటుడే––యాక్సిస్ మై ఇండియా బీజేపీకి 86 నుంచి 106, కాంగ్రెస్‌కు80 నుంచి 100 సీట్లొస్తాయని అంచనా వేసింది. కాంగ్రెస్ 94 నుంచి 104 సీట్లతో అధికారం నిలుపుకుంటుందని, బీజేపీకి 80 నుంచి 90 స్థానాలొస్తాయని ఇండియా టీవీ–సీఎన్ఎక్స్ పేర్కొంది.



తెలంగాణలో కాంగ్రెస్ పాగా

తెలంగాణలో బీఆర్ఎస్ పాలనకు తెర దించి తొలిసారిగా కాంగ్రెస్ అధికారంలోకి రానుందని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. 119 స్థానాల అసెంబ్లీలో మెజారిటీకి 60 స్థానాలు కావాల్సి ఉండగా కాంగ్రెస్‌కు 60 నుంచి 70 దాకా వస్తాయని టైమ్స్ నౌ–ఈటీజీ అంచనా వేసింది. బీఆర్ఎస్ 37 నుంచి 45 సీట్లకు పరిమితమవుతుందని చెప్పింది. బీజేపీకి 6 నుంచి 8, మజ్లిస్‌కు5 నుంచి 7 రావచ్చని పేర్కొంది. రిపబ్లిక్ టీవీ కూడా కాంగ్రెస్‌కు 58 నుంకచి 68 సీట్లిచ్చింది. బీఆర్ఎస్‌కు 46 56, బీజేపీకి 4 నుంచి 9 వస్తాయని, ఇతరులు 5 నుంచి 9 సీట్లు నెగ్గుతారని పేర్కొంది. ఇండియా టీవీ–సీఎన్ఎక్స్ అయితే కాంగ్రెస్‌కు ఏకంగా 63 నుంచి 79 సీట్లిచ్చింది. బీఆర్ఎస్ 31 నుంచి 47తో సరిపెట్టుకుంటుందని చెప్పింది. బీజేపీకి 2 నుంచి 4, మజ్లిస్‌కు5 నుంచి 7 వస్తాయని తెలిపింది. టుడేస్ చాణక్య కూడా కాంగ్రెస్‌కు 71 సీట్లు, బీఆర్ఎస్‌కు 33, బీజేపీకి 7, ఇతరులకు 8 స్థానాలిచ్చింది. కాంగ్రెస్ 49 నుంచి 65 సీట్లొస్తాయని ఏబీపీ–సీవోటర్ సర్వే పేర్కొంది. బీఆర్ఎస్‌కు 38 నుంచి 54, బీజేపీకి 5 నుంచి 13 వస్తాయని, ఇతరులు 5 నుంచి 9 సీట్లు నెగ్గుతారని చెప్పుకొచ్చింది. జన్ కీ బాత్ కూడా కాంగ్రెస్‌కు 48 నుంచి 64, బీఆర్ఎస్‌కు 40 నుంచి 55 సీట్లిచ్చింది. బీజేపీ 7 నుంచి 13, మజ్లిస్ 4 నుంచి 7 సీట్లు నెగ్గుతాయని చెప్పింది.




మిజోరంలో హంగ్



ఈశాన్య రాష్ట్రమైన మిజోరంలో అధికార మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) ఈసారి ఎదురీదుతోందని ఎగ్జిట్ పోల్స్ తేల్చాయి. ఎంఎన్ఎఫ్‌కు ఈసారి జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) గట్టి పోటీ ఇచ్చినట్టు పేర్కొన్నాయి. బహుశా హంగ్ అసెంబ్లీ ఏర్పడవచ్చని జోస్యం చెప్పాయి. కాంగ్రెస్ మూడో స్థానానికే పరిమితమవుతుందని, బీజేపీకి ఒకట్రెండు స్థానాలు దాటకపోవచ్చని తెలిపాయి. మొత్తం 40 స్థానాలకు గాను రిపబ్లిక్ టీవీ మాత్రం ఎంఎన్ఎఫ్‌కు 17 నుంచి 22 దాకా ఇచ్చింది. ఏబీపీ సీవోటర్ కూడా దానికి 15 నుంచి 21 స్థానాలు రావచ్చని పేర్కొంది. మిగతా సర్వేలన్నీ అది మెజారిటీకి కొద్ది దూరంలోనే నిలిచిపోతుందని తేల్చాయి. జెడ్‌పీఎం ఏకంగా 28 నుంచి 35 సీట్లతో ఘనవిజయం సాధిస్తుందని ఇండియాటుడే––యాక్సిస్ మై ఇండియా పేర్కొనడం విశేషం! ఎంఎన్ఎఫ్ కేవలం 3 నుంచి 7 సీట్లకు, కాంగ్రెస్ 2 నుంచి 4 స్థానాలకు పరిమితమవుతాయని అది తేల్చింది. మిగతా సర్వేలన్నీ ఎంఎన్ఎఫ్‌కు 14 నుంచి 18 సీట్లు, జెడ్‌పీఎంకు 10 నుంచి 16 సీట్ల చొప్పున ఇచ్చాయి.

ఛత్తీస్‌గఢ్ 'హస్త'గతం!



ఛత్తీస్‌గఢ్‌లో భూపేశ్ బఘెల్ సర్కారు పనితీరుకు ప్రజలు మరోసారి పట్టం కడుతున్నట్టు పలు ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు గాను కాంగ్రెస్‌కు 40 50 దాకా వస్తాయని ఇండియాటుడే–యాక్సిస్ మై ఇండియా పేర్కొంది. బీజేపీ 36 నుంచి 46 దాకా గెలుచుకుంటుందని అంచనా వేసింది. టైమ్స్ నౌ–ఈటీజీ కాంగ్రెస్‌కు 48 నుంచి 56, బీజేపీకి 32 నుంచి 40 సీట్లిచ్చింది. కాంగ్రెస్‌కు 57, బీజేపీకి 33 సీట్లొస్తాయని టుడేస్ చాణక్య పేర్కొంది. ఇండియా టీవీ–సీఎన్ఎక్స్ సర్వే కాంగ్రెస్‌కు 46–56, బీజేపీకి 30–40 సీట్లిచ్చింది. రిపబ్లిక్ టీవీ కూడా కాంగ్రెస్44 నుంచి 52 సీట్లు గెలుస్తుందని, బీజేపీ 35 నుంచి 42 సీట్లకు పరిమితమవుతుందని అభిప్రాయపడింది. ఇక రెండు పార్టీలూ హోరాహోరీగా తలపడ్డట్టు ఏబీపీ–సీవోటర్, జన్ కీ బాత్ తేల్చాయి. కాంగ్రెస్‌కు 41 నుంచి 53, బీజేపీకి 36 నుంచి 48 సీట్లు రావచ్చని ఏబీపీ చెప్పింది. ఇక జన్ కీ బాత్ సర్వే బీజేపీకి 34 నుంచి 45, కాంగ్రెస్‌కు 42 నుంచి 53 స్థానాలిచ్చింది.

2018లో ఎవరికెన్ని?

మిజోరం (మొత్తం స్థానాలు 40)

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
ఎంఎన్ఎఫ్	26	37.7
కాంగ్రెస్	5	29.98
జెడ్‌పీఎం	8	22.9
బీజేపీ	1	8.09
ఇతరులు	0	1.3

ఛత్తీస్‌గఢ్ (మొత్తం స్థానాలు 90)

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ	15	33
కాంగ్రెస్	68	43
ఇతరులు	7	24

రాజస్థాన్ (మొత్తం స్థానాలు 200)

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ	73	38.7
కాంగ్రెస్	100	39.3
స్వతంత్రులు	13	9.5
ఇతరులు	14	11.1

మధ్యప్రదేశ్ (మొత్తం స్థానాలు 230)

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ	109	41.02
కాంగ్రెస్	114	40.89
బీఎస్పీ	2	5
ఇతరులు	5	9

తెలంగాణ (మొత్తం స్థానాలు 119)

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
టీఆర్ఎస్	88	46.87
కాంగ్రెస్	19	28.43
టీడీపీ	2	3.51
మజ్లిస్	7	2.71
బీజేపీ	1	6.98
ఇతరులు	1	6

నాలుగు పెద్ద కులాలు.. పేదలు, యువత, మహిళలు, రైతులు

- ఆ నాలుగు కులాల అభివృద్ధే దేశాభివృద్ధి
- ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ సంతృప్త స్థాయిలో అందిస్తాం
- ప్రధానమంత్రి మోదీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: గత పదేళ్ల తమ పరిపాలన ప్రజల్లో తమ ప్రభుత్వంపై అంతులేని విశ్వాసాన్ని పెంచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గత ప్రభుత్వాలు ప్రజల పట్ల నిరంకుశంగా వ్యవహరించాయని, ఓటు బ్యాంకు రాజకీయాలతో అభివృద్ధిని విస్మరించాయని ఆక్షేపించారు. గురువారం 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో భాగంగా వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తన దృష్టిలో పేదలు, యువత, మహిళలు, రైతులు అనే నాలుగు పెద్ద కులాలు ఉన్నాయని, ఆ కులాలు అభివృద్ధి చెందితే దేశం కూడా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. ఈ నాలుగు కులాల సాధికారతే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ఇచ్చిన హామీలను తాను కచ్చితంగా నెరవేరుస్తాన్న సంగతి ప్రజలకు తెలుసని వెల్లడించారు. ప్రజల ఆశీస్సులు కోరుకుంటున్నానని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ సంతృప్తస్థాయిలో అందిస్తామని ప్రకటించారు. ఇందుకోసమే 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'కు శ్రీకారం చుట్టామని తెలపారు.

భారత్ ఇక ఆగిపోదు.. అలసిపోదు

ప్రజల ఆకాంక్షలు మొదలైన చోటునుంచే 'మోదీ గ్యారంటీ' ప్రారంభమవుతుందని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలని ప్రజలు తీర్మానించుకున్నారని, భారత్ ఇక ఆగిపోదు, అలసిపోదు అని తేల్చి చెప్పారు. 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'కు దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి అద్భుతమైన ప్రజా స్పందన లభిస్తోందని హర్షం వ్యక్తం చేశారు.

'డ్రోన్ దీదీ యోజన' ప్రారంభం

మహిళా స్వయం సహాయక సంఘాలకు డ్రోన్లు అందజేసేందుకు ఉద్దేశించిన 'డ్రోన్ దీదీ యోజన'ను ప్రధాని మోదీ గురువారం ప్రారంభించారు. ఈ పథకం కింద 2024–25 నుంచి 2025–26 వరకు ఎంపిక చేసిన 15,000 మహిళా స్వయం సహాయక సంఘాలకు డ్రోన్లు పంపిణీ చేస్తారు. ఆయా సంఘాలు ఈ డ్రోన్లను వ్యవసాయ పనుల కోసం రైతులకు అద్దెకు ఇచ్చి, ఆదాయం ఆర్జించవచ్చు. మహిళలకు వారి గ్రామాల్లో గౌరవ ప్రతిష్టలు దక్కాలని తాను ఆశిస్తున్నానని మోదీ చెప్పారు.

కొత్త శిఖరాలకు భారత ఆర్థిక వ్యవస్థ

తమ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, నిర్ణయాలతో మన దేశ ఆర్థిక వ్యవస్థ కొత్త శిఖరాలకు చేరిందని ప్రధానమంత్రి మోదీ వివరించారు. ఎన్నెన్నో నూతన ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. గురువారం ఢిల్లీలో రోజ్‌గార్ మేళాలో ఆయన మాట్లాడారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో కొత్తగా నియమితులైన వారికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సమాజంలో అట్టడుగు వర్గాలకు సైతం చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

దుబాయ్ వెళ్లిన ప్రధాని మోదీ

వాతావరణ మార్పులు, వాటి ప్రభావాన్ని ఎదుర్కొనే విషయంలో భారత్ తన హామీలకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలు వాతావరణ మార్పులను తట్టుకునేందుకు అవసరమైన ఆర్థిక తోడ్పాటును, సాంకతికతను అభివృద్ధి చెందుతున్న దేశాలకు బదిలీ చేయాలని ఆయన కోరారు. ఐరాస కార్యక్రమం కాప్–28లో భాగంగా శుక్రవారం జరిగే వరల్డ్ క్లైమేట్ యాక్షన్ సమిట్‌లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ గురువారం సాయంత్రం ఢిల్లీ నుంచి దుబాయ్‌కి బయలుదేరారు.

హెన్రీ కిసింజర్ కన్నుమూత

వందేళ్ల వయసులో తుదిశ్వాస • శక్తివంతమైన దౌత్యవేత్తగా గుర్తింపు



వాషింగ్టన్: అమెరికా విదేశాంగ శాఖ మాజీ మంత్రి, అంతర్జాతీయ దౌత్య నిపుణుడు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, అమెరికా విదేశాంగ విధానం రూపశిల్పిగా పేరుగాంచిన హెన్రీ కిసింజర్ తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు వందేళ్లు. చాలా రోజులుగా అనారోగ్యంగో బాధపడుతున్న కిసింజర్ కనెక్టికట్‌లో తన నివాసంలో బుధవారం కన్నుమూశారని ఆయన కన్సల్టింగ్ కంపెనీ 'కిసింజర్ అసోసియేట్స్' ప్రకటించింది. అమెరికా విదేశాంగ విధానం గురించి ఎక్కడ చర్చ జరిగినా కిసింజర్ పేరు ప్రస్తావనకు రావాల్సిందే. అంతలా ఆయన తనదైన ముద్ర వేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో సైనికుడిగా పాల్గొన్న కిసింజర్ 21వ శతాబ్దంలోనూ ప్రపంచ పరిణామాలను ప్రభావితం చేశారు.

ఏకకాలంలో రెండు కీలక పదవులు

కిసింజర్ 1923 మే 27న జర్మనీలోని బవేరియన్ సిటీలో జన్మించారు. యూదు మతస్తుడైన కిసింజర్ 1938లో తన కుటుంబంతో కలిసి అమెరికా చేరుకున్నారు. న్యూయార్క్‌లోని మన్‌హట్టన్‌లో స్థిరపడ్డారు. మాతృభాష జర్మన్. ఇంగ్లిష్ భాష అనర్గళంగా మాట్లాడే స్థాయికి చేరుకున్నప్పటికీ చనిపోయే దాకా జర్మన్ యాస మాత్రం ఆయనను వదల్లేదు. న్యూయార్క్ సిటీలోని జార్జి వాషింగ్టన్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్య అభ్యసించారు. తర్వాత అమెరికా సైన్యంలో చేరారు. మాతృదేశం జర్మనీలో అమెరికా తరఫున పోరాడారు. నిఘా విభాగంలో పనిచేశారు. జర్మనీలో నాజీలను ఓడించేందుకు తన వంతు సేవలందించారు. ఆయనకు 'బ్రాంజ్ స్టార్' లభించింది. తర్వాత అమెరికాకు తిరిగివచ్చారు. హార్వర్డ్ యూనివర్సిటీలో చేరారు. అదే యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. అంతర్జాతీయ వ్యవహారాలపై పరిజ్ఞానం పెంచుకున్నారు. రిపబ్లికన్ పార్టీ నేత, న్యూయార్క్ గవర్నర్ నెల్సన్ రాక్‌ఫెల్లర్‌కు సలహాలు ఇచ్చేవారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రైమరీల్లో రిపబ్లికన్ పార్టీ నాయకుడు రిచర్డ్ నిక్సన్ విజయం సాధించారు. దాంతో కిసింజర్.. నిక్సన్ వర్గంలో చేరిపోయారు. నిక్సన్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక కిసింజర్‌ను జాతీయ భద్రతా సలహాదారుగా నియమించారు. 1973లో విదేశాంగ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. ఏకకాలంలో రెండు కీలక పదవుల్లో కిసింజర్ చక్రం తిప్పారు. కిసింజర్ తర్వాత అమెరికాలో ఈ రెండు పదవులను ఒకేసారి ఎవరూ నిర్వర్తించలేదు. వాటర్‌గేట్ కుంభకోణంలో నిక్సన్ రాజీనామా చేయడంతో అధ్యక్షుడైన గెరాల్డ్ ఫోర్డ్ హయాంలోనూ కిసింజర్ అమెరికా విదేశాంగ మంత్రిగా సేవలందించారు. వియత్నాంలో అమెరికా యుద్ధానికి ముగింపు పలికేలా చొరవ తీసుకున్నందుకు 1973లో ఆయనకు నోబెల్ శాంతి బహుమతి లభించింది. ఇజ్రాయెల్–అరబ్ దేశాల మధ్య ఘర్షణలను నివారించడంలో కీలక పాత్ర పోషించారు. అత్యంత శక్తివంతమైన దౌత్యవేత్తగా గుర్తింపు పొందారు. ఆయనకు మొదటి భార్య ద్వారా ఎలిజబెత్, డేవిడ్ జన్మించారు.

భారత వ్యతిరేక వైఖరి

విదేశాంగ మంత్రిగా పదవీ కాలం పూర్తయిన తర్వాత కూడా ఆయన సలహాదారుగా పనిచేశారు. కార్పొరేషన్లకు, రాజకీయనాయకులకు, ప్రపంచ స్థాయి నేతలకు సలహాలు ఇస్తుండేవారు. సభలు, సమావేశాల్లో పాల్గొనేవారు. ప్రపంచ పరిణామాలపై తనఅభిప్రాయాలు వెల్లడించేవారు. పలు చిన్న, దుర్బల దేశాలపై అమెరికా యుద్ధాలు, దాడుల వెనుక కిసింజర్ దుష్ట రాజనీతి ఉందన్న ఆరోపణలు వచ్చాయి. ఆయనను యుద్ధ నేరగాడిగా పలు దేశాలు అభివర్ణించాయి. కిసింజర్ రెండు సార్లు చైనాలో పర్యటించారు. సోవియట్ రష్యాకు చెక్ పెట్టడానికి చైనాతో ద్వైపాక్షిక సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. 1971లో భారత్–పాకిస్తాన్ మధ్య భీకర యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అమెరికా ప్రభుత్వం పాకిస్తాన్‌కు అండగా నిలిచింది. దీని వెనుక కిసింజర్ ఒత్తిడి ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అప్పట్లో భారత్‌ను కిసింజర్ తీవ్రంగా వ్యతిరేకించేవారు. తరచూ విమర్శలు చేస్తుండేవారు. భారత్‌ను తప్పుపట్టినందుకు ఆ తర్వాతి కాలంలో ఆయన తన సన్నిహితుల వద్ద పశ్చాత్తాపం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఇజ్రాయెల్-హమాస్ ఒప్పందం పొడిగింపు

గాజా స్ట్రిప్/జెరూసలేం: కాల్పుల విరమణ ఒప్పందాన్ని మరొక రోజు పొడిగించేందుకు ఇజ్రాయెల్–హమాస్ గురువారం అంగీకరించాయి. వాస్తవానికి గురువారం ఉదయం 7 గంటలకు ఒప్పందం ముగిసింది. బందీలంతా ఇంకా విడుదల కాకపోవడం, గాజాలోని పాలస్తీనియన్లకు మరింత మానవతా సాయం అందాల్సి ఉండడంతో ఒప్పందం పొడిగింపునకే ఇరుపక్షాలు మొగ్గుచూపాయి. గాజాలోని శాంతి కోసం ఇజ్రాయెల్, హమాస్‌పై అంతర్జాతీయ సమాజం నుంచి ఒత్తిడి పెరుగుతోంది. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ బుధవారం రాత్రి ఇజ్రాయెల్ చేరుకున్నారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఘర్షణలకు తెరదించే దిశగా ఆయన ప్రయత్నాలు ముమ్మరం చేయనున్నట్లు తెలిసింది. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా హమాస్ మిలిటెంట్లు ఇప్పటిదాకా 73 మంది ఇజ్రాయెలీలను, 24 మంది ఇతర దేశస్తులను విడుదల చేశారు. ఇంకా 126 మంది హమాస్ చెరలో బందీలుగా ఉన్నట్లు అంచనా.

జెరూసలేంలో కాల్పులు.. ముగ్గురి మృతి

జెరూసలేంలో ఉద్రిక్తత పరిస్థితుల నెలకొన్నాయి. బుధవారం ఉదయం 7.40 గంటలకు వీచ్‌మ్యాన్ వీధిలో బస్‌స్టాప్‌లో నిల్చున్న ప్రయాణికులపై ఇద్దరు సాయుధ పాలస్తీనియన్ దుండగులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు ఇజ్రాయెలీలు మృతిచెందారు. మరో ఆరుగురు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు చెప్పారు. భద్రతా సిబ్బంది జరిపిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు దుండగులు హతమయ్యారు. వారిద్దరూ తూర్పు జెరూసలేంకు చెందిన సోదరులని తెలిసింది. గతంలో ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొని జైలుకు వెళ్లొచ్చారు.

రేపు అఖిలపక్ష భేటీ

పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం


న్యూఢిల్లీ: డిసెంబర్ నాలుగో తేదీ నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మొదలుకానున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష భేటీకి పిలుపునిచ్చింది. డిసెంబర్ రెండో తేదీన(శనివారం) అఖిలపక్ష సమావేశానికి హాజరుకావాలని సంబంధిత రాజకీయ పార్టీలకు కేంద్రం ఆహ్వానం పంపింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రల్హాద్ జోషీ అధ్యక్షతన జరిగే ఈ భేటీలో కేంద్రం తరఫున రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, వాణిజ్య మంత్రి పియూశ్ గోయల్‌తోపాటు రాజకీయ పార్టీల లోక్‌సభ, రాజ్యసభ పక్ష నేతలు పాల్గొంటారు. ప్రస్తుతం పార్లమెంట్ వద్ద 37 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సారి సెషన్‌లో ఏడు బిల్లులను ప్రవేశపెట్టాలని, 12 బిల్లులను ఆమోదింపజేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గ్రాంట్ల తొలి అదనపు బిల్లులను ప్రవేశపెట్టాలని సర్కార్ భావిస్తోంది. లోక్‌సభలో 'నగదుకు ప్రశ్నలు' ఉదంతంలో టీఎంసీ మహిళా ఎంపీ మహువా మొయిత్రాపై బహిష్కరణ వేటు వేయాలంటూ నైతికవిలువల కమిటీ ఇచ్చిన సిఫార్సును ఈసారి సభలో ప్రవేశపెట్టాలని కేంద్రం యోచిస్తోంది. భారతీయ శిక్షా స్మృతి, నేర శిక్షా స్మృతి, సాక్ష్యాధారాల చట్టాల స్థానంలో కొత్త బిల్లులను సభ ముందు ఉంచాలని మోదీ ప్రభుత్వం భావిస్తోంది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఎలక్షన్ కమిషనర్ల నియామక బిల్లునూ ప్రవేశపెట్టే అవకాశముంది.

సాక్షి
కరీంనగర్
శుక్రవారం | 1 | డిసెంబర్ | 2023



ఘనంగా సంకటహర చతుర్థి

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ మహాగణపతి ఆలయంలో గురువారం సంకటహర చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



మళ్లీ అవే ఓటుపాట్లు

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ఎన్నికల్లో తప్పుల తడకలతో కూడిన ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచి గందరగోళాన్ని సృష్టించారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/22.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.





కొత్తపల్లిలో క్యూలో నిల్చున్న ఓటర్లు

- అత్యధికంగా మానకొండూరులో 81.32శాతం
- అత్యల్పంగా కరీంనగర్‌లో 64.17శాతం ఓటింగ్ నమోదు
- 2018తో పోలిస్తే మరింత పెరుగుతుందని అంచనా
- సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా
- పూర్తయిన ఈవీఎంల తరలింపు
- కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఈవీఎంలకు రక్షణ
- ఎగ్జిట్ పోల్స్ సర్వేపై మిశ్రమ స్పందన

పోలింగ్ ప్రశాంతం

జిల్లాలో ముగిసిన ఓట్ల పండుగ

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కరీంనగర్, మానకొండూరు, హుజూరాబాద్, చొప్పదండి నియోజకవర్గాల్లో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా మానకొండూరులో 81శాతం ఓటింగ్ నమోదు కాగా.. అత్యల్పంగా కరీంనగర్‌లో 64శాతం నమోదైంది. ఉదయం ఏడు గంటలకే మొదలైన ఓటింగ్ సాయంత్రం 5 గంటల వరకు సాగింది. అప్పటికే క్యూలైన్లో ఉన్న అందరికీ ఓటేసే అవకాశం కల్పించారు. కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మహంతి తీసుకున్న ప్రత్యేక చర్యలు, సమస్యాత్మక ప్రాంతాలపై ముందస్తుగా ఉంచిన ప్రత్యేక నిఘాతో ఎలాంటి అలజడులు లేకుండా పోలింగ్ సాఫీగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సీపీ సందర్శించారు. కరీంనగర్ రూరల్ పరిధిలోని దుర్శేడ్, బొమ్మకల్, వీణవంక, నర్సింగాపూర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూర్, జమ్మికుంటతో పాటు పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ ముగిశాక ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంల వద్దకు తరలించి బీఎస్ఎఫ్, కేంద్ర బలగాల పహారాలో భద్రతగా ఉంచారు. ఈ నెల మూడోతేదీన కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనుంది.

కరీంనగర్ నియోజకవర్గంలో..

- రేకుర్తిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్‌కు ఎన్నికల ఏజెంట్‌గా ఉన్న అబుబాకర్ ఖాలీద్ వాహనాన్ని అడ్డగించి మాజీ సర్పంచి నందెల్లి ప్రకాశ్ దాడి చేశాడని పోలీసులకు ఫిర్యాదు అందింది.
- కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా కేంద్రంలోని పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించి, ఓటింగ్ సరళిని పరిశీలించారు.
- కిసాన్‌నగర్ ప్రాంతంలోని 388బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో అరగంటపాటు ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగింది.

చొప్పదండిలో..

- రెండు మూడు చోట్ల పోలింగ్ ప్రారంభమైన సమయంలో ఈవీఎంల మొరాయింపు మినహా ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాలేదు.
- ఎమ్మెల్యే రవిశంకర్ బూరుగుపల్లిలో, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు సత్యం, శోభ మధురానగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మానకొండూరులో...

- గులాబీ కలర్ చొక్కా ధరించి వచ్చాడని రసమయి బాలకిషన్‌ను గన్నేరువరంలో, తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకోగా స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు కలగజేసుకోవడంతో సద్దుమణిగింది.
- శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామంలో ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు పోలింగ్‌కేంద్రంలోకి వెళ్లిన కవ్వంపల్లి అనురాధను సర్పంచ్ అడ్డుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది.
- మానకొండూరు మండలం ఊటూరు గ్రామంలో సొసైటీ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి, పచ్చునూరులో పి కిషన్ అనే వ్యక్తులు డబ్బులతో పట్టుబడ్డారు. వీరిపై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.
- తిమ్మాపూర్‌లో ఆటోలో కాంగ్రెస్, టీఆర్ఎస్ నాయకులు ఓటర్లను తరలిస్తున్నారని పరస్పర ఆరోపణలు చేసుకున్నారు.

హుజూరాబాద్‌లో..

ఉదయం నుంచి నియోజకవర్గ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. వీణవంక మండలకేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి, హిమ్మత్‌నగర్ గ్రామంలో తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, సింగాపూర్ గ్రామంలో మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రణవ్ బాబు, హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి వి.సతీశ్‌బాబు, కమలాపూర్ మండలకేంద్రంలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్ రావు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఎగ్జిట్ పోల్స్‌పై మిశ్రమ స్పందన..

సాయంత్రానికి వచ్చిన ఎగ్జిట్ పోల్స్ జిల్లాలో జోరుగా చర్చ నడుస్తోంది. అయితే, ఈ ఫలితాలపై నాయకుల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. పోలింగ్ నడుస్తుండగానే ఆన్‌లైన్‌లో సర్వేలు ఎలా పెడతారని అధికార పార్టీ నాయకులు మండిపడుతున్నారు. మరోవైపు ఈ ప్రతిపక్ష నాయకులు సైతం ఈ సర్వేలలో అంకెలను తాము విశ్వసించడం లేదని, కేవలం ప్రజల ఆశీర్వాదాన్ని నమ్ముకున్నామని అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో పోలింగ్ సరళి ఇలా...(శాతంలో)

నియోజకవర్గం	9-11 గం.	11-1 గం.	1-3గం.	3-5 గం.
కరీంనగర్	14.6	38.90	53.71	64.17
మానకొండూరు	26.74	44.38	61.75	81.32
హుజూరాబాద్	18.3	41.40	55.16	80.62
చొప్పదండి	24.38	39.34	54.15	77.68

నోట్: కొన్ని సెంటర్లలో రాత్రి వరకు పోలింగ్ కొనసాగడంతో ఓటింగ్‌శాతం మరింత పెరిగే అవకాశముంది



భద్రంగా తెచ్చాం: ఎన్నికలు ముగిశాక ఈవీఎంలను నగరంలోని స్ట్రాంగ్‌రూంకు తీసుకొస్తున్న సిబ్బంది



ఓట్ ఫర్ ష్యూర్: ఓటేసిన కలెక్టర్ పమేలా సత్పతి



ఆదర్శం: సిటీలో ఓటేసిన దివ్యాంగులు, వృద్ధులు



అండర్ కంట్రోల్: కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ



ఫస్ట్ ఓట్: తొలిసారి ఓటు వేసిన యువతులు



మూడోకన్ను: ఓటింగ్ పరిశీలిస్తున్న అధికారులు



అన్నా గుర్తుంచుకో: ఓటేయాలని కోరుతూ...

అభివృద్ధికే పట్టం



కరీంనగర్‌లో ఆరు దశాబ్దాలుగా జరగని అభివృద్ధి పదేళ్లలో జరిగింది. వేల కోట్లతో సిటీ రూపురేఖలు మార్చాను. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు. మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపించేందుకే నిర్ణయించుకున్నారు.కరీంనగర్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం.
– గంగుల కమలాకర్, కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి

భారీ మెజారిటీతో గెలుస్తా



కరీంనగర్ ఎమ్మెల్యేగా నన్ను ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించబోతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజలు ఆసహనంతో బీజేపీకి ఓట్ల వర్షం కురిపించారు. అన్ని వర్గాల మద్దతుతో బీజేపీ అఖండ విజయం సాధించబోతోంది.
– బండి సంజయ్, కరీంనగర్ బీజేపీ అభ్యర్థి


వచ్చేది నిశబ్ద విప్లవం

దేశంలో, రాష్ట్రంలో పరిపాలిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయి. కార్పొరేట్ సంస్థలకు దాసోహం అవుతూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నాయి. ఆ పార్టీలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు ఉత్సాహంతో ఉన్నారు. ఓట్లతో కాంగ్రెస్ పక్షాన నిశబ్ద విప్లవం రాబోతోంది. కాంగ్రెస్ విజయం ఖాయం.



– పురుమల్ల శ్రీనివాస్, కరీంనగర్ కాంగ్రెస్ అభ్య

బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు భవిష్యత్ లేదు



హుజూరాబాద్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు భవిష్యత్ లేదు. ఆ రెండు పార్టీలకు నియోజకవర్గ ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెబుతున్నారు. రెండేళ్లుగా వాళ్లు చేస్తున్న కుట్రలు, దౌర్జన్యాలకు ప్రజలు ప్రతిఫలం ఇస్తున్నారు. అధికారం, అహంకారాన్ని ఎదిరించి, దమననీతి, దౌర్జన్యాల చెంప చెల్లుమనిపిస్తున్నారు.
– ఈటల రాజేందర్, హుజూరాబాద్ బీజేపీ అభ్యర్థి

బీఆర్ఎస్‌దే విజయం



హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో విజయం సాధించబోతోంది. ప్రజల నుంచి విశేష స్పందన ఉంది. ఎవరూ ఊహించుకోని విధంగా కారు దూసుకుపోతోంది. అందరికీ షాక్ తగిలే విధంగా కమలాపూర్ మండలంతో పాటు ఎమ్మెల్యే స్వగ్రామంలోనూ బీఆర్ఎస్ లీడ్‌లో ఉండబోతోంది.
– పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి

ఎగిరేది కాంగ్రెస్ జెండానే..

తెలంగాణతో పాటు హుజూరాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరబోతోంది. ఈఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించబోతున్నారు.
– వొడితల ప్రణవ్, హుజూరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి



బీఆర్ఎస్‌పైనే విశ్వాసం



బీఆర్ఎస్ పార్టీపైనే ఓటర్లకు పూర్తి విశ్వాసం ఉంది. కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు జరిగింది. ప్రతీ కుటుంబం కేసీఆర్ సంక్షేమ పథకాలు తీసుకుంటోంది. మేలు చేసిన వారికి ప్రజలు కీడు చేయరు. ఈ ఎన్నికల్లో గెలుపు నాదే.
– రసమయి బాలకిషన్, మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి

ఓటర్లు కాంగ్రెస్ వైపే



బీఆర్ఎస్ పార్టీ నాయకులు మద్యం, డబ్బులు పంపిణీ చేశారు. అయినా ఓటర్లు కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారు. రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే. మానకొండూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురుతుంది. ప్రభుత్వ పథకాల వైఫల్యాలు మాకు అనుకూలం.
– కవ్వంపల్లి సత్యనారాయణ, మానకొండూర్ కాంగ్రెస్ అభ్యర్థి

ధర్మమే విజయం సాధిస్తుంది

ఈ ఎన్నికల్లో గెలుపు నాదే. బీఆర్ఎస్ విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేస్తే, కాంగ్రెస్ పార్టీ మద్యం పంపిణీ చేసింది. లోపాయికారి ఒప్పందంతో ఈ రెండు పార్టీలు పనిచేస్తున్నాయి. మద్యం, డబ్బుల పంపిణీ నివారించడంలో ఎన్నికల అధికారులు విఫలం అయ్యారు. ప్రజాస్వామ్యంలో ధర్మమే విజయం సాధిస్తుంది. – ఆరెపల్లి మోహన్, మానకొండూర్ బీజేపీ అభ్యర్థి





ఓటేసిన వినోద్‌కుమార్ దంపతులు



మేయర్ సునీల్ రావు దంపతులు



పోల్‌చీటీ ప్లీజ్: సప్తగిరికాలనీలో ఓటర్లకు పోల్ చీటీలు ఇస్తున్న ఎన్నికల సిబ్బంది



సిటీలో ఈవీఎంకు సీల్ వేస్తున్న సిబ్బంది

ఓటర్ల నమోదులో జిల్లా యంత్రాంగం కృషి భేష్

- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్/కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లా యంత్రాంగం కృషి అభినందనీయమని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి ప్రశంసించారు. స్వీప్ కార్యక్రమాల ద్వారా జిల్లాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. గురువారం జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. నగరంలోని వివేకానంద పాఠశాలలోని 333, 334, స్వశక్తి కళాశాలలోని మోడల్ పోలింగ్ కేంద్రాలు 311,312, 313, కేడీసీసీ బ్యాంకులో ఏర్పాటు చేసిన 144,145, సుభాష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలోని 189, 190, 191 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సుభాష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో తమ ఓటుహక్కును వినియోగించుకున్న 42మంది థర్డ్ జెండర్లతో కలిసి ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ఓటు హక్కును కల్పించినందుకు థర్డ్ జెండర్లు జిల్లా కలెక్టర్‌కు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు స్వశక్తి కళాశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. డీఆర్‌డీవో శ్రీలత, మెప్మాపీడీ రవీందర్, డీడబ్ల్యూవో సరస్వతి పాల్గొన్నారు.



ఓటుహక్కు వినియోగించుకున్న ట్రాన్స్‌జెండర్లతో కలెక్టర్ పమేలా సత్పతి

ఓటేసిన కలెక్టర్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి గురువారం ఓటు హక్కును వినియోగించారు. ఉదయమే మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.

ఈవీఎంకు జీపీఎస్



కరీంనగర్ అర్బన్: ఈవీఎంలపై ఎన్నికల సంఘం పక్కా నిఘాను ఏర్పాటు చేసింది. యంత్రాలకు జీపీఎస్ అనుసంధానం చేయగా వాటి కదలికలు తక్షణమే తెలిసేలా కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానించారు. ఈవీఎం గోడౌన్ నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, అక్కడి నుంచి పోలింగ్ కేంద్రాలను తరలించగా అనుక్షణం వీడియో నిక్షిప్తం చేశారు. ఈవీఎం తీసుకెళ్లే వాహనాలను అనుసంధానించగా ఎక్కడ ఎలాంటి అవకతవకలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం స్ట్రాంగ్ రూంకు తరలింపు, కౌంటింగ్ తదుపరి గోడౌన్ చేరేవరకు జీపీఎస్ సిస్టం ద్వారా పర్యవేక్షించనున్నారు.

ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయి



కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి. స్థానికుడిని కావడం, నిత్యం ప్రజల్లో ఉండడం, వారి కష్టసుఖాలలో భాగస్వామ్యం కావడం నాకు కలిసి వచ్చింది. ఓటింగ్ సరళి బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉంది.
– సుంకె రవిశంకర్, చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి

పోరాటం గెలుస్తుంది



చొప్పదండి నియోజకవర్గంలో ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలపై పోరాటం చేశాను. రెండు సార్లు ఓడిపోయినా, ప్రజలు నాపై ప్రేమను చూపించారు. ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు, కాంగ్రెస్ కార్యకర్తల కృషితో అత్యధిక మెజారిటీతో గెలుస్తా. ఆరు మండలాలలో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటింగ్ సరళి ఉంది.
– మేడిపల్లి సత్యం, చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి

ఓటు వేస్తూ ఫొటో తీసుకొని..

- స్టేటస్ పెట్టుకున్న ఇద్దరిపై కేసు

మానకొండూర్: ఓ వ్యక్తి అత్యుత్సాహంతో ఓటు వేస్తూ సెల్‌ఫోన్‌లో ఫొటో తీసుకున్నాడు. తర్వాత దాన్ని స్టేటస్ పెట్టుకోగా అతనిపై మానకొండూర్ ఠాణాలో కేసు నమోదైంది. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం అసెంబ్లీ ఎన్నికలు జరగగా ఊటూరుకు చెందిన గోపు బుజేందర్ రెడ్డి పోలింగ్ బూత్‌కు వెళ్లాడు. ఓటు వేసే సమయంలో తన ఫోన్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేస్తున్నట్లు ఫొటో తీసుకొని, స్టేటస్ పెట్టుకున్నారు. ఇది చూసిన ఓ వ్యక్తి దాన్ని స్క్రీన్ షార్ట్ తీసి, మానకొండూర్ ఎన్నికల అధికారి సునందకు వాట్సాప్‌లో పంపించారు. దీనిపై ఆ అధికారి ఆరా తీసి, వివరాలు సేకరించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంగించారని తేల్చి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుజేందర్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

వీణవంక(హుజూరాబాద్):మండలంలోని రెడ్డిపల్లిలో కట్ట అశోక్ తన ఓటు వేస్తూ ఫోన్ ద్వారా ఫొటో తీశాడని ఎస్ఐ తెలిపారు. దాన్ని స్టేటస్‌గా పెట్టుకొని, ఇతరులకూ పంపించాడని అన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినందున అతనిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఓటర్లకు డబ్బులు పంచిన వ్యక్తులపై కేసు

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని పలు చోట్ల గురువారం ఓటర్లకు పంచిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆసిఫ్ తెలిపారు. బేతిగల్‌లో వీరంనేని సంపత్‌రావు నుంచి రూ. 93, 500, వీణవంకలో రాయిశెట్టి కుమార్ నుంచి రూ. 99 వేలు, చల్లూరులో మహమ్మద్ అఖిల్ పాషా, గూడెపు సమ్మయ్యల నుంచి రూ.30 వేలు పట్టుకొని, సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కనపర్తిలో బీర్లు పంచుతున్న లోకిని మల్లేశ్‌ను పట్టుకున్న ట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడిపై..

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని అర్పపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సొల్లు సురేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సురేందర్ గురువారం ఓటు వేయాలని ఓటర్లను ప్రలోభపెడుతూ డబ్బులు పంచుతుండగా గుర్తు తెలియని వ్యక్తి తన ఫోన్‌లో వీడియో తీసి, పోలీసులకు పంపించాడు. దీని ఆధారంగా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినందుకు సురేందర్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

దొంగ ఓటు వేసిన వ్యక్తిపై..

సాక్షి, పెద్దపల్లి: ధర్మారం మండలం బొట్లవనపర్తి గ్రామానికి చెందిన ఆకారి సత్యం దొంగ ఓటు వేశారని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. బీఆర్‌ఎస్ యూత్ కోఆర్డినేటర్ సత్యం బొట్లవరపర్తి గ్రామంలోని 158 పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. ఓటు వేసిన సమయంలో అధికారులు చేతి వేలుకు సిరాను వేసిన, దానిని అతడు చెరిపి వేశాడు. తిరిగి రెండోసారి ధర్మారంలోని 134 పోలింగ్ బూత్‌లో మరోసారి దొంగ ఓటు వేశాడు. ఇది గమనించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఓరం చిరంజీవి అతనిపై పీవోకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన ఎన్నికల అధికారులు రెండు పోలింగ్ కేంద్రాల్లో వేసిన ఓటును చెక్ చేశారు. రెండు చోట్ల ఓటు వేసినట్లు నిర్ధారించుకున్న ఎన్నికల ఎఫ్‌ఎస్‌టీ మెజిస్ట్రేట్ చలపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ధర్మారం ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మల్యాల(చొప్పదండి): ముత్యంపేటలో దిగువ కొండగట్టు వద్ద రోడ్డు దాటుతున్న బైక్‌ను కారు ఢీకొనడంతో ఒకరు గాయపడ్డారు. కొండగట్టుకు చెందిన ఎల్లయ్య బైక్‌పై రోడ్డు దాటుతుండగా వేగంగా వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు సమాచారం అందించగా, ఈఎంటీ జ్యోతి, పైలట్ అనిల్ వచ్చి, ప్రథమ చికిత్స చేసి, జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మళ్లీ అవే ఓటు పాట్లు

రాజన్నసిరిసిల్ల జిల్లా తొలి కలెక్టర్ దేవరకొండ కృష్ణభాస్కర్ అందరికీ సుపరిచితులే. ఆయన రెండు పర్యాయాలు జిల్లాలో కలెక్టర్‌గా పనిచేశారు. రెండున్నరేళ్ల కిందట ఆయన బదిలీ అయ్యారు. కానీ కృష్ణభాస్కర్ పేరిట సిరిసిల్లలోని ఇంటి నంబరు 6–6–73లో ఓటుహక్కును కల్పించారు. జిల్లాలో పనిచేసిన కాలంలో ఓటేసుందుకు నమోదు చేసుకోగా.. ఆయన బదిలీ అయినా.. కూడా ఇంకా జిల్లా ఓటరుగా జాబితాలో ఉన్నారు.





ఇతను కోదం ప్రభాకర్. సిరిసిల్లలోని శాంతినగర్‌కు చెందిన వస్త్ర వ్యాపారి. మూడేళ్ల కిందట ప్రభాకర్ మరణించారు. కానీ ఓటర్ల జాబితాలో పేరు ప్రత్యక్షమైంది. కోదం ప్రభాకర్ కుటుంబ సభ్యులు ఓటరు జాబితాలో ప్రభాకర్ పేరును చూసి.. అవాక్కయ్యారు. చనిపోయిన వ్యక్తి పేరును ఓటర్ల సవరణలో కనీసం గుర్తించకపోవడం గమనార్హం.

- తప్పుల తడకగా ఓటరు జాబితా
- అందని ఓటరు సమాచార స్లిప్‌లు
- బదిలీ అయిన కలెక్టర్‌కు ఓటు
- చనిపోయిన వారికి జాబితాలో స్థానం
- ఇవీ సిరిసిల్ల రెవెన్యూ అధికారుల లీలలు



పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల జాబితా పరిశీలన

సిరిసిల్ల: తప్పులు లేని ఓటర్ల జాబితా లక్ష్యమంటూ రెవెన్యూ అధికారులు బూత్ లెవల్ అధికారులతో తరచూ సమావేశాలు నిర్వహించడం, సెలవు రోజుల్లో సవరణల పేరిట పోలింగ్‌స్టేషన్(సూకల్స్)లో అందుబాటులో ఉంచడం జరుగుతుంది. కానీ రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ఎన్నికల్లో తప్పుల తడకలతో కూడిన ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచి గందరగోళాన్ని సృష్టించారు. క్షేత్రస్థాయి వాస్తవాలను నమోదు చేయకుండా.. పాత జాబితా ఆధారంగా తప్పుల జాబితాను ఎన్నికలకు అందుబాటులో ఉంచడం విమర్శలకు తావిస్తుంది.

అందని ఓటరు సమాచార స్లిప్‌లు

జిల్లాలో ఇంటింటికి ఓటరు సమాచార స్లిప్‌లను అందించామని జిల్లా అధికార యంత్రాంగం గొప్పగా ప్రకటించింది. కానీ వాస్తవానికి 50 శాతం ఓటర్లకు కూడా ఆ సమాచార స్లిప్‌లను అందించలేదు. ఫలితంగా ఓటర్లు పోలింగ్‌స్టేషన్‌తోపాటు ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఎక్కడ ఉన్నాయో తెలుసుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ఏ పోలింగ్ స్టేషన్‌లో ఓటు ఉందో తెలియక చాలా మంది తికమక పడ్డారు. చివరికి ఓటు వేయకుండానే వెనుదిరిగారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో ఓటరు సమాచార స్లిప్‌లను పంపిణీ చేయడంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ఫలితంగా ఓటర్లు క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పడ్డారు. పోలింగ్‌శాతం మరింత పెరిగే అవకాశం ఉన్నా.. అధికారుల నిర్లక్ష్యంతో జిల్లాలో గురువారం ఓటు పాట్లు తప్పలేదు.

దూరభారం.. ఓటుపై మమకారం

- దేశవిదేశాల నుంచి వచ్చిన జిల్లావాసులు

సిరిసిల్ల/వేములవాడ/తంగళ్లపల్లి: ఎన్నికల వేళ.. దూరభారాన్ని అధిగమించి ఓటు వేసేందుకు రావడం విశేషం. ఊరిలో ఉండి.. ఓటు వేసేందుకు సైతం పోలింగ్‌స్టేషన్ వరకు రాకుండా.. నిర్లక్ష్యం చేసే ఈ రోజుల్లో హైదరాబాద్‌తోపాటు విదేశాల్లో ఉన్న వారు సైతం ఓటు వేసేందుకు రాజన్నసిరిసిల్ల జిల్లాకు వచ్చారు. స్వగ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వేములవాడకు చెందిన ఎన్‌ఆర్‌ఐ తోట రామ్ కుమార్, జావిద్ దుబాయ్ నుంచి వచ్చి ఓటు వేశారు. కాన్పూర్ ఐఐటీలో బీటెక్ సెకండియర్ చదువుతున్న తంగళ్లపల్లి మండలం చిన్న లింగాపూర్‌కు చెందిన చీకోటి శ్రీహిత ఓటుహక్కు కోసం స్వగ్రామానికి వచ్చింది.





దుబాయ్ నుంచి వచ్చిన రామ్‌కుమార్, జావిద్, కాన్పూర్ నుంచి వచ్చిన శ్రీహిత

ఓటు వేసేందుకు వచ్చాం

మాది కోనరావుపేట మండలం బావుసాయిపేట. మేమిద్దరం హైదరాబాద్‌లోని నిజాంపేటలో ఉంటాం. మా ఇద్దరు అబ్బాయిలలో ఒకరు డాక్టర్, ఇంకొకరు ఇంజినీర్. మాకు స్వగ్రామంలోనే ఓటుహక్కు ఉంది. ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చాం. బంధువులతో కలిసి ఇలా ఓటు వేయడం సంతోషంగా ఉంది. స్నేహితులందరూ కలిశారు.



– చీటి రామారావు–జలజ దంపతులు, బావుసాయిపేట

ప్రతీసారి ఇక్కడే ఓటు వేస్తాం

మాది తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల. ప్రతీసారి ఎన్నికల సమయంలో ఇక్కడికే వచ్చి ఓటు వేస్తాం. ఉద్యోగరీత్య హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. ఏ ఎన్నికలు వచ్చినా.. ఓటు వేయడం మాత్రం మా ఊరిలోనే. ఈసారి ముందే ప్లాన్ చేసుకుని వచ్చి ఓటు వేశాం. మా అన్న విజయేందర్‌రెడ్డి, వదినే సంధ్య, మా కూతురు మనస్వితారెడ్డి, మా ఆవిడ ఉమాతో కలిసి ఓటు వేయడం ఆనందంగా ఉంది.



– పబ్బతి జితేందర్‌రెడ్డి –ఉమా దంపతులు, జిల్లెల్ల

బీఆర్‌ఎస్ పక్షాన ప్రజలు

- అభివృద్ధిని చూసి ఆశీర్వదించనున్నారు
- బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్



మాట్లాడుతున్న మంత్రి కమలాకర్

కరీంనగర్: బీఆర్‌ఎస్ పక్షాన ప్రజలు నిలిచారని, కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మబోరని, పదేళ్లుగా జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టనున్నారని కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం ఓటు వేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆరు దశాబ్దాలుగా పరిపాలించిన రాజకీయ పార్టీలు తెలంగాణ అభివృద్ధిని విస్మరించాయని అన్నారు. నీళ్లు, నిధులు, నియమాకాల కోసం పుట్టిన బీఆర్‌ఎస్ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ సారథ్యంలో పదేళ్లల్లోనే గణనీయమైన అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుంటే ప్రతిపక్షాలకు కళ్లమంట మొదలైందని అన్నారు. ఏదిఏమైనా రాష్ట్రంలో మరోసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, కరీంనగర్‌లో అత్యధిక మెజార్టీతో తాను గెలవడం తథ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సవాల్ విసిరి, పారిపోయాడు

- మంత్రి గంగులపై బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎంపీ సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: తాను డబ్బు పంచానని ఆరోపించి, ప్రమాణం చేయాలంటూ సవాలు విసిరిన బీఆర్‌ఎస్ అభ్యర్థి కమలాకర్ పారిపోయాడని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, అభ్యర్థి ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు బీజేపీని అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. గురువారం కరీంనగర్ జ్యోతినగర్‌లో 174వ పోలింగ్ బూత్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం సంజయ్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ దాడులు చేస్తుందని, మరేదో చేస్తుందంటూ తనపై సామాజిక మాధ్యమాల ద్వారా బురదచల్లే ప్రయత్నం చేశారని, వాటిని ప్రజలు నమ్మలేదని అన్నారు. జలాల విషయంలో పక్క రాష్ట్రంతో కుమ్ముక్కయిన కేసీఆర్ తెలంగాణకు అన్యాయం చేశాడన్నారు. కరీంనగర్ పట్టణంతో పాటు కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల్లో వివిధ గ్రామాలకు వెళ్లి ఓటింగ్ సరళి తెలుసుకున్నారు.

ఓటర్లపై కుక్క దాడి : పది మందికి తీవ్ర గాయాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్‌లో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లపై ఓ కుక్క దాడిచేసింది. పోలింగ్ కేంద్రానికి ఓటేసేందుకు వచ్చిన వారిపై కుక్క విచక్షణ రహితంగా దాడి చేసింది. బూత్‌నంబర్ 206, 207 పోలింగ్ కేంద్రాల ఎదుట వేచి ఉన్న పది మందిపై కుక్క దాడి చేసింది. కుక్క దాడిలో కొండెల్లి నర్సయ్య, సీహెచ్.లస్మవ్వ, ఆర్.పద్మ, నల్ల చారి, జవహర్ తీవ్రంగా గాయపడ్డారు. మోహర్ల నర్సవ్వ, రేసు రఘు, జంగ భూమరాజం, దిలీప్, బొదాసు రాజు గాయపడ్డారు. వీరిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడ్డ నర్సయ్య, లస్మవ్వ, జవహర్‌లను సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు.



సర్వం సాంకేతికమయం

- పోలింగ్ కేంద్రాల్లో ఇన్‌సైడ్, ఔట్‌సైడ్ వెబ్‌కాస్టింగ్
- జిల్లా నుంచి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఎన్నికల విభాగం వరకు వీక్షణ
- కొనసాగుతున్న ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ తనిఖీలు



పోలింగ్ కేంద్రాల తీరును గమనిస్తున్న అధికారి

కరీంనగర్ అర్బన్: సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ సర్వం సాంకేతికమయమే. అసెంబ్లీ సాధారణ ఎన్నికల క్రమంలో తొలిసారిగా అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. పోలింగ్ కేంద్రాల నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్ టీంలకు అత్యంత ఆధునిక కెమెరాలు వినియోగించగా కలెక్టరేట్ ప్రధాన విభాగంతో పాటు జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి నిరంతరం వీక్షిస్తుండగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఎన్నికల విభాగం వీక్షించేలా అనుసంధానించారు. అసెంబ్లీ ఎన్నికల చరిత్రలో ఇదే తొలిసారి కాగా ప్రత్యేక సాంకేతిక సిబ్బందిని వినియోగించారు. గురువారం జరిగిన పోలింగ్‌పై జిల్లాస్థాయి అధికారులు పర్యవేక్షణ చేయగా ఎప్పటికప్పుడు పోలీస్, ఎన్నికల అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లాలో 1,338 పోలింగ్ కేంద్రాలకు గానూ 899 కేంద్రాల్లో ఇన్‌సైడ్ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయగా మిగతా పోలింగ్ కేంద్రాల్లో ఔట్‌సైడ్ వెబ్ కాస్టింగ్ నిర్వహించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో గొడవలు, ఎక్కువగా మంది గుమికూడటం, దివ్యాంగులు, వృద్ధుల కోసం ఏర్పాట్లు, ఈవీఎం యంత్రాల పనితీరును పరిశీలిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి వి.శ్రీధర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం ఎం.రజనీకాంత్, ఎన్‌ఐసీ ఏడీఎం శ్రీరామ్ శ్రీనివాస్‌రెడ్డిలు ఎప్పటికప్పుడు పరిశీలించగా ఆయా విభాగాలను అప్రమత్తం చేశారు.

కొనసాగుతున్న తనిఖీలు

ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, స్టాటిక్ సర్వైలెన్ టీంల తనిఖీలు గురువారం కూడ కొనసాగాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు బిగించిన సీసీ కెమెరాల ద్వారా సదరు వాహనాలు ఎటెటు వెళుతున్నాయి, ఎంత సమయంలో ఫిర్యాదును పరిష్కరించాయి వంటి అంశాలను పరిశీలించగా జిల్లాలో ఏర్పాటు చేసిన ఎస్‌ఎస్‌టీ టీంలు(చెక్‌పోస్టులు)ల్లో వారి పనితీరును నిశితంగా గమనించారు.

వ్యక్తి బలవన్మరణం

గంగాధర(చొప్పదండి): మండలంలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన కూన లచ్చయ్య(58) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ అభిలాష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. లచ్చయ్యకు భార్య లక్ష్మీనర్సమ్మ, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోసించాడు. ఇటీవల అప్పులు చేసి, కూతుళ్లకు వివాహాలు చేశాడు. వాటిని ఎలా తీర్చాలంటూ నిత్యం బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం కుటుంబసభ్యులు లేచి చూసేసరికి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హోం ఓటు వేసిన వృద్ధుడి మృతి

రాయికల్(జగిత్యాల): మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన బొల్లె బక్కయ్య(85) నవంబర్ 25వ తేదీన హోం ఓటింగ్‌లో పాల్గొన్నాడు. ఈక్రమంలో అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. ఓటింగ్ పాల్గొన్న బక్కయ్య తన ఓటును లెక్కించేలోపే మృతిచెందాడు.



బక్కయ్య (ఫైల్)

చిగురుమామిడి జెడ్పీటీసీపై ఫిర్యాదు

- పోలింగ్ కేంద్రంలో ప్రచారం చేశాడన్న హుస్నాబాద్ ఎమ్మెల్యే
- అదుపులోకి తీసుకున్న పోలీసులు



పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

చిగురుమామిడి: హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ చిగురుమామిడి జెడ్పీటీసీ గీకురు రవీందర్‌పై సీపీ అభిషేక్ మహంతికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. సీపీ ఆదేశాలతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకొని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలిలా ఉన్నాయి.. చిగురుమామిడి ప్రభుత్వ పాఠశాలలో నాలుగు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. గురువారం ఓటింగ్ ప్రారంభమవగా 131వ బూత్‌లో చీకటిగా ఉండటం వల్ల వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల గుర్తులు కనిపించలేదు. పోలింగ్ సిబ్బంది కూడా వారికి సహకరించడం లేదని పలువురు బయటకు వచ్చారు. దీంతో జెడ్పీటీసీ రవీందర్ సంబంధిత బూత్‌లోకి వెళ్లి, ఓటువేసే గదిలో లైటింగ్ ఏర్పాటు చేయాలని చెప్పేందుకు ప్రయత్నించారు. అలాగే, చేతి గుర్తుకు ఓటు వేయాలని ఆయన ప్రచారం చేస్తున్నాడని బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌కు తెలియజేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఆయన కరీంనగర్ సీపీకి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన సీపీ అక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐకి ఫోన్ చేసి, తక్షణమే రవీందర్‌ను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. ఆ తర్వాత సీఐ తన సిబ్బందితో ఆయనను ఠాణాకు తరలించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు రవీందర్ పోలీసు కస్టడీలో ఉన్నారు.

కావాలనే ఫిర్యాదు చేశారు : జెడ్పీటీసీ రవీందర్

పోలింగ్ కేంద్రంలో నేను ఎలాంటి ప్రచారం చేయలేదు. 131వ బూత్‌లో చీకటిగా ఉందన్న సమాచారంతో పోలింగ్ అధికారికి విషయాన్ని చెప్పేందుకు వెళ్లాను. అంతేగానీ ఎన్నికల నిబంధనలు అతిక్రమించలేదు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కావాలనే నాపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం చిగురుమామిడి మండలంలోని రేకొండ పరిధి పెద్దమ్మపల్లెలో ఆయన ఓటు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలను ఓటర్లు చమరగీతం పాడబోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో సీపీఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థులందరూ గెలవబోతున్నారని పేర్కొన్నారు. హుస్నాబాద్ నుంచి మాజీ ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఏ గ్రామంలో చూసినా ఎక్కువ మంది ఓటర్లుచేతి గుర్తుకు మొగ్గు చూపారన్నారు. సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చాడ శ్రీధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఓటువేసి.. వరి కోయించేందుకు వెళ్లి

- గుండెపోటుతో రైతు మృతి
- ముత్తారంలో ఘటన



రాజయ్య మృతదేహం

ముత్తారం(మంథని): ఓటువేసి.. వరి కోయించేందుకు పొలం వద్దకు వెళ్లిన ఓ రైతు గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ముత్తారానికి చెందిన రాపెల్లి రాజయ్య(65) గురువారం ఉదయం ఓటుహక్కు వినియోగించుకున్నాడు. తర్వాత తనకున్న ఎకరం భూమిలో వరి కోయించేందుకు వెళ్లాడు. పొలం దిగబడుతుండటంతో కోత మెషీన్ వచ్చేలోపు కొంతవరకు కోశాడు. దాన్ని కుప్ప చేస్తుండగా ఒక్కసారి చాతిలో నొప్పి, రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. అటుగా వెళ్లిన ఓ రైతు రాజయ్యను చూసి, లేపే ప్రయత్నం చేశాడు. లేవకపోవడంతో అతను చనిపోయాడన్న సమాచారాన్ని కుటుంబసభ్యులకు చేరవేశాడు. ఓటు వేసి, పొలంకాడికి పోయి, తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయావా అంటూ మృతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అతనికి భార్య కనకలక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు.

బీఆర్‌ఎస్ గెలుస్తుందని సంబరాలు



సిరిసిల్లలో వేడుకల్లో పాల్గొన్న చీటి నర్సింగరావు, బీఆర్‌ఎస్ నాయకులు

సిరిసిల్లటౌన్/సిరిసిల్లక్రైం: సిరిసిల్లలో బీఆర్‌ఎస్ మళ్లీ గెలువబోతుందని ఆ పార్టీ నాయకులు గురువారం సంబరాలు జరిపారు. రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ యూత్ విభాగం నేతృత్వంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో టపాసులు పేల్చి, నినాదాలు చేశారు. ఓటింగ్ సరళితో మంత్రి కేటీఆర్ మళ్లీ గెలుస్తున్నారని, సిరిసిల్ల మరింత అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ యూత్ విభాగం అధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్, షేక్ సికింధర్, సామల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఫలితాలు వెలువడకముందే ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ సంబరాలు నిర్వహించడం ఏందని స్థానికంగా విమర్శలు రావడం గమనార్హం.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



బాలుడి మృతదేహం

మానకొండూర్: మండలంలోని గంగిపల్లికి చెందిన గాడిచర్ల అజయ్‌కుమార్(14) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అజయ్‌కుమార్ తన తాత లింగయ్యతో కలిసి గురువారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. విద్యుత్ మోటార్‌కు ఉన్న నల్లా వాల్వ్‌ను ఆఫ్ చేయడానికి ప్రయత్నించగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగి లి, అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల బైపాస్‌లో గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో శాంతినగర్‌కు చెందిన సత్తయ్య(40) మృతిచెందాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాలు. సత్తయ్య బైపాస్ రోడ్డు నుంచి శాంతినగర్‌కు వెళ్లడానికి బైపాస్ మీదుగా కాలినడకన వస్తున్నాడు. అదే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రున్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో బంధువులు కరీంనగర్ తరలించేందుకు ప్రయత్నించగా దారి మధ్యలోనే సత్తయ్య మృతి చెందాడు.



సత్తయ్య మృతదేహం

గెలుపోటములపై జోరుగా బెట్టింగ్

- బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో జోరుగా చర్చ
- రెండు నియోజకవర్గాల్లో టెన్షన్

సిరిసిల్లక్రైం: జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో ఇన్నాళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులకు, ప్రజల నుంచి అత్యంత స్పందన అచిర కాలంలో గట్టి పోటీనిచ్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపోటములపై కార్యకర్తలు, అభిమానులు జోరుగా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్‌ను భారత్ పాకిస్తాన్ క్రికెట్ పోటీని వీక్షించిన విధానంలో ఓట్ల లెక్కింపును చూసే అవకాశాలున్నాయని సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే లక్షల రూపాయల్లో బెట్టింగ్‌కు ఆజ్యం పలికిన నాయకులు ఉన్నారని, ఇలా బెట్టింగ్ చేసిన వారందరూ ఓట్ల లెక్కింపు జరిగే ఆదివారం ఒకే వేదికగా ఉండి పండుగ చేసుకునేందుకు ప్రణాళికలు జరుగుతున్నాయి. సిరిసిల్ల నియోజకవర్గంలో అభివృద్ధిని ప్రచారం చేసిన కేటీఆర్‌కు విజయం కాస్త అటు.. ఇటుగా ఉంటుందనుకుంటున్న వాళ్లు లేకపోలేదు. కానీ వేములవాడలోని త్రిముఖ పోరులు అందరూ ఉద్దండులేనని ఇక్కడి ఫలితాలపై నియోజకవర్గప్రజలు అత్యంత ఆసక్తిగా ఉన్నారని సమాచారం. ఏదిఏమైనా గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో నేతలు హోరాహోరీగా ప్రచారాలు, పార్టీల బడా నేతలు రావడం వంటి వాటితో గెలుపు ఆయా పార్టీ బాధ్యులు ఆసక్తిగా ఎదురుచూస్తూ బెట్టింగ్‌లకు దిగుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇలాంటి విధానాలను పోలీసు అధికారులు ఎలా నియంత్రిస్తారో వేచిచూడాల్సిందే.

ప్రశాంతంగా పోలింగ్

తెలంగాణ అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో భాగంగా గురువారం కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎక్కడ చూసినా ఉదయం నుంచే బారులు తీరడం కనిపించింది. సిబ్బంది, కుటుంబ సభ్యులు వృద్ధులు, వికలాంగులను వీల్‌చైర్లలో తీసుకొచ్చి ఓటేయించడం కనిపించింది. పోలీసులు, అధికారుల పర్యవేక్షణలో పోలింగ్ సజావుగా జరిగింది.


సీతారాంపూర్‌లో వరుసలో ఓటర్లు

కొత్తపల్లి మండలంలో..


బావుపేటలో ఓటేసిన ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు


కుటుంబ సభ్యులతో కలిసి ఓటేసిన మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు


కొత్తపల్లిలో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

కొత్తపల్లి: రేకుర్తి, కొత్తపల్లి పట్టణాల్లో జరిగిన స్వల్ప ఘర్షణలు మినహా మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌లను కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి పురుమళ్ల శ్రీనివాస్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి అంబటి జోజిరెడ్డి తదితర అభ్యర్థులు పర్యటిస్తూ పోలింగ్ సరళిని పరిశీలించారు. రేకుర్తిలో ముస్లిం జేఏసీ చైర్మన్ షేక్ అబూబాకర్ ఖలీద్ కారుపై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేయగా.. అద్దం పగిలింది. ఈ విషయమై కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాలపై కేసు నమోదైంది. ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసేందుకు ఖలీద్ వచ్చాడని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు కేసు పెట్టగా.. తనపై దాడి చేశారని ఖలీద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపల్లి పట్టణంలో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెల్లాచెదురు చేశారు. కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు కుటుంబ సభ్యులతో కలిసి ఓటేశారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు బావుపేటలో ఓటు వేశారు.


చింతకుంటలో ఓటేయాలని కోరుతున్న కార్యకర్తలు




ఓటేసిన ఎంఐఎం నేత అహ్మద్ హుస్సేన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్‌కుమార్, కుటుంబ సభ్యులు

ఓటేసిన ప్రముఖులు


తన వేలికున్న సిరా చుక్క చూపిస్తున్న జోజిరెడ్డి

కరీంనగర్: శాసనసభ ఎన్నికల సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రధాన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి పమేలా సత్పతి 146 పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ తన కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్టియన్ కాలనీలోని శ్రేయ వొకేషనల్ జూనియర్ కళాశాలలో బూత్ నెంబర్ 179లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి జ్యోతినగర్‌లోని సాధన పాఠశాలలో ఓటేశారు. కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి పురమల్ల శ్రీనివాస్–లలిత బొమ్మకల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బాలికల ఉర్దూ మీడియా పాఠశాలలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ ఆయన సతీమణి మాధవి, స్థానిక కార్పొరేటర్ వాల రమణారావు ఓటు వేశారు. సీపీఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి తన స్వగ్రామమైన చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. భగత్‌నగర్ వివేకానంద విద్యానికేతన్ పాఠశాలలో నగర మేయర్ దంపతులు యాదగిరి సునీల్‌రావు–అపర్ణ ఓటు వేశారు. కొత్తపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి అంబటి జోజిరెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. 18వ డివిజన్ రేకుర్తిలోని బూత్ నంబర్ 36లో తన కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ ఓటేశారు. భారత్ టాకీస్ ప్రాంతంలోని నారాయణ పాఠశాలలో 138వ బూత్ నెంబర్‌లో ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సతీసమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.


జిల్లా కేంద్రంలోని కార్ఖానగడ్డ హైస్కూల్‌లో ఓటింగ్ సరళి పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్


ఓటేసిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి


ఉర్దూ మీడియం బాలికల పాఠశాలలో సమయం ముగియడంతో గేటు వేస్తున్న పోలీసులు


ఉర్దూ మీడియం బాలికల పాఠశాలలో ఈవీఎంలకు సీల్ వేస్తున్న సిబ్బంది


ఓటేసేందుకు వస్తున్న వృద్ధులు


సెల్ఫీ దిగుతున్న మొదటిసారి ఓటేసిన యువత


కాలికి గాయమైనా ఓటు హక్కు వినియోగించుకున్న యువతి


సప్తగిరికాలనీ(కరీంనగర్): ఓటేసిన డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి


సప్తగిరికాలనీ(కరీంనగర్): ఎన్నికల విధుల్లో నిమగ్నమై టిఫిన్ చేస్తున్న పోలీస్ సిబ్బంది


సప్తగిరికాలనీ(కరీంనగర్): వృద్ధుడికి సహాయపడుతున్న మహిళా పోలీస్



చెర్లభూత్కూర్‌లో ఓటర్ల వరుస

కరీంనగర్ మండలంలో..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పోలీస్ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం ఓటర్లు 53,802 కాగా.. పురుషులు 26,619, మహిళలు 27,181, థర్డ్‌జెండర్ 2 ఉన్నారు. మొత్తం 65 పోలింగ్ కేంద్రాలు. వృద్ధులు, వికలాంగులను ఇంటి నుంచి కేంద్రాలకు తరలించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేకంగా వాహన సౌకర్యం కల్పించింది. లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రం చిన్నగా ఉండటంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ చెర్లభూత్కూర్, జూబ్లీనగర్, చామనపల్లి గ్రామాల్లోని కేంద్రాలను సందర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్, ఆయన సతీమణి జెడ్పీటీసీ సభ్యురాలు పురుమల్ల లలితతో కలిసి బొమ్మకల్‌లోని పోలింగ్ కేంద్రం 114లో ఓటేశారు. బొమ్మకల్ మాజీ సర్పంచ్, శతాధిక వృద్ధుడైన వెంగల్‌దాసు నారాయణ ఓటేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య చామనపల్లిలో ఓటేశారు. చిన్న గ్రామాలైన ఫకీర్‌పేట, జూబ్లీనగర్, నల్లగుంటపల్లి, మందులపల్లి, తాహెర్‌కొండాపూర్, దుబ్బపల్లిలో మధ్యాహ్నం 12గంటల వరకే 90శాతం పోలింగ్ ముగిసింది. దుర్శేడ్‌లోని పోలింగ్ కేంద్రం 103లో ఓటర్లు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో సాయంత్రం 5గంటలకు ముగించాల్సిన పోలింగ్‌ను రాత్రి 7గంటల వరకు కొనసాగించారు. దుర్శేడ్ కేంద్రాన్ని సీపీ అభిషేక్ మహంతి సందర్శించి ఓటింగ్ తీరును పరిశీలించారు.


చామనపల్లిలో ఓటేసిన ఎంపీపీ లక్ష్మయ్య


బొమ్మకల్‌లో ఓటేసిన శతాధిక వృద్ధుడు నారాయణ


లక్ష్మీనగర్‌లో ఎండలో నిల్చున్న ఓటర్లు


చెర్లభూత్కూర్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్



ఫకీర్‌పేటలోని ఓటరు సహాయ కేంద్రం


దుర్శేడ్‌లో సాయంత్రం 5గంటల అనంతరం ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు



ఫకీర్‌పేట ఆదర్శ కేంద్రంలో ఓటేశామంటున్న యువ ఓటర్లు

ఓటెత్తిన యువత


తొలి ఓటును వినియోగించుకున్న యువతులు

- తొలిసారి వినియోగించుకున్న యువతీయువకులు
- ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాల్లోకి..

సప్తగిరికాలనీ(కరీంనగర్): భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు.. వజ్రాయుధం లాంటిది ఓటు.. నవ సమాజ నిర్మాణానికి పునాది ఓటు.. ఇలా ఓటు అనే అస్త్రం ఎలా ఉంటదో చాలా సంవత్సరాలు విన్నం.. ఒక్కసారైన ఓటును వినియోగించాలి.. ఆ ఛాన్స్ ఎప్పుడు వస్తుందా అంటూ ఎదురుచూశాం.. ఆరోజు రానే వచ్చింది.. కొండంత ఆనందంతో.. రెట్టింపు ఉత్సాహంతో వెళ్లి తొలి ఓటును సగౌరవంగా వేశామంటున్నారు తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్న యువతీయువకులు. సమాజంలో మార్పును తీసుకొచ్చి జాతి భవిష్యత్‌ను మార్చగల సత్తా యువతకే ఉందని ప్రతి ఒక్కరూ అంటున్నారు. అది నేటి ఓటుతో మేం చేసి చూపించామంటున్నారు. ఇకనుంచి ఏ ఎన్నికలు వచ్చినా మేం ఓటేస్తామని.. ఎన్నికల సమయంలో ఎక్కడున్నా వచ్చి ఓటు హక్కును వినియోగించుకుంటామంటున్నారు. గురువారం అసెంబ్లీ ఎన్నికలు జరిగిన నేపథ్యంలో పెద్ద సంఖ్యలో కొత్త ఓటర్లతో పాటు యువత ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా తొలిసారి ఓటేసిన యువత అభిప్రాయాలు వారి మాటల్లోనే.

సంతోషంగా ఉంది



చాలా సంతోషంగా ఉంది. మేం ఇద్దరం అక్కాచెల్లెలం. మా ఇద్దరికి ఈ ఎన్నికలే తొలి ఓటు. ఇద్దరం కలిసే ఓటేసేందుకు వచ్చాం. లైఫ్‌లో చెదిరిపోని జ్ఞాపకంగా ఉంటుంది. చాలామంది యువత కూడా వచ్చారు. కొత్త ఓటర్లు రెట్టింపు ఉత్సాహంతో ఓటేశారు.

- అభినయ(బీటెక్), వినయ, రెడియాలజిస్ట్

మంచివారికే వేశా



లైఫ్‌లో ఫస్ట్ ఓటు మంచివారికి వేశాను. ఎవరైతే ప్రజలకు మంచి పాలన అందించగలుగుతారో వారిని ఎంపిక చేసుకొని వారికే నా తొలి ఓటు వేశాను. నేను నా ఓటు సక్రమంగా వినియోగించుకున్నానని అనుకుంటున్నాను. చాలా ఆనందంగా ఉంది.

- ఆకాంక్ష(బీటెక్)

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూశా



ఫస్ట్ ఓటు ఎప్పుడెప్పుడు వేస్తానా అని ఎదురుచూసిన క్షణాలు రానే వచ్చాయి. ఉదయాన్నే పేరెంట్స్, అక్కతో కలిసి ఓటేసేందుకు సెంటర్‌కు వెళ్లాను. తొలి ఓటు కంగారు అనిపించినా నిక్కచ్చిగా వేశాను. సో హ్యాపీ. చాలామంది బారులు తీరారు. నా ఓటు ఒక మంచి వ్యక్తిత్వానికి వేశానని అనుకుంటున్నాను.

- ఠాకూర్ వరాలి సింగ్(బీటెక్)

నిజాయితీపరులకే నా ఓటు



నిస్వార్థ, నిజాయితీపరులకు నా తొలి ఓటును వినియోగించాను. ఎవరైతే సమాజంలో ప్రజలందరికి సంక్షేమ ఫలాలు దక్కేలా కృషి చేస్తారనిపించిన వ్యక్తికి నేను ఓటేశాను. ఎంతో ఆత్రుతతో ఎదురుచూశా. చాలా హ్యాపీగా ఉంది. ఇకనుంచి ప్రతి ఎన్నికల్లో ఓటేస్తా.

- సుదేశ్న పండిట్(బీటెక్)

సక్రమంగా వినియోగించుకున్నా



నేను నా తొలి ఓటును సక్రమంగా వినియోగించుకున్నాను. మా అక్కయ్య కూడా ఫస్ట్ టైమ్ ఓటేసింది. నా సెంటర్ వేరు.. అక్కయ్య సెంటర్ వేరు. ఇద్దరం కలిసి ఫస్ట్ టైమ్ ఓటు వేయడం మరిచిపోలేని రోజు. ఈ ఎన్నికలు మాకు లైఫ్‌లో గుర్తుండిపోతాయి. చాలామంది కొత్త ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం మంచి పరిణామం.

- మేఘన(బీటెక్)

హైదరాబాద్ నుంచి వచ్చా



ఫస్ట్ టైమ్ నాకు ఓటు హక్కు వచ్చింది. ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చా. బీటెక్ చదువుతున్నా. చాలా సంతోషంగా ఉంది. మా ఫ్రెండ్స్ అందరు ఓటేసేందుకు సొంత ఊళ్లకు వెళ్లారు. మంచి నాయకునికి నా తొలి ఓటు వేశాను.

- డి.యక్షశ్రీ(బీటెక్)

ఎవరు ఎన్ని చెప్పినా..



మేం ఇంజినీరింగ్, డిగ్రీ చదువుతున్నాం. ఇద్దరికి ఈ ఎన్నికల్లో ఓటు వేసే అర్హత వచ్చింది. చాలా హ్యాపీగా ఉంది. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. ఎప్పుడెప్పుడు ఓటేద్దామా అని ఎదురుచూశాం. సెంటర్‌కు వెళ్లే దారిలో అందరు ఇటేయండి.. అటేయండి అని చెబుతున్నారు. కానీ మేం వేసిన తొలి ఓటు పని చేసేవారికే దక్కింది.

- షైబాజ్(బీటెక్), ముదస్సిర్(డిగ్రీ)

ఓటు వజ్రాయుధం



రాజ్యాంగం ప్రజలకు కల్పించిన గొప్ప హక్కు ఓటు. వజ్రాయుధం లాంటి ఓటును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ప్రతి ఎన్నికల్లో చెబుతారు. నేను కూడా ఎప్పుడు ఉపయోగిస్తానా అని ఎదురుచూశాను. ఇప్పుడు వజ్రాయుధాన్ని ఉపయోగించాను. కొత్తగా అనిపించింది.

- సాకేత్(బీటెక్)

ఓటేసిన జాతీయ యువజన అవార్డు గ్రహీత దంపతులు



విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని రాంనగర్ వేదం పాఠశాల పోలింగ్ బూత్‌లో జాతీయ యువజన అవార్డు గ్రహీత కిరణ్‌కుమార్ దంపతులు గురువారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కొత్తకొత్తగా..



కరీంనగర్: ఎన్నికల్లో ఓటేసేందుకు ఓటు నమోదు చేసుకున్న యువత మొదటిసారిగా ఓటేసేందుకు ఆసక్తి కనబరిచారు. పోలింగ్ కేంద్రాల వద్ద యువతీయువకులు హుషారుగా ఓటు గుర్తింపు కార్డులను చూపిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద యువత ఓటు హక్కును వినియోగించుకున్నారు.



కాంగ్రెస్ సంబరాలు



కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్, సిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. అన్ని ఎగ్జిట్ పోల్స్ ఇవే చెబుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రానుందని గురువారం రాత్రి నగరంలోని తెలంగాణ చౌక్‌లో బాణసంచా కాలుస్తూ పార్టీ సంబరాలు నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల ఆదరణతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, గ్యారంటీలు అమలు చేస్తుందని తెలిపారు. కరీంనగర్‌లో ఓటేసిన ప్రతీఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. డిసెంబర్ 9న సోనియాగాంధీ పుట్టినరోజు కానుకగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమద్ నవాబ్, రహ్మత్ హుస్సేన్, ఎస్.కె.సి రాజ్ హుస్సేన్, కల్వల రామచందర్, కొరివి అరుణ్‌కుమార్, ఎస్.ఎ.మోసిన్, ముక్క భాస్కర్, ఖమ్రొద్దీన్ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని ఎస్‌ఆర్‌నగర్‌లో కుటుంబ సభ్యులతో కలసి ఓటు హక్కు వినియోగించుకున్న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్




ప్రశాసన్‌నగర్‌లోని సెరికల్చర్ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న సీఎస్ శాంతికుమారి


అంబర్‌పేట మున్సిపల్ స్టేడియంలో ఓటు హక్కు వినియోగించుకున్న డీజీపీ అంజనీకుమార్ దంపతులు


గచ్చిబౌలి పరిధిలోని వివేకానందనగర్ రిక్షాపుల్లర్స్‌కాలనీలో ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో వస్తున్న 112 ఏళ్ల వృద్ధురాలు ఆశమ్మ


గచ్చిబౌలిలో పోలింగ్ కేంద్రానికి ఆక్సిజన్ సిలిండర్‌తో వచ్చి ఓటేసిన 75 ఏళ్ల శేషయ్య


మౌలాలిలో దివ్యాంగునికి కాలిపై సిరా గుర్తు వేస్తున్న పోలింగ్ సిబ్బంది



స్వదస్తూరీతో సందేశం

నగరంలో గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో తనకు సహకరించిన పోలీసులకు సీపీ సందీప్ శాండిల్య స్వదస్తూరీతో కృతజ్ఞతలు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన రాసిన సందేశం ఉన్న పేజీని నగర పోలీసు అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. దీన్ని అనేక మంది అధికారులు తమ స్టేటస్‌లుగా పెట్టుకున్నారు.

- సాక్షి, హైదరాబాద్

హస్తం గాలి 'వీచినట్టేనా'!

▶ మొదటి పేజీ తరువాయి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఊహించని విజయం దక్కుతుందని, మిగిలిన జిల్లాల్లో కూడా ఓ మోస్తరు నుంచి అధిక శాతం సీట్లలో గెలుపు తమదేనని వారు లెక్కలు వేస్తున్నారు. సింగరేణి ప్రాంత ఓటర్లు కూడా తమవైపే నిలిచారని, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి ప్రాంతంలోని నియోజకవర్గాల్లో ఎక్కువ స్థానాలు తమ ఖాతాలోనే పడతాయని చెబుతున్నారు. ఇక, హైదరాబాద్ శివార్లలో కూడా తమకు భారీగా పోలింగ్ జరిగిందని అంచనా వేస్తున్నారు. మెజార్టీ ఎగ్జిట్‌పోల్స్ కూడా తమదే అధికారం అని చెపుతున్న నేపథ్యంలో ఈనెల 3న ఫలితాల కోసం కాంగ్రెస్ పార్టీ నేతలు ఆత్రుతతో ఎదురుచూస్తుండడం గమనార్హం.

పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ..

గురువారం ఉదయం పోలింగ్ ప్రారంభమైన సమయం నుంచి కాంగ్రెస్ ముఖ్య నేతలంతా పోలింగ్ సరళిని నిశితంగా పరిశీలించారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్‌ఠాక్రే, ఏఐసీసీ పరిశీలకురాలు దీపాదాస్‌మున్షీ, టీపీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్ గాంధీభవన్‌లోని వార్‌రూంలో కూర్చుని పరిస్థితిని సమీక్షించారు. నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతాన్ని పరిశీలిస్తూ, క్షేత్రస్థాయిలోని నాయకత్వానికి అవసరమైన సూచనలు చేస్తూ వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఓటర్ల నాడి అనుకూలంగానే ఉన్నా పోల్ మేనేజ్‌మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ వెనుకబడిందనే వార్తలు వస్తున్న నేపథ్యంలో తమ ఓట్లన్నీ కచ్చితంగా పోలయ్యేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వార్ రూం కోఆర్డినేటర్ విజయభాస్కర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్‌యాదవ్ వార్‌రూం సిబ్బందితో కలిసి ఎప్పటికప్పుడు అభ్యర్థులు, స్థానిక పార్టీ నేతలతో మాట్లాడుతూ పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టి పనిచేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కొడంగల్, కామారెడ్డి నియోజకవర్గాల్లో పర్యటిస్తూనే ఎప్పటికప్పుడు వార్‌రూంతో టచ్‌లో ఉంటూ పోలింగ్ సరళిపై ఆరా తీశారు. సీఎల్పీ నేత భట్టితో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలు కూడా తాము పోటీ చేస్తున్న నియోజకవర్గాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పోలింగ్ తీరును పరిశీలించారు. ఈ ఎన్నికల్లో వ్యూహకర్తగా కీలకపాత్ర పోషించిన సునీల్ కనుగోలు ఆయన బృందం కూడా పోలింగ్ సరళిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్ని స్థానాల్లో సానుకూలత ఉందన్న లెక్కలు కట్టింది.


వార్ రూం నుంచి పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఠాక్రే, మున్షీ, కుసుమ కుమార్ తదితరులు

ఆ నాలుగు.. మావే

జిల్లాల వారీగా విశ్లేషిస్తే పోలింగ్ తీరును బట్టి నాలుగు జిల్లాల్లో చెప్పుకోదగిన స్థానాలు సాధిస్తామనే అభిప్రాయం కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతోంది. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్‌తో పాటు వరంగల్ జిల్లాల్లో ఉన్న 46 స్థానాల్లోనే 35 తమకు ఖాయమని లెక్కలు వేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో కూడా బీఆర్‌ఎస్ కంటే ఎక్కువ సీట్లు వస్తాయని, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో కొంచెం అటూ ఇటుగా ఫలితాలు వస్తాయని చెబుతున్నారు. హైదరాబాద్ పరిధిలోనికి వచ్చే స్థానాల్లో కూడా 4–5 చోట్ల గెలుపునకు అవకాశాలున్నాయని, ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కలిపి 10 స్థానాల వరకు చేరుకుంటామని అంటున్నారు. అన్ని జిల్లాల్లో కలిపి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ కంటే ఓ 10 సీట్లు ఎక్కువే వస్తాయన్న నమ్మకాన్ని కాంగ్రెస్ నేతలు వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ సునామీ సృష్టించింది!

- రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది! .. ఈ రాత్రి నుంచే సంబరాలు
- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- బీఆర్‌ఎస్‌కు 25 సీట్లకు మించి రావు
- కామారెడ్డిలో కేసీఆర్‌ను ఓడిస్తున్నందుకు సంతోషంగా ఉంది

సాక్షి, కామారెడ్డి: 'తెలంగాణలో కాంగ్రెస్ సునామీ సృష్టించింది. బీఆర్‌ఎస్‌కు 25కు మించి సీట్లు రానేరావు. గెలిచే అవకాశమే ఉంటే సీఎం మీడియా ముందుకు వచ్చి గొప్పలు చెప్పేవారు. కానీ కేటీఆర్ వచ్చి అదే బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నాడు. అయితే తెలంగాణ సమాజం చైతన్యవంతమైనదని మరోసారి రుజువైంది. పదేళ్లుగా తెలంగాణను పట్టి పీడిస్తున్న కేసీఆర్‌ను కామారెడ్డిలో ఓడిస్తున్నందుకు సంతోషంగా ఉంది..' అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం గురువారం సాయంత్రం కామారెడ్డిలో మాజీమంత్రి షబ్బీర్ అలీ నివాసంలో ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

శ్రీకాంతాచారి త్యాగానికి, ఎన్నికలకు సంబంధం

'మలి తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారి త్యాగానికి, ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలకు సంబంధం ఉంది. 2009 నవంబర్ 29న ఎల్బీనగర్ చౌరస్తాలో శ్రీకాంతాచారి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఉద్యమాన్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకుపోయాడు. మృత్యువుతో పోరాడి డిసెంబర్ 3న తనువు చాలించాడు. ఇప్పుడు నవంబర్ 29న ఎన్నికల ప్రక్రియ మొదలై, డిసెంబర్ 3న ఫలితాలు వెలువడనున్నాయి. అప్పుడు డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు సోనియాగాంధీ ఆదేశాలతో నాటి హోంమంత్రి చిదంబరం ప్రకటన చేశారు. ఇప్పుడు డిసెంబర్ 9న తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపడుతుంది. ఈ విధంగా యాదృచ్ఛికమో, దేవుని ఆదేశమో తెలియదు కానీ, శ్రీకాంతాచారి త్యాగానికి, ఇప్పటి ప్రజాతీర్పుకు సంబంధం ఉన్నట్టు అర్థమైంది. శ్రీకాంతాచారికి ఘనంగా నివాళులు అర్పిస్తున్నాం..' అని రేవంత్ అన్నారు.

ఎగ్జిట్ పోల్స్ నిజమైతే క్షమాపణ చెబుతారా?

'ఓటమి ఎదురవుతుందన్నపుడల్లా నియోజకవర్గం మారడం కేసీఆర్‌కు అలవాటు. అయితే చైతన్యవంతులైన కామారెడ్డి నియోజకవర్గ ప్రజలు కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పారు. ప్రజల్లో చైతన్యం వచ్చింది. అధికారం శాశ్వతమనే కేసీఆర్ నమ్మకం వమ్మయ్యింది. ఎగ్జిట్‌పోల్స్ అన్నీ కాంగ్రెస్‌కు మెజారిటీని కట్టబెడుతున్నాయి. కానీ ఎగ్జిట్ పోల్స్ రబ్బిష్ అని కేటీఆర్ అన్నారు. మరి అవే నిజమైతే క్షమాపణలు చెబుతారా? ఎగ్జిట్ పోల్స్ మీద కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదు? రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ రోజు రాత్రి నుంచే కార్యకర్తలు సంబరాలు చేసుకోవాలి..' అని టీపీసీసీ చీఫ్ అన్నారు.



కొడంగల్‌లో ఓటేసిన రేవంత్‌రెడ్డి

కొడంగల్: పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి గురువారం కొడంగల్‌లో ఓటు వేశారు. కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకున్న ఆయన ఓటుహక్కును వినియోగించుకున్నారు.

వెంటనే ఆరు గ్యారంటీల అమలు

'కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన మరుక్షణమే ఆరు గ్యారంటీల అమలుకు తొలి మంత్రివర్గంలో తీర్మానం చేస్తాం. ప్రొఫెసర్ కోదండరాంకు అమరుల కుటుంబాలు, ఉద్యమకారుల సంక్షేమానికి సబంధించిన బాధ్యతలు అప్పగిస్తాం. మేము పాలకులుగా ఉండబోము.. సేవకులుగా ఉంటాం. వెంటనే ప్రజాస్వామిక విలువల్ని పునరుద్ధరిస్తాం. అన్ని వర్గాలకు స్వేచ్ఛ ఉంటుంది. ఎక్కడా అజమాయిషీ చెలాయించబోము. ఎవరినీ ఇబ్బందులకు గురిచేయడం జరగదు. తెలంగాణ ప్రజలకు ఐదేళ్లు సేవ చేయడానికి ప్రయత్నం జరుగుతుంది..' అని రేవంత్ చెప్పారు.

పదవి పార్టీ నిర్ణయిస్తుంది

తాను ఏ పదవిలో ఉండాలన్నది పార్టీ నిర్ణయిస్తుందని రేవంత్‌రెడ్డి అన్నారు. రెండుచోట్లా గెలిస్తే ఏ నియోజక వర్గంలో ఉంటారని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు.. తనకు ఇవి రెండే కాదని, ఎంపీ పదవి కూడా ఉందని, ఇందులో దేనిలో కొనసాగాలన్న దానిపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందని, దాన్ని ఆచరిస్తానని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, మాజీ ఎమ్మెల్సీ ఆరికెల నర్సారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మానాల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ డ్యాం వద్ద ఉద్రిక్తత

గేట్లెత్తి కుడికాల్వకు నీటిని విడుదల చేసిన ఏపీ అధికారులు

డ్యాంపై పెద్ద సంఖ్యలో పోలీసుల మోహరింపు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద ఉద్రిక్తత నెలకొంది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఏపీ పోలీసులు డ్యాం మీదకు అనుమతించాలని డ్యాం ప్రధాన గేటు వద్ద పహారా కాస్తున్న ఎస్పీఎఫ్ (ప్రత్యేక రక్షణదళం) సిబ్బందిని అడిగారు. డ్యాం మీదకు ఎందుకు వెళ్లాలో కారణం చెప్పండని అడిగితే డ్యాంపై తమ భూ భాగంలో కంచె వేసుకుంటామని చెప్పారు. ఎస్పీఎఫ్ సిబ్బంది అడ్డుకోవడంతో ఏపీ పోలీసులు పక్కన ఉన్న లాంచీస్టేషన్‌లో నుంచి ఎర్త్‌డ్యాం మీదకు వచ్చారు. తమను తెలంగాణ ఎస్పీఎఫ్ సిబ్బంది అడ్డుకుంటున్నారని ఏపీ సాగునీటి శాఖ అధికారులు ఆ రాష్ట్ర పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో సుమారు 500 మంది ఏపీ పోలీసులు డ్యాం మీదకు వచ్చి 13వ గేటు వద్ద బారికేడ్లు, ముళ్లకంచె ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం మరో 500 మంది పోలీసులు పహారా కాస్తుండగా కుడికాల్వకు నీటిని విడుదల చేసేందుకు సాగునీటి శాఖ అధికారులు యత్నించారు. తెలంగాణ ఇరిగేషన్ అధికారులు గేట్లను ఎత్తేందుకు మోటార్లకు గల విద్యుత్ సరఫరాను తొలగించారు. అయితే, ఏపీ అధికారులు మధ్యాహ్నం 12 గంటల సమయంలో వేరేచోట నుంచి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి గేట్లను ఎత్తి కుడి కాల్వకు నీటిని విడుదల చేశారు. తాగునీటి అవసరాల కోసమే నీటిని విడుదల చేసినట్లు ఏపీ చీఫ్ ఇంజనీర్ మురళీనాథ్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ నుంచి 500 మంది పోలీసులు డ్యాం మీదకు రావడంతో ఏపీ వైపున 1,500 మంది పోలీసులు గుమిగూడారు. ఈక్రమంలో డ్యాం ఇరువైపుల నుంచి ఎవరినీ రానీయకుండా రెండు రాష్ట్రాల పోలీసులు కట్టడి చేశారు.


ప్రధాన డ్యాం 13వ గేటు వరకు బారికేడ్స్, ఇనుప తీగతో ఫెన్సింగ్

కృష్ణా బోర్డుకు తెలంగాణ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకి సంబంధించిన కొంత భాగాన్ని ఏపీ ప్రభుత్వం తమ అధీనంలోకి తీసుకుందంటూ తెలంగాణ నీటిపారుదల శాఖ కృష్ణా బోర్డు చైర్మన్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ గురువారం అత్యవసరంగా కృష్ణాబోర్డు చైర్మన్‌కు వాట్సాప్ ద్వారా లేఖ పంపించారు. తనిఖీలకు వినియోగించే వాల్క్‌వే బ్రిడ్జిని సైతం ఏపీ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారని, సాగర్ కుడి కాల్వకు 500 క్యూసెక్కుల జలాలను విడుదల చేశారని లేఖలో పేర్కొన్నారు. నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం తెలంగాణ వాటా నీళ్లు మాత్రమే నిల్వ ఉన్నాయని, వేసవిలో హైదరాబాద్ నగర తాగునీటి అవసరాల కోసం వాటిని పొదుపు చేసి ఉంచామని కృష్ణాబోర్డుకు వివరించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్వ స్థితిని పునరుద్ధరించాలని, ఏపీ పోలీసు బలగాలను అక్కడికి నుంచి వెళ్లిపోయేలా ఆదేశాలివ్వాలని కోరింది. డ్యామేజీలకు ఏపీ ఖర్చుతో మరమ్మతులు జరిపించాలని విన్నవించింది. కాగా, ఈ ఘటనపై సీఎం కేసీఆర్ నీటిపారుదల శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కేసీఆర్ సూచన మేరకు ఆమె శుక్రవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు సందర్శనకు వెళ్లనున్నట్లు తెలిసింది.

కొత్తగూడెంపై సీపీఐ ఆశ?

ఈసారి తమ ఓట్లు పెరుగుతాయంటున్న సీపీఎం

ఎక్కువ చోట్ల కాంగ్రెస్‌కు సీపీఎం మద్దతు

సాక్షి, హైదరాబాద్: ఈసారి అసెంబ్లీలో అడుగుపెడతామని కమ్యూనిస్టులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని కొత్తగూడెం నియోజకవర్గంలో పోటీ చేసిన సీపీఐ అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పోలింగ్ పూర్తయిన తర్వాత తాము ఈ అంచనాకు వచ్చామని నాయకులు తెలిపారు. కాంగ్రెస్‌తో పొత్తు తమకు ప్రయోజనం కలిగించిందని చెబుతున్నారు. తాము పోటీ చేయని ఇతర స్థానాల్లో సీపీఐ ఓట్లు అన్నీ కాంగ్రెస్‌కు బదిలీ అయినట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా, సీపీఎం మాత్రం ఒంటరిగా 19 స్థానాల్లో బరిలోకి దిగిన సంగతి తెలిసిందే. గెలుపు అవకాశాల సంగతి ఏమో కానీ ఈసారి తమకు గణనీయంగా ఓట్లు పెరుగుతాయని ఆ పార్టీ నాయకులు ఆశాభావంతో ఉన్నారు. పాలేరు, మధిర, మిర్యాలగూడెం, భద్రాచలం, ఖమ్మం వంటి స్థానాల్లో తమకు గణనీయమైన ఓట్లు వస్తాయని అంటున్నారు. తాము పోటీ చేయని స్థానాల్లో బీజేపీ బలంగా ఉన్నచోట ప్రజాతంత్ర లౌకిక పార్టీలకు మద్దతు తెలిపామని చెప్పారు. ఆ ప్రకారం ఎక్కువగా కాంగ్రెస్ అభ్యర్థులకే మద్దతు పలికామని సీపీఎం నేత ఒకరు వెల్లడించారు. బీజేపీకి ఏమాత్రం ప్రయోజనం కలగకుండా నిర్ణయం తీసుకున్నామన్నారు.

తెలంగాణ అంచనాలు కాంగ్రెస్‌వైపే!

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్‌ను బీజేపీ ఓడించనుందని టైమ్స్ నౌ, రిపబ్లిక్ టీవీ, ఏబీపీ, జన్ కీ బాత్, టుడేస్ చాణక్యతో సహా అత్యధిక ఎగ్జిట్ పోల్స్ తేల్చాయి. ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా మాత్రం బీజేపీకి 86 నుంచి 106, కాంగ్రెస్‌కు 80 నుంచి 100 సీట్లొస్తాయని అంచనా వేసింది. కాంగ్రెస్ 94 నుంచి 104 సీట్లతో అధికారం నిలుపుకుంటుందని ఇండియా టీవీ-సీఎన్‌ఎక్స్ పేర్కొంది. ఇక మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ గట్టి పోటీ ఇచ్చినా బీజేపీ అధికారం నిలబెట్టుకోనుందని పలు సర్వేలు తెలిపాయి. 230 సీట్లకు గాను దానికి బీజేపీకి 162 సీట్ల దాకా వస్తాయని ఇండియాటుడే--యాక్సిస్ మై ఇండియా పేర్కొనగా టుడేస్ చాణక్య 151, ఇండియా టీవీ-సీఎన్‌ఎక్స్ 159 దాకా రిపబ్లిక్ టీవీ 130 దాకా ఇచ్చాయి. ఏబీపీ-సీవోటర్ మాత్రం కాంగ్రెస్‌కు 113 నుంచి 137 స్థానాలొస్తాయని, బీజేపీ 88 నుంచి 112కు పరిమితమవుతుందని చెప్పింది. ఈశాన్య రాష్ట్రమైన మిజోరంలో అధికార ఎంఎన్‌ఎఫ్, జెడ్‌పీఎం హోరాహోరీగా తలపడ్డట్టు సర్వేలు స్పష్టం చేశాయి. అక్కడ హంగ్ రావచ్చని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో డిసెంబర్ 3న వెలువడనున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

అంచనాలకందని తెలంగాణ: ఎగ్జిట్ పోల్స్ ఏం చెబుతున్నా తెలంగాణలో పోలింగ్ సరళి ఎవరికీ కచ్చితంగా అంతుబట్టడం లేదు. ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా సంస్థ తెలంగాణలో పోలింగ్ తీరుతెన్నులను అంచనా వేయలేకపోయింది. రాష్ట్రంలో అధిక ధన ప్రభావం, పైగా గురువారం సాయంత్రం గడువు దాటాక కూడా ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుండడమే ఇందుకు ప్రధాన కారణమని సంస్థ అధినేత ప్రదీప్ గుప్తా స్పష్టం చేశారు. దాంతో కచ్చితమైన ఎగ్జిట్ పోల్ అంచనాలకు రాలేకపోతున్నామన్నారు. తెలంగాణలో ఎగ్జిట్ పోల్స్‌పై శుక్రవారం స్పష్టత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో గురువారం మధ్యాహ్నం ఒంటి గంట దాకా 36.68 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. సాయంత్రం ఐదింటికల్లా 63.94 శాతానికి పెరిగింది. సాయంత్రం ఐదు గంటల తర్వాత కూడా చాలా పోలింగ్ కేంద్రాల్లో పెద్ద సంఖ్యలో ఓటర్లున్నారు.

ప్రజా అనుకూల ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు

- ఎక్స్‌లో కాంగ్రెస్ నేతలు ఖర్గే, రాహుల్ పోస్టులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఎన్నికలపై పలువురు కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఎక్స్ వేదికగా స్పందించారు. ఓటు విలువతో పాటు, ఓటు వేయాల్సిన బాధ్యతను గుర్తుచేశారు. బడుగు బలహీన వర్గాలకు భద్రత కల్పించే పారదర్శకమైన, తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని తెలంగాణ ప్రజలు నిర్ణయించుకున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పేర్కొన్నారు. 'నేడు దొర లపై ప్రజలు గెలవబోతున్నారు' అంటూ రాహుల్ గాంధీ పోస్టు చేశారు.

'ఓటు వేయడం మీ హక్కు. అది అతిపెద్ద బాధ్యత. ఓటు బలంతో ప్రజల తెలంగాణ కలను సాకారం చేసి చూపాలి. జై తెలంగాణ, జై హింద్' అని ప్రియాంకాగాంధీ ట్వీట్ చేశారు. గత కొద్ది నెలల నుంచి తెలంగాణలో మార్పు దిశగా స్పష్టమైన మూడ్‌ని చూశామని జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. 'గత దశాబ్ద కాలంగా ఎన్నో వైఫల్యాలను చూశారు. కానీ.. మనమంతా కలిసి ప్రగతి, శ్రేయస్సు అనే కొత్త శకాన్ని ప్రారంభించగలం. మా నిబద్ధత తిరుగులేనిది..' అని కాంగ్రెస్ సందేశమిచ్చింది.

ఆస్ట్రేలియా నుంచి వచ్చి ఓటేశారు..

గ్రేటర్ హైదరాబాద్‌లోని ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వెళ్లకుండా బద్ధకిస్తున్న తరుణంలో ఇద్దరు యువకులు ఆస్ట్రేలియా నుంచి వచ్చి ఓటు హక్కు వినియోగించుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో చదువుతున్న రిత్విక్ పేట్ బషీర్‌బాద్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే కాచిగూడ ప్రాంతానికి చెందిన కొత్తూరు సౌరభ్ కూడా ఆస్ట్రేలియా నుంచి వచ్చి గురువారం బర్కత్‌పురాలో ఓటు వేశారు.


సౌరభ్

- సాక్షి, సిటీబ్యూరో/ కాచిగూడ

ఓటు లేదని సెల్‌టవర్ ఎక్కాడు..



కొమురవెల్లి(సిద్దిపేట): తన ఓటు గల్లంతైనందుకు నిరసనగా ఓ యువకుడు సెల్‌టవర్ ఎక్కాడు. సిద్దిపేట జిల్లాలో గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. కొమురవెల్లికి చెందిన ముత్యం వెంకటేశ్ పేరు ఓటర్ జాబితాలో రాలేదు. దీంతో ఓటు గల్లంతైందని తెలుసుకుని సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. గత ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నానని.. ఈసారి ఎలా గల్లంతవుతుందని ప్రశ్నించాడు. ఇది గమనించిన అధికారులు, పోలీసులు సర్ది చెప్పడంతో కిందకు దిగాడు.


ఖమ్మం జిల్లాలోని ములకలపల్లికి చెందిన దివ్యాంగురాలు మణిని రెండు కిలోమీటర్ల దూరంలోని పోలింగ్‌స్టేషన్‌కు వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న భర్త

శభాష్ కృష్ణయ్య

రెండు చేతుల్లేకున్నా ఓటేసిన దివ్యాంగుడు



కేశంపేట: విద్యుదాఘాతానికి గురై రెండు చేతులు కోల్పోయిన ఒక దివ్యాంగుడు గురువారం ఓటు వేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల పరిధిలోని అల్వాలకు చెందిన కృష్ణయ్య కొద్ది నెలల క్రితం విద్యుదాఘాతానికి గురై.. రెండు చేతులు కోల్పోయాడు. ఆయన గురువారం పోలింగ్ అధికారుల సాయంతో ఓటు హక్కు వినియోగించుకున్నాడు. చేతులు లేకపోవడంతో ఎన్నికల సిబ్బంది కృష్ణయ్య కాలి వేలికి సిరా చుక్క పెట్టారు.

మాకు డబ్బు పంచలేదేం?

కామారెడ్డి, పెద్దపల్లిలోని పలు గ్రామాల్లో నేతల ఇళ్ల వద్ద మహిళల నిరసన



భిక్కనూరు/సాక్షి, పెద్దపల్లి: పలు కాలనీల్లో ఓటర్లకు డబ్బు పంచిన నేతలు.. తమ కాలనీలో ఎందుకు డబ్బు పంపిణీ చేయలేదంటూ గురువారం కామారెడ్డి, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని పలుచోట్ల మహిళలు నిరసనకు దిగారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రంలో ఒక ప్రధాన పార్టీ నేత ఇంటి వద్ద రెండు గంటలపాటు ధర్నా చేపట్టారు. అయితే ఆ నేత ఇంట్లో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ శాపనార్థాలు పెట్టారు. బుధవారం రాత్రి నుంచి గురువారం వేకువజాము వరకు కూడా పలుచోట్ల ఓ ప్రధాన పార్టీకి చెందిన నేతల ఇళ్ల వద్దకు వెళ్లి కొందరు నిరసనకు దిగారు. ఓ నాయకుడు ఇంట్లో లేకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. మరోవైపు పెద్దపల్లి నియోజకవర్గం కాల్వ శ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామంలోనూ ఇదే తరహా ఘటన చోటుచేసుకుంది. ఒక పార్టీకి చెందిన నేతలు కొందరికే డబ్బు పంచి మిగతా వారికి ఇవ్వలేదని మహిళలు మండిపడ్డారు. డబ్బు పంచితే అందరికీ పంచాలంటూ రోడ్డుపై నిరసన తెలిపారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ అభ్యర్థి వాహనాన్ని అడ్డుకొనేందుకు విఫలయత్నం చేశారు. అనంతరం పోలింగ్ కేంద్రానికి వెళ్లి మరో పార్టీకి ఓటు వేశారు.


నల్లగొండ పట్టణంలోని బోయవాడలో ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం వేలికి సిరాగుర్తు చూపిస్తున్న ట్రాన్స్‌జెండర్లు

వంతెన కడితేనే ఓటేస్తాం

ఓటింగ్ బహిష్కరించిన 140 మంది ఓటర్లు



ఏటూరునాగారం: ఎన్నో ఏళ్లుగా జంపన్నవాగులో వంతెన లేక నానా తంటాలు పడుతున్నా పాలకులు పట్టించుకోనందుకు నిరసనగా ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం అల్లంవారిఘణపురం పంచాయతీ పరిధిలోని ఎలిశెట్టిపల్లి ఓటర్లు పోలింగ్‌ను బహిష్కరించారు. గ్రామంలో 186 మంది ఓటర్లు ఉన్నారు. తమకు వంతెన, రోడ్డు, తాగునీరు, విద్యుత్ సరఫరా, నిరంతర విద్య సేవలను అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఓటింగ్‌కు దూరంగా గ్రామాల్లోనే ఉండిపోయారు. ఉదయం 7 గంటల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదు. మొత్తం 186 మంది ఓటర్లలో కేవలం 40 మంది ఓటు హక్కును వినియోగించుకోగా.. 146 మంది మిగిలిపోయారు. దీంతో పోలింగ్ శాతం తగ్గిపోయింది.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శుక్రవారం ॥ 1-12-2023

ఫ్యాషన్




వివాహ వేడుకలలో కట్టే చీరలే దివ్యంగా వెలిగిపోతుంటాయి.
ఇక వాటికి అదనంగా మరో స్టయిల్‌ను కూడా జోడిస్తే..
ఆ వెలుగులు రెట్టింపు అవుతాయి.
పట్టు, వెల్వెట్, ఎంబ్రాయిడరీ దుపట్టా చీర మీదకు ధరించినా,
డ్రేపింగ్‌లో జత చేసినా ఆ స్టైల్ హుందాగా కనిపిస్తుంది.
ఈ వింటర్ సీజన్‌కి ప్రత్యేకంగా ఉండటమే కాదు చలి నుంచి రక్షణను కూడా ఇస్తుంది.
ఎవర్‌గ్రీన్‌గా ఉండే శారీ కట్టుకి
మహారాణి కళను తెచ్చే దుపట్టా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తుంది.

డబుల్ అట్రాక్షన్

కాంట్రాస్ట్

శారీ కలర్, దుపట్టా కలరా పూర్తి కాంట్రాస్ట్ ఉన్నది ఎంచుకోవాలి. దీనివల్ల రెండూ భిన్నంగా, ఆకర్షణీయంగా కనిపిస్తాయి.




రంగు ఒకటే... డిజైన్ వేరు

సేమ్ కలర్ శారీ దుపట్టాను ఎంచుకున్నా ఎంబ్రాయిడరీ డిజైన్‌లో కాంబినేషన్స్ చూసుకోవాలి. చీర డిజైన్ హెవీగా ఉంటే, దుపట్టా డిజైన్ బ్రైట్‌గా ఉండేలా ప్లాన్ చేసుకోవాలి. పట్టు శారీ మీదకు డిజైనర్ దుపట్టాను ఎంచుకునేటప్పుడు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి.





శాలువా స్టైల్

చీర మీదకు దుపట్టాను శాలువా మాదిరి కప్పుకున్నా ఈ సీజన్‌కి వెచ్చగా, బ్రైట్‌గా ఉంటుంది. అయితే, దుపట్టా గ్రాండ్‌గా ఉన్నది ఎంచుకోవాలి. ఇందుకు పట్టు, బ్రొకేడ్, ఎంబ్రాయిడరీ దుపట్టాలను చీరలను ఎంపికను బట్టి తీసుకోవాలి.

డ్రేపింగ్ దుపట్టా

చీరకట్టులో భాగంగా దుపట్టాను జత చేర్చి కట్టడం ఒక స్టైల్. ఈ కట్టును నిపుణుల ఆధ్వర్యంలో సెట్ చేయించుకోవాలి. ఈ కట్టుకు కూడా కాంట్రాస్ట్ కలర్స్ ఉండేలా చూసుకోవాలి.

* ధైర్యం

వ్యసనాల నుంచి వెలుగులోకి

పట్నాలో బ్యాంకు ఉద్యోగం చేస్తున్న రాఖీ శర్మ ఆ ఉద్యోగాన్ని వదిలేసి భర్త నడుపుతున్న రీహాబిలిటేషన్ సెంటర్‌ను తను స్వయంగా నిర్వహించడం మొదలుపెట్టింది. 5 వేల మంది ఇరవై ఏళ్ల లోపు పిల్లలను డ్రగ్స్ బారి నుంచి విముక్తి పొందేలా చేసింది. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి కౌన్సెలింగ్స్ ఇస్తోంది. మహిళలు వ్యసనానికి ఎలా లోనవుతున్నారు, వారు ఆ వ్యసనాల నుంచి బయట పడటం ఎలా అనే అంశంపై పని చేస్తున్నాను' అని వివరిస్తోంది రాఖీ. వ్యసనాలకు గురైన వారు వాటినుంచి బయటపడి తిరిగి సంతోషకరమైన జీవనాన్ని పొందేందుకు ఆమె చేస్తున్న స్ఫూర్తిదాయక జీవన ప్రయాణం కీలక అంశాలు.

''ఒకరోజు అర్ధరాత్రి ఫోన్ కాల్ వచ్చింది. విషయం విని చాలా బాధ అనిపించింది. ఒక మహిళ బ్లేడ్‌తో ఒళ్లంతా కోసుకుంది. డ్రగ్స్ కారణంగా ఆమె వైవాహిక జీవితం దెబ్బతింది. మత్తు పదార్థాల నుంచి ఎలా బయటపడాలో ఆమెకు అర్థం కావడం లేదు. మహిళలు డీ–అడిక్షన్ సెంటర్లకు వెళ్లడం అనేది ఉందా.. అని నన్ను అడిగారు. మద్యపానం, డ్రగ్స్, గంజాయి వంటి వాటికి అలవాటు పడిన వ్యక్తులు తమ అలవాటును వదిలించుకోవడానికి సహాయం చేయడం కూడా ఒక ముఖ్యమైన పని. నా మౌనం–పని ఈ రెండింటితో ఈ సెంటర్‌ను 22 ఏళ్లుగా నడుపుతున్నాను. వేలాదిమంది ని మాదకద్రవ్య వ్యసనం బారి నుంచి బయటికి తీసుకువచ్చాను. ఒకప్పుడు తమ జీవితాలు అంధకారంలో ఉండి, అన్ని వైపులా నిరాశకు గురైన వారు ఇప్పుడు వారి కుటుంబాలతో జీవిస్తున్నందుకు సంతోషపడుతున్నాను.



బ్యాంకు ఉద్యోగాన్ని వదిలేసి..

పుట్టి పెరిగింది గురుగ్రామ్. కొన్నాళ్లు ఢిల్లీలోనే ఉన్నాను. జంషెడ్‌పూర్, కోల్‌కతాలలో చదువుకున్నాను. డాక్టర్ కావాలనుకున్నాను కాని బ్యాంక్ ఉద్యోగి అయిన నాన్న కోరిక మేరకు సీఏ చదివాను. పెళ్లయ్యాక పట్నా వచ్చాను. నేనూ బ్యాంకు ఉద్యోగం సంపాదించుకున్నాను. కానీ కుటుంబాన్ని, ఉద్యోగాన్ని ఏకకాలంలో నిర్వహించడం అంత సులభం కాదని కొన్ని రోజుల్లోనే అర్థమయ్యింది. అప్పటికే మా వారు డీ–అడిక్షన్ సెంటర్ నడుపుతున్నారు. కొన్నిరోజులు గమనించిన తర్వాత, బ్యాంకు ఉద్యోగాన్ని వదిలేశాను. నిజానికి డీ–అడిక్షన్ సెంటర్ ఎలా పనిచేస్తుంది, మత్తు పదార్థాల నుంచి వ్యసనపరులను ఎలా బయట పడేయాలో ఏమాత్రం తెలియదు. కానీ క్రమంగా నేర్చుకున్నాను.

కాల్చివేస్తానని బెదిరింపులు..

బీహార్‌లో డీ–అడిక్షన్ సెంటర్ నడపడం చాలా కష్టం. మాదకద్రవ్యాల వ్యసనాన్ని వదిలించుకోవడానికి ఎక్కువగా నేర నేపథ్యం ఉన్న వారు వస్తారు. మంచి కుటుంబాలకు చెందిన పిల్లలు డ్రగ్స్‌కు బానిసలైతే పరువు పోతుందనే భయంతో వారిని బీహార్ నుంచి వేరే చోటకు పంపేవారు. ఇక ఓల్డ్‌సిటీలో డీ అడిక్షన్ సెంటర్‌కు వచ్చిన వారిని నిలువరించడం పెద్ద సవాలుగా ఉండేది. అలాంటి వాళ్లు మా కేంద్రానికి వచ్చి కొడతామంటూ ఉద్రేకంతో వస్తుంటారు. ఆ సమయంలో వారిపై వారికి అదుపు ఉండదు. వారి అలవాట్లను అడ్డుకుంటే బెదిరింపులు ఉండేవి. 'బయటకు వెళ్లాక చూడు.. నిన్ను కాల్చేస్తాము'నేవారు. కేంద్రాన్ని మూసివేస్తామని బెదిరింపులు. కానీ నేనేం తప్పు చేయట్లేదు. భయమెందుకు?

జైలులో డ్రగ్స్ నుంచి మహిళా ఖైదీల వరకు...

పట్నాలోని బ్యూర్ జైల్లో ఖైదీల కోసం 10 ఏళ్లపాటు డీ–అడిక్షన్ క్యాంప్ నడిపాను. మహిళాఖైదీలతో ఈ క్యాంప్ స్టార్ట్ అయ్యింది. జైలులో ఓ బాలిక తన బట్టలు చింపుకుని బీభత్సం సృష్టించింది. అప్పుడు నన్ను పిలిచారు. ఆమెను చూడగానే ఆ అమ్మాయి డ్రగ్ అడిక్ట్ అని అర్థమైంది. తనకు డ్రగ్స్ అందుబాటులో లేకపోవడంతో ఆమె అలా ప్రవర్తించింది. అప్పుడు ఇక్కడ ఖైదీలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో జైలు ఐజీకి నివేదించాను. ఐజీ అభ్యర్థన మేరకు జైలులో మూడు రోజుల పాటు డీ–అడిక్షన్ క్యాంపు నిర్వహించారు. శిబిరంలో 1000 మందికి పైగా ఖైదీలు పాల్గొన్నారు. వందలాది మంది ఖైదీలు మాదకద్రవ్యాల నుండి విముక్తి పొందారు.

వీధి బాలలు, అనాథలు, వదిలి వేయబడిన పిల్లలు ఎక్కువగా మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారారు. అలాంటి పిల్లల కోసం ప్రత్యేక కేంద్రాన్ని ప్రారంభించాం. వీధి బాలల కార్యక్రమాన్ని కూడా నిర్వహించాం. 30–35 మంది పిల్లలకు భోజనం, పానీయం, విద్య అన్ని ఏర్పాట్లు ఉన్న చోట ఈ కేంద్రానికి వసతి కల్పించే సామర్థ్యం కల్పించాం.



నిషేధం తర్వాత..

ఒక డ్రగ్ మానేస్తే మరో మందు వాడటం మొదలు పెడతారు. బీహార్‌లో మద్య నిషేధం తర్వాత ఈ ట్రెండ్ కనిపించింది. ఇప్పుడు ప్రజలు గంజాయి, ఇతర డ్రగ్స్ ఎక్కువగా తీసుకుంటున్నారు. అయితే డ్రగ్స్‌కు బానిసలైన వ్యక్తులు మద్యం కంటే వారి వ్యసనం నుండి బయటపడటం చాలా కష్టం. నిషేధం కారణంగా, ప్రజలు డీ–అడిక్షన్ సెంటర్‌లకు రావడం మానేశారు. ఆ తర్వాత జిల్లా ఆసుపత్రుల్లో డీ–అడిక్షన్ కోసం 15 ప్రత్యేక పడకలను అందించేందుకు కృషి చేశాం. ఆ తర్వాత ఈ విషయంలో వైద్యులకు శిక్షణ కూడా ఇచ్చాం. 5 వేల మంది పిల్లలు మాదకద్రవ్యాల నుండి విముక్తి పొందారు.

మహిళల కోసం..

చాలా మంది మహిళలు తమ కుటుంబ సభ్యులకు తెలియకుండానే డ్రగ్స్ అలవాటు నుంచి బయటపడేందుకు వస్తుంటారు. మహిళల కోసం ప్రత్యేక డీ–అడిక్షన్ సెంటర్ కూడా ఉంది. చాలా మంది మహిళలు తమ గుర్తింపును దాచుకుంటారు, కొందరు తమ కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇక్కడకు వస్తారు.

ఓ మహిళ భర్త దుబాయ్‌లో ఉన్నాడు. అక్కడి నుంచి ఖరీదైన మద్యం తెచ్చేవాడు. ఆమె తన బిడ్డతో ఇంట్లో ఒంటరిగా ఉంటూ మద్యం సేవించి క్రమంగా దానికి బానిసయ్యింది. పట్టించుకునేవారెవరూ లేకపోవడంతో ఆమె బిడ్డ చదువుకు దూరమయ్యాడు. దాంతో డీ–అడిక్షన్ సెంటర్‌కి వెళ్లి, కొన్ని సెషన్స్ తర్వాత నార్మల్‌గా మారింది.

అదేవిధంగా పట్నాలోని ఓ ఉన్నత కుటుంబానికి చెందిన ఓ మహిళ డ్రగ్స్‌కు బానిసైంది. ఆమె ఎంబీఏ చేసింది. తల్లి చైనాలో, సోదరుడు అమెరికాలో ఉన్నారు. ఆమె వైవాహిక జీవితం బాగోలేదు. విడాకుల తర్వాత ఆమె డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. డీ–అడిక్షన్ సెంటర్‌కు వచ్చేటప్పటికి ఆమె శరీరంపై చాలా కోతలు ఉన్నాయి. బ్లేడుతో తానే కోసుకుని ఆనందించేది. కొన్నినెలల చికిత్స తర్వాత ఆమె సాధారణ స్థితికి వచ్చింది.

బీహార్‌కు చెందిన ఓ ఐఏఎస్ అధికారి మద్యానికి బానిసయ్యాడు. ఎంత ప్రయత్నించినా ఆ వ్యసనాన్ని వదులుకోలేకపోతున్నాడు. భార్య ప్రోద్బలంతో ఆ ఐఏఎస్ డీ–అడిక్షన్ సెంటర్‌లో చికిత్స తర్వాత తన వ్యసనాన్ని విడిచిపెట్టాడు. చాలా మంది డాక్టర్లు, ఇంజినీర్లు డీఅడిక్షన్ సెంటర్ కు వచ్చి డ్రగ్స్ అలవాటు నుండి విముక్తి పొందారు.'' అంటూ తను చేస్తున్న సేవ గురించి వివరించే రాఖీశర్మ ఎందరికో స్ఫూర్తిదాయకం.

వంటిల్లు

బఠాణితో బ్రేక్‌ఫాస్ట్...
క్యాబేజ్‌కి ఎగ్‌తో దోస్తీ... పప్పులోకి చిక్కుళ్లు.
ఊహకందని అరటికారం...
మన వంటింటి చమత్కారం

కూరలు అవే రుచులే వేరు

అరటి కాయ కారం పొడి



కావలసినవి: **అరటికాయలు** – మూడు; **పసుపు** – 1/2 టీ స్పూను; **ఉప్పు** – రుచికి సరిపడా; **మినపప్పు** – రెండు టీ స్పూన్లు; **పచ్చిశనగ పప్పు** – టీస్పూను; **ధనియాలు** – 2 టేబుల్ స్పూన్లు; **ఎండుమిర్చి** – ఐదు; **మిరియాలు** – టీస్పూను; **ఎండు కొబ్బరి తురుము** – నాలుగు టీస్పూన్లు; **కరివేపాకు** – ఐదు రెమ్మలు; **ఇంగువ** – చిటికెడు; **నూనె** – నాలుగు టీస్పూన్లు; **ఆవాలు** – అరటీస్పూను.

తయారీ: స్టవ్ వెలిగించి మీడియం మంట మీద అరటికాయలను కాల్చాలి. ● చక్కగా కాలాక మంట మీద నుంచి తీసి చల్లారాక తొక్కతీసేసి, సన్నగా తురిమి పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు స్టవ్ మీద బాణలిపెట్టి టీస్పూను మినప్పప్పు, పచ్చి శనగపప్పు, ధనియాలు, ఎండు మిర్చి, మిరియాలు, ఎండు కొబ్బరి తురుము, మూడు రెమ్మల కరివేపాకు, ఇంగువ వేసి దోరగా వేగాక, చల్లారనిచ్చి పొడిచేసి పెట్టుకోవాలి. ●స్టవ్ మీద బాణలిపెట్టి నూనె వేయాలి. ● వేడెక్కిన తరువాత మిగిలిన మినప్పప్పు, ఆవాలు, కరివేపాకు వేసి వేయించాలి. ● చిటపటలాడాక అరటికాయ తురుము, పసుపు, రుచికి సరిపడా ఉప్పువేసి వేయించాలి. ● తరువాత మసాలా పొడి వేసి కలిపి మూతపెట్టి, సన్న మంట మీద ఐదు నిమిషాలు మగ్గనిస్తే అరటి కాయ పొడి రెడీ.

క్యాబేజ్ ఎగ్ భుర్జి



కావలసినవి: **క్యాబేజీ తురుము** – రెండు కప్పులు; **నూనె** – మూడు టేబుల్ స్పూన్లు; **ఉల్లిపాయ తరుగు** – అరకప్పు; **అల్లం వెల్లుల్లి పేస్టు** – ఒకటిన్నర టీస్పూన్లు; **పచ్చిమిర్చి** – చిన్నవి ఆరు(సన్నగా తరగాలి); **ధనియాల పొడి** – అరటీస్పూను; **పసుపు** – అరటీస్పూను; **కారం** – ముప్పావు టీస్పూను; **గుడ్లు** – నాలుగు; **ఉప్పు** – రుచికి సరిపడా; **కొత్తిమీర తరుగు** – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: స్టవ్ మీద మందపాటి బాణలి పెట్టి నూనె వేసి వేడెక్కిన తర్వాత ఉల్లిపాయ తరుగు వేసి వేయించాలి. ● ఉల్లిపాయ వేగాక, అల్లం వెల్లుల్లి పేస్టువేసి వేయించాలి. ● అల్లం వెల్లుల్లి పేస్టు పచ్చివాసన పోయిన తరువాత పచ్చిమిర్చి తరుగు వేయాలి. ● మిర్చి వేగిన తరువాత ధనియాలపొడి, కారం, పసుపు, క్యాబేజీ తరుగు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి బాణలి మీద మూతపెట్టి సన్న మంట మీద మగ్గనివ్వాలి. ● గుడ్లసొనను ఒక గిన్నెలో వేసి బీటర్ లేదా ఫోర్క్‌తో కలిపి పక్కన పెట్టాలి. ● క్యాబేజీ ఉడికి దగ్గర పడుతున్నప్పుడు గుడ్ల సొనవేసి కలుపుతూ వేయించాలి. ● చక్కగా వేగిన తర్వాత కొత్తిమీర చల్లుకుని దించేయాలి. ● రోస్టెడ్ బ్రెడ్, చపాతీ, రోటీలోకి ఇది మంచి సైడ్ డిష్.

గ్రీన్ పీస్ ఊతప్పం



కావలసినవి: **పచ్చిబఠాణీ** – కప్పు; **సూజీ రవ్వ** – కప్పు; **బియ్యప్పిండి** – మూడు టీస్పూన్లు; **పచ్చిమిర్చి** – మూడు; **అల్లం** – అరంగుళం ముక్క; **కొత్తిమీర తరుగు** – రెండు టీస్పూన్లు; **జీలకర్ర** – టీస్పూను; **పెరుగు** – అరకప్పు; **వంటసోడా**– 1/2 టీ స్పూను; **ఉప్పు** – రుచికి సరిపడా; **నూనె** – ఊతప్పం కాల్చడానికి తగినంత.

తయారీ: మిక్సీజార్‌లో పచ్చిబఠాణీ, పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీర, జీలకర్ర, రుచికి సరిపడా ఉప్పు వేసి తగినంత నీటిని వేస్తూ గ్రైండ్ చేయాలి. ● ఇప్పుడు ఒక పెద్ద గిన్నె తీసుకుని సూజీ రవ్వ, బియ్యప్పిండి, గ్రైండ్ చేసిన బఠాణీ పేస్టు, పెరుగు కలిపి నానబెట్టాలి. ● అర గంట తరువాత రుచికి సరిపడా ఉప్పు, వంటసోడా, కొద్దిగా నీళ్లు పోసుకోని గరిట జారుడుగా కలుపుకోవాలి. ● పెనం వేడెక్కాక కొద్దిగా నూనె వేసి రెండు గరిటలు పిండి వేసి రొట్టెలా వేసుకోవాలి. దాని మీద సన్నగా తరిగిన ఉల్లిపాయ, క్యారట్, క్యాప్సికమ్ ముక్కలు వేసి మూత పెట్టి మంట తగ్గించాలి. ● ఓ నిమిషం తర్వాత మూత తీసి ఊతప్పాన్ని తిరగేసి మరో అర స్పూన్ నూనె వేసి రెండోవైపు కూడా కాల్చుకుంటే గ్రీన్‌పీస్ ఊతప్పం రెడీ. చట్నీ, సాంబార్‌తో చాలా బావుంటుంది.

చిక్కుడు కాయ పప్పు



కావలసినవి: **చిక్కుడు కాయలు** – పావు కేజీ; **పెసరపప్పు** – అరకప్పు; **పసుపు** – పావు టీస్పూను; **పచ్చి కొబ్బరి తురుము** – అరకప్పు; **ఎండుమిర్చి** – నాలుగు; **జీలకర్ర** – టీస్పూను; **కరివేపాకు** – నాలుగు రెమ్మలు; **ఆవాలు** – పావు టీస్పూను; **నూనె** – తగినంత; **మినప్పప్పు** – టీస్పూను; **ఉప్పు** – తగినంత.

తయారీ: పెసరపప్పుని కడిగి కుకర్ గిన్నెలో వేయాలి. ● దీనిలో కప్పునీళ్లు, పసుపు, 1/2 టీస్పూను ఉప్పు వేసి మూతపెట్టి రెండు విజిల్స్ రానివ్వాలి. ● చిక్కుడు కాయలను కడిగి ఈనె తీసి ముక్కలు చేసుకోవాలి. ● తగినన్ని నీళ్లు, చిటికెడు ఉప్పు వేసి రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ● పచ్చికొబ్బరి, జీలకర్ర, కరివేపాకు, ఎండు మిర్చిని మిక్సీ జార్‌లో వేసి కొద్దిగా నీళ్లపోసి పేస్టు చేయాలి. ● ఉడికిన పెసరపప్పులో.. చిక్కుడు ముక్కలు, నూరుకున్న మసాలా పేస్టు, ఉప్పువేసి కలపాలి. ● ఒక పాత్రలో నూనె వేసి వేడెక్కిన తర్వాత ఆవాలు, మినప్పప్పు వేసి చిటపటలాడాక మిగతా కరివేపాకు వేసి వేయించి అందులో పప్పు మిశ్రమాన్ని కలిపితే చిక్కుడుకాయ పప్పు రెడీ. అన్నం, చపాతీ, రోటీల్లోకి చాలా బావుంటుంది.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శుక్రవారం ॥ 1-12-2023

● టెక్.. టాక్

నూబియా జెడ్ 50 ఎస్ ప్రో



సైజ్: 6.78 అంగుళాలు; రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జెడ్
రిజల్యూషన్: 1260×2800 పిక్సెల్స్; బ్యాటరీ: 5100 ఎంఏహెచ్;
బరువు: 228.00 గ్రా. కలర్స్: బ్లాక్ కాఫీ, ఖాకీ అండ్ మిర్రర్ ఆఫ్ లైట్


ఒప్పో ప్యాడ్ ఎయిర్ 2



డిస్‌ప్లే: 11.40 అంగుళాలు; ఫ్రంట్ కెమెరా: 8-మెగా పిక్సెల్స్
ర్యామ్: 6జీబీ; వోఎస్: ఆండ్రాయిడ్ 13; స్టోరేజ్: 128జీబీ
రిజల్యూషన్: 2408×1720 పిక్సెల్స్; బ్యాటరీ: 8000 ఎంఏహెచ్

'బార్డ్'కు కొత్త ఫీచర్

తమ ఏఐ చాట్‌బాట్ 'బార్డ్' నాణ్యతను మెరుగుపరచడంపై ఎప్పటికప్పుడు దృష్టి పెడుతోంది గూగుల్. వీడియో కంటెంట్‌ను రెగ్యులర్‌గా ఉపయోగించే యూజర్‌లకు ఉపయోగపడే కొత్త ఫీచర్‌ని తీసుకు వచ్చింది. దీని ద్వారా నిర్దిష్టమైన యూట్యూబ్ వీడియోలకు సంబంధించిన సమాచారం తెలుసుకోవచ్చు.



ఉదా: 'హౌ టు మేక్ ఆలివ్ ఆయిల్ కేక్' వీడియోను చూస్తున్నప్పుడు 'ఎన్ని గుడ్లు అవసరం అవుతాయి?' లాంటి ప్రశ్నలు ఎన్నో అడగవచ్చు. 'బార్డ్'కు సంబంధించి గూగుల్ ప్రకటించిన కొత్త అప్‌డేట్‌లలో టీనేజర్‌లకు మ్యాథ్స్ ఈక్వేషన్‌కు సంబంధించి సహాయం చేసే ఫీచర్ కూడా ఉంది.

సోనీ ఇన్-కెమెరా అథెంటిసిటీ టెక్నాలజీ

ఏఐ మానిప్యులేటెడ్ ఇమేజ్‌లపై పోరాటంలో భాగంగా సోనీ ఎలక్ట్రానిక్స్ నాన్-ప్రాఫిట్ న్యూస్ ఆర్గనైజేషన్స్ అసోసియేటెడ్ ప్రెస్, కెమెరా బిట్స్‌తో కలిసి 'ఇన్-కెమెరా అథెంటిసిటీ' టెక్నాలజీపై పనిచేస్తోంది. ఈ టెక్నాలజీ త్వరలో సోనీ కెమెరాలలోకి అందుబాటులోకి రానుంది. న్యూ ఇన్-కెమెరా అథెంటిసిటీ టెక్నాలజీని పరీక్షించడంలో రెండో రౌండ్ పూర్తయింది. ఈ టెక్నాలజీ ద్వారా ఫేక్ చిత్రాలు, వీడియోలను కనిపెట్టవచ్చు.



లేబర్ ఆఫ్ లవ్



ప్రతిఫలం, ప్రయోజనం, ధనం ఆశించకుండా ఆత్మసంతృప్తి కోసం చేసే పనులు కొన్ని ఉంటాయి. ఇలాంటి సమయంలో వాడే మాట... లేబర్ ఆఫ్ లవ్.

ఉదా: రవి వుడ్ నెవర్ వేస్ట్ హిజ్ టైమ్ ఆన్ ఏ లేబర్ ఆఫ్ లవ్. హీ ఈజ్ వోన్లీ ఇంట్రెస్టెడ్ ఇన్ మేకింగ్ మనీ.

ఆఫ్ ది కఫ్

ఏమీ ఆలోచించకుండా, ఎలాంటి ప్రిపరేషన్ లేకుండా మాట్లాడే సమయంలో స్పాంటేనియస్‌గా, క్యాజువల్‌గా మాట్లాడిన సందర్భంలో వాడే మాట....ఆఫ్ ది కఫ్.

ఉదా: నీరజ్ ఈజ్ నోన్ ఫర్ హిజ్ ఆఫ్ ది కఫ్ ట్వీట్స్ దట్ అఫెన్ స్పార్క్ వైడ్-స్ప్రెడ్ కంట్రొవర్సీ.

● గేమింగ్



జాంబీల జాడ కోసం...

జాంబీలు ప్రపంచాన్ని ఆక్రమించారు. ఎటు చూసినా భయం రాజ్యమేలుతోంది. ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలియదు. ఈ కల్లోల పరిస్థితి గురించి తెలుసుకోవాలంటే 'ది డే బిఫోర్'లోకి వెళ్లాల్సిందే. ఎన్నో వాయిదాల తరువాత మల్టీప్లేయర్ వోపెన్ వరల్డ్ సర్వైవల్ హారర్ వీడియో గేమ్ 'ది డే బిఫోర్' ఈ నెల 7న విడుదల కానుంది. గతంలో వచ్చిన 'గేమ్‌ప్లే' ట్రైలర్ గేమ్ బేసిక్ మెకానిక్స్ గురించి సూచనప్రాయంగా చెప్పింది. మొదట్లో ఈ గేమ్ గురించి ప్రకటించినప్పుడు స్టీమ్ మోస్ట్ విష్ జాబితాలో కనిపించింది.

ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్5
ప్లాట్‌ఫామ్ విండోస్ మోడ్స్: మల్టీప్లేయర్

● సక్సెస్ స్టోరీ


అనునయ్ సూద్

ప్రయాణ ప్రేమికుడైన అనునయ్ సూద్ 30 దేశాల వరకు వెళ్లివచ్చాడు. చిన్న వయసులోనే ట్రావెలింగ్ అండ్ ఫోటోగ్రఫీ రంగంలో పెద్ద పేరు తెచ్చుకున్నాడు నోయిడాకు చెందిన అనునయ్ సూద్. వ్లోగ్స్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌తో సోషల్ మీడియాలో పాపులర్ అయిన అనునయ్ సూద్ ట్రావెల్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నాడు. ట్రావెల్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా స్విట్జర్లాండ్ టూరిజం, విజిట్ సౌదీ, న్యూజిలాండ్ టూరిజం... మొదలైన సంస్థలతో కలిసి పనిచేస్తున్నాడు...

ప్రయాణ పాఠాలతో...

'నాకు ట్రావెలింగ్ అంటే ఎందుకు ఇష్టం అంటే ట్రావెల్ చేయకుండా ఉండలేను కాబట్టి' నవ్వుతూ అంటాడు అనునయ్ సూద్. ఇంజినీరింగ్ చేసిన అనునయ్ కొంత కాలం ఉద్యోగం చేశాడు. జీతం రాగానే ఆ బడ్జెట్‌లో ఏదో ఒక ట్రిప్ ప్లాన్ చేసేవాడు. ప్రయాణ మాధుర్యాన్ని మరింతగా ఆస్వాదించడానికి ఉద్యోగానికి రాజీనామా చేసి ఫ్లెక్సిబుల్ ప్రాజెక్ట్స్‌లో పనిచేశాడు. సాహసకృత్యాలను ఇష్టపడే వారి కోసం ట్రెక్ ఆర్గనైజింగ్ కమ్యూనిటీని స్టార్ట్ చేశాడు. ఈ కమ్యూనిటీలో గైడ్, టీమ్ లీడర్‌గా వ్యవహరించాడు.

అనునయ్ ప్రతి ప్రయాణాన్ని కొత్త జీవితంతో పోల్చుతాడు.

ప్రయాణ జ్ఞాపకాలను ఛాయా చిత్రాలలో భద్రపరిచే క్రమంలో ట్రావెల్ ఫొటోగ్రఫీలో కూడా నైపుణ్యం సాధించాడు. ట్రావెలింగ్, ఫొటోగ్రఫీపై ఉన్న ఇష్టాన్ని మిళితం చేసి డిజిటల్ కంటెంట్ క్రియేటర్‌గా విజయం సాధించాడు. ఆ తరువాత 'మెటా-సోషల్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారాడు. 'మెటా-సోషల్' అనేది పెర్‌ఫార్మెన్స్ అండ్ మార్కెటింగ్ సొల్యూషన్ కంపెనీ.

'ట్రావెలింగ్‌పై నాకు ఉన్న ఇష్టాన్ని కమర్షియలైజ్ చేసుకోవాలనుకోలేదు' అంటున్న అనునయ్ 'ప్రాజెక్ట్ ఘర్' పేరుతో హోమ్‌స్టే సర్వీస్ వెంచర్‌ను స్టార్ట్ చేసే ఆలోచనలో ఉన్నాడు.

ఇప్పటి వరకు 30 దేశాల వరకు వెళ్లి వచ్చిన అనునయ్ 'ఫొటోగ్రఫీ విజన్, ట్రావెలింగ్‌పై ఫ్యాషన్ ఉంటే సాధారణ ప్రదేశాల నుంచి కూడా అసాధారణ అందాలను వీక్షించవచ్చు. ట్రావెల్ ఫొటోగ్రఫీపై మనకు విజన్ ఉంటే ఖరీదైన కెమెరాలతో పనిలేదు' అంటున్నాడు అనునయ్ సూద్.

కొత్తదారులలో...

ప్రయాణ క్రమంలో ప్రకృతి నుంచి, సామాజిక బృందాల నుంచి నేర్చుకున్న పాఠాలు ఎన్నో ఉంటాయి. దృష్టి విశాలం కావడానికి, చురుగ్గా ఉండడానికి, సృజనాత్మకంగా ఆలోచించడానికి ప్రయాణాలు ఉపయోగపడతాయి. కొత్త దారులు కొత్త ఆలోచనలకు దారి తీస్తాయి.
– అనునయ్ సూద్



అవును... ఇది నిజమే!

* చైనాలోని లెహే లెడు వైల్డ్‌లైఫ్ జూ అనేది రివర్స్ జూ. ఈ జూలో విజిటర్‌లు లాక్ చేయబడిన వాహనంలో తిరుగుతుంటే జంతువులు మాత్రం స్వేచ్ఛగా విహరిస్తుంటాయి
* డ్యూక్ యూనివర్శిటీకి చెందిన న్యూరోసర్జన్లు, న్యూరో సైంటిస్ట్‌లు మెదడు సంకేతాలను పదాలుగా మార్చగలిగే స్పీచ్ ప్రొస్థెటిక్‌ను రూపొందించారు. 256 మైక్రోస్కోపిక్ సెన్సర్‌లతో కూడిన ఈ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ నాడీ సంబంధిత రుగ్మతలతో బాధపడే వారికి కమ్యూనికేషన్ విషయంలో సహాయపడుతుంది.
* జపాన్‌లో 'హొక్కాయిడో' అనే లొకేషన్ ఉంది. ఇక్కడ మంచు, ఇసుక, సముద్రం పక్క పక్కనే కనిపిస్తాయి.

యువర్స్

● ఆర్ట్ అండ్ కల్చర్

ఫ్యూచర్ టెన్స్



కాలంతో పాటు సాంకేతికత కూడా మారుతుంది. సాంకేతికతతో పాటు చూసే దృశ్యం కూడా మారుతుందని చెప్పే ఈ కార్టూన్‌ను టర్కీ కార్టూనిస్ట్ హికామీ డెమిర్సీ గీశాడు. అంకారా యూనివర్శిటీ నుంచి సాహిత్యంలో పట్టా పుచ్చుకున్నాడు హికామీ. కార్టూన్, యానిమేషన్‌లలో మంచి పేరు తెచ్చుకున్న హికామీ ఎన్నో యానిమేషన్ ఫిల్మ్‌లకు స్క్రీన్‌రైటర్‌గా పనిచేశాడు. 'ఐలాండ్ ఆఫ్ హరైజన్' అనే యానిమేషన్ ఫిల్మ్‌కు డైరెక్టర్. రెండు కార్టూన్ ఆల్బమ్‌లను తీసుకువచ్చిన హికామీ జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో అవార్డ్‌లు అందుకున్నాడు. సమకాలీన సామాజిక విషయాలు మాత్రమే కాదు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఊహాజనిత చిత్రాలు గీయడం అంటే కూడా హికామీకి ఇష్టం. ఇక్కడ కనిపిస్తున్న కార్టూన్ అలాంటిదే.

● మ్యూజిక్ వరల్డ్

స్వీట్ ట్యూన్ ట్విన్ సిస్టర్స్

ట్విన్ సిస్టర్స్ సుకృతి, ప్రకృతి కకర్‌లకు సంగీతం బాల్యం నుంచి సుపరిచితం. తల్లి మ్యూజిక్ టీచర్. అక్క ప్రొఫెషనల్ సింగర్. ఎనిమిది సంవత్సరాల వయసులో సంగీత ప్రపంచంలో తొలి అడుగులు వేశారు. పాపులర్ హిట్స్‌తో సింగర్స్‌గా బాలీవుడ్‌లో మంచి పేరు తెచ్చుకున్నారు.

అక్క ఆకృతి సంగీతంలో తమకు స్ఫూర్తి అని చెబుతారు. అలా అని అక్కను అనుకరించకుండా తమదైన ముద్ర కోసం ప్రయత్నించి విజయం సాధించారు ప్రకృతి.

'మొదట్లో ప్రశంసలను మాత్రమే ఆస్వాదించే వాళ్లం. విమర్శలను దూరంగా పెట్టేవాళ్లం. అయితే సంగీత పరిశ్రమలో ప్రశంసలతో పాటు విమర్శలు కూడా సహజం అనే వాస్తవం తెలుసుకున్నాను. నిర్మాణాత్మక విమర్శలు ముఖ్యం. ద్వేషపూరిత విమర్శలతో ట్రోలింగ్ చేయడం తగదు' అంటుంది ప్రకృతి.

వంద వరకు లైవ్ షోలు చేసిన ఈ సిస్టర్స్ 'ప్రతి షో ఒక పాఠం నేర్పుతుంది' అంటారు.

'ప్రపంచవ్యాప్తంగా మ్యూజిషియన్‌లు లైవ్ షోలకు ప్రాధాన్యత ఇస్తారు. మేము కూడా అంతే. ఆన్‌లైన్‌లో కంటే ప్రేక్షకుల సమక్షంలో వారి ప్రతిస్పందనలు, ప్రశంసలు, చప్పట్లు ఆస్వాదిస్తూ లైవ్ షో చేయడంలో ఎంతో మజా ఉంటుంది. ఇక ఇండిపెండెంట్ మ్యూజిక్ మాలాంటి వారికి ఎంతో ఉపయోగపడుతుంది. యువ సంగీతకారులు తమను నిరూపించుకోవడానికి ఇండిపెండెంట్ మ్యూజిక్ సహాయపడుతుంది' అంటుంది సుకృతి.


సుకృతి, ప్రకృతి

సినిమా

సంక్రాంతికి సై

సంక్రాంతి పండగ అంటే సినిమాల పండగ కూడా. పండగ వసూళ్లను దండుకోవడానికి సంక్రాంతి మంచి సమయం. అందుకే 'సంక్రాంతికి సై' అంటూ తమ సినిమాలను విడుదల చేస్తుంటారు. 2024 సంక్రాంతి పండగకి మరో నెలకు పైగా సమయం ఉన్నా అప్పుడే ఇండస్ట్రీలో సంక్రాంతి జోష్ కనిపిస్తోంది. ఈసారి పండగకి దాదాపు అరడజను స్ట్రయిట్ తెలుగు, దాదాపు ఐదు డబ్బింగ్ చిత్రాలతో సినిమాల జోరు బాగానే కనిపించనుంది. సినీ లవర్స్‌కి పండగకి దాదాపు పది చిత్రాలు రానున్నాయి. ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.


నాగార్జున


వెంకటేశ్


విష్ణు విశాల్, రజనీకాంత్


రవితేజ


మహేశ్‌బాబు

● 'సోగ్గాడే చిన్నినాయనా' (2016), 'బంగార్రాజు' (2022) వంటి చిత్రాలతో సంక్రాంతి రేసులో నిలిచి, విజయం అందుకున్నారు నాగార్జున. 'నా సామి రంగ' చిత్రంతో ఈసారి మళ్లీ సంక్రాంతి బరిలో నిలుస్తున్నారు. ఈ చిత్రం ద్వారా కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఇందులో నాగార్జున ఫుల్ మాస్ లుక్‌లో కనిపిస్తారు. ఆయన మాట తీరు, యాక్షన్ సీక్వెన్సులు అన్నీ కొత్తగా, స్టైలిష్‌గా ఉంటాయి. నాగార్జున పుట్టిన రోజు (ఆగస్ట్ 29) సందర్భంగా విడుదల చేసిన నాగార్జున లుక్, గ్లింప్స్ ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. 'ఈ పండక్కి నా సామి రంగ' అంటూ గ్లింప్స్ చివర్లో నాగార్జున చెప్పిన డైలాగ్ వైరల్ అవుతోంది. ఆయన కెరీర్‌లో 99వ సినిమాగా 'నా సామి రంగ' రూపొందుతోంది. శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అయితే ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించలేదు కానీ, సంక్రాంతికి రిలీజ్ పక్కా అని విడుదలైన గ్లింప్స్ స్పష్టం చేస్తోంది.

● ● ●

● 'సైంధవ్' సినిమాతో వెంకటేశ్ సంక్రాంతి బరిలో దిగుతున్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'సైంధవ్'. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ సినిమా జనవరి 13న విడుదల కానుంది. వెంకటేశ్ కెరీర్‌లో 'సైంధవ్' 75వ చిత్రం కావడంతో అటు ఇండస్ట్రీ వర్గాల్లో ఇటు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. పైగా ఆయన నటిస్తున్న తొలి పాన్ ఇండియన్ సినిమా ఇదే కావడం విశేషం. ఫ్యామిలీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. 'సైంధవ్' చిత్రాన్ని ఈ డిసెంబర్ 22న రిలీజ్ చేయనున్నట్లు తొలుత మేకర్స్ ప్రకటించారు. అయితే ప్రభాస్ 'సలార్' చిత్రాన్ని అదే రోజు రిలీజ్ చేయనున్నట్లు ఆ చిత్రబృందం ప్రకటించడంతో సంక్రాంతి బరిలో దిగారు వెంకటేశ్.

● ● ●


● గ్యాప్ ఇవ్వకుండా వరుస సినిమాలతో దూసుకెళుతున్నారు రవితేజ. ఈ దసరాకి 'టైగర్ నాగేశ్వరరావు'గా వెండితెరపై కనిపించారు. సంక్రాంతికి 'ఈగల్' చిత్రంతో బరిలో దిగడానికి రెడీ అయ్యారు. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న చిత్రం ఇది. ఇందులో కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా జనవరి 13న విడుదల కానుంది. అయితే ఆ తేదీకి విడుదల అవుతుందా? వాయిదా పడుతుందా అనే చర్చ వినిపిస్తోంది. కానీ చెప్పిన తేదీకి పక్కా వస్తామంటూ రిలీజ్ కౌంట్ డౌన్ మొదలు పెట్టారు మేకర్స్. రవితేజ కెరీర్‌లోనే 'ఈగల్' వినూత్నమైన యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోందని, ఇందులో రవితేజ శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని చిత్రయూనిట్ పేర్కొంది.

● ● ●

● ఈ సంక్రాంతికి ప్రేక్షకులకు గుంటూరు కారం ఘాటు చూపించడానికి 'గుంటూరు కారం'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు హీరో మహేశ్‌బాబు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇందులో శ్రీలీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా జనవరి 12న విడుదల కానుంది. ఈ చిత్రంలో మహేశ్‌బాబు పక్కా మాస్ లుక్‌లో కనిపించనున్నారని ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్స్, గ్లింప్స్ చెబుతున్నాయి.


విజయ్, మృణాల్


తేజ సజ్జా


ధనుష్


శివ కార్తికేయన్

● 'ఖుషి' వంటి హిట్ సినిమా తర్వాత విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. ఈ చిత్రానికి పరశురామ్ దర్శకుడు. 'గీత గోవిందం' (2018) వంటి హిట్ మూవీ తర్వాత విజయ్-పరశురామ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఫ్యామిలీ స్టార్'. ఇందులో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి పోటీలో నిలవనుంది. అయితే ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కావడం లేదనే చర్చ తాజాగా ఫిల్మ్‌నగర్ వర్గాల్లో జరుగుతోంది. ఒకవేళ సంక్రాంతికి విడుదల కాకపోతే మార్చిలో రిలీజ్ కానుందనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. అక్కడి షెడ్యూల్ పూర్తయ్యాక తర్వాతి షెడ్యూల్ చిత్రీకరణకు అమెరికాకు బయలుదేరనుంది యూనిట్. దాదాపు నెలరోజులకు పైగా అక్కడి లొకేషన్స్‌లో షూటింగ్ జరపనున్నారట. సంక్రాంతికి ఇంకా నెలన్నరే ఉంది. కానీ 'ఫ్యామిలీ స్టార్' షూటింగ్‌కి దాదాపు అంతే సమయం పడుతుందట. అందుకే ఈ చిత్రం సంక్రాంతి బరిలో నిలుస్తుందా? లేదా అనే చర్చ జరుగుతోంది.

● ● ●

● ఈ సంక్రాంతి బరిలో స్టార్ హీరోలు దిగుతుంటే నేనూ వస్తున్నానంటున్నాడు యువ హీరో తేజ సజ్జా. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'హను-మాన్'. 'జాంబీ రెడ్డి' వంటి హిట్ మూవీ తర్వాత తేజ సజ్జా, డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం ఇది. అమృతా అయ్యర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్ర చేశారు. కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా విడుదల పలుమార్లు వాయిదా పడి, చివరికి సంక్రాంతి సందర్భంగా జనవరి 12న రిలీజ్ కానుంది.

డబ్బింగ్ కూడా..

పండగకి స్ట్రయిట్ చిత్రాలతో పాటు అనువాద చిత్రాలు కూడా వస్తుంటాయి. ఈసారి రజనీకాంత్ సినిమాతో పాటు జోరుగా బరిలో నిలవనున్న అనువాద చిత్రాలేవో తెలుసుకుందాం.

● 'జైలర్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న రజనీకాంత్ 'లాల్ సలాం'తో పొంగల్ (సంక్రాంతి) బరిలో దిగుతున్నారు. ఆయన కుమార్తె ఐశ్వర్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో విష్ణు విశాల్, విక్రాంత్ సంతోష్ హీరోలుగా నటిస్తున్నారు. ఇందులో స్టార్ క్రికెటర్ కపిల్ దేవ్, జీవితా రాజశేఖర్ కీలక పాత్రల్లో కనిపిస్తారు. సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతికి విడుదల కానుంది. ● ధనుష్, ప్రియాంకా అరుళ్ మోహనన్ జంటగా నటిస్తున్న చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని జి.శరవణన్, సాయి సిద్ధార్థ్ నిర్మిస్తున్నారు. పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ మూవీ సంక్రాంతి సందర్భంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ● శివ కార్తికేయన్ హీరోగా రకుల్ ప్రీత్‌సింగ్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'అయలాన్'. ఆర్. రవికుమార్ దర్శకత్వంలో ఆర్‌డీ రాజా నిర్మిస్తున్న ఈ సినిమా కూడా సంక్రాంతికి రిలీజవుతోంది. ● తమన్నా, రాశీ ఖన్నా లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'అరణ్మనై 4'. స్వీయ దర్శకత్వంలో 'అరణ్మనై' ఫ్రాంచైజీలో భాగంగా సుందర్ .సి తెరకెక్కిస్తోన్న ఈ చిత్రం పొంగల్‌కి రిలీజ్ కానుంది.

వచ్చే ఏడాది ది గోట్ లైఫ్


పృథ్వీరాజ్

పృథ్వీరాజ్ సుకుమారన్ హీరోగా నటించిన చిత్రం 'ది గోట్ లైఫ్' (ఆడు జీవితం). హాలీవుడ్ యాక్టర్ జిమ్మీ జీన్ లూయిస్, అమలాపాల్, కేఆర్ గోకుల్, అరబ్ యాక్టర్స్ తాలిబ్ అల్ బలూషి, రిక్ ఆబే ఇతర కీలక పాత్రల్లో నటించారు. బెన్యామిన్ రాసిన 'గోట్ డేస్' నవల ఆధారంగా ఆస్కార్ విన్నింగ్ డైరెక్టర్ బ్లెస్సీ తెరకెక్కించారు. విజువల్ రొమాన్స్ నిర్మాణ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ''1990వ దశకంలో జీవనోపాధిని వెతుక్కుంటూ కేరళ నుంచి విదేశాలకు వలస వెళ్లిన నజీబ్ అనే యువకుడి జీవిత కథను ఈ చిత్రంలో చూపించబోతున్నాం. పూర్తి స్థాయిలో ఎడారి నేపథ్యంలో వాస్తవ ఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న సినిమా ఇది'' అని యూనిట్ పేర్కొంది.

సక్సెస్‌ను హ్యాండిల్ చేయడం కష్టం


సుధీర్

''బుల్లితెర షోలకు టీఆర్పీ రేటింగ్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. కానీ సినిమాలకైతే దర్శకుల భవిష్యత్, నిర్మాత డబ్బులు, వినోదాన్ని ఆశించి థియేటర్స్‌కు వచ్చే ప్రేక్షకులు.. ఇలా చాలా విషయాలు ఆలోచించాలి. నా 'గాలోడు' సినిమా అంత పెద్ద సక్సెస్ అవుతుందని ఊహించలేదు. ఫెయిల్యూర్‌ను హ్యాండిల్ చేయడం సులభమే. కానీ సక్సెస్‌ను హ్యాండిల్ చేయడం కష్టం'' అన్నారు 'సుడిగాలి' సుధీర్. అరుణ్ విక్కిరాల దర్శకత్వంలో 'సుడిగాలి' సుధీర్ హీరోగా రూపొందిన చిత్రం 'కాలింగ్ సహస్ర'. విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'సుడిగాలి' సుధీర్ మాట్లాడుతూ– ''కాలింగ్ సహస్ర' కథ చెప్పినప్పుడు ఇందులోని ఓ పాయింట్ కొత్తగా అనిపించింది. నా కెరీర్‌లో ఇది ప్రయోగాత్మక సినిమా'' అని చెప్పుకొచ్చారు.

మెకానిక్ రెడీ


మణి సాయితేజ, అనిల్

మణి సాయితేజ, రేఖ నిరోషా జంటగా ముని సహేకర దర్శకత్వం వహించిన చిత్రం 'మెకానిక్'. నాగ మునెయ్య (మున్నా) నిర్మించారు. ఈ సినిమాని తెలుగు తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ నెల 15న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. కాగా ఈ మూవీ టీజర్‌కు సంబంధించిన పోస్టర్‌ను డైరెక్టర్ అనిల్ రావిపూడి రిలీజ్ చేసి, సినిమా హిట్టవ్వాలన్నారు.

ఊహించని మలుపులు


శ్రీ విద్య

పృథ్వీ కృష్ణ, శ్రీ విద్య జంటగా శ్రావణ భాస్కర్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'ఎయిమ్'. ఎంఎస్‌రావు, సుధాకర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెలలో రిలీజ్ కానుంది. ''ఈ చిత్ర కథలో పలు మలుపులు ఉన్నాయి. పి. గోపాల్ రెడ్డి స్వరపరచిన ఐదు పాటలు బాగుంటాయి. తల్లిదండ్రులకు.. ముఖ్యంగా యువ తరానికి నచ్చేలా ఈ చిత్రం ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

సాక్షి బిజినెస్
శుక్రవారం
1-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
87	37
66,988	20,133

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,147	▽	111
డోజోన్స్	35,658	▲	228
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,454	▲	30
డాక్స్	16,194	▲	49
షాంఘై	3,030	▲	8
నికాయ్	33,487	▲	166

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారట్)	62,607
బంగారం (22 క్యారట్)	62,357
వెండి (కేజీ)	75,934

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.57	84.24
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.25	107.64
€	యూరో	ఒకటి	90.00	93.09
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.85	57.56
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.17	56.53
S$	సింగపూర్ డాలర్	ఒకటి	54.31	56.78
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.28	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.81	23.60
¥	చైనా యువాన్	ఒకటి	10.56	12.63

దాతృత్వ హీరోల్లో నీలేకని, కామత్..

ఫోర్బ్స్ ఆసియా లిస్టులో చోటు




న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, డీఎల్‌ఎఫ్ గౌరవ చైర్మన్ కేపీ సింగ్, జిరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ వంటి దిగ్గజాలు సంపదను సమాజ శ్రేయస్సు కోసం కూడా గణనీయంగా ఉపయోగిస్తున్నారు. ఫోర్బ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన 17వ ఆసియా దాతృత్వ హీరోల జాబితా (15 మంది)లో వారు చోటు దక్కించుకున్నారు. తాను విద్యాభ్యాసం చేసిన ఐఐటీ బాంబేకి 1999 నుంచి ఇప్పటివరకు నీలేకని రూ.400 కోట్లు విరాళంగా ఇచ్చారు. 2020లో డీఎల్‌ఎఫ్ చైర్మన్ హోదా నుంచి తప్పుకున్న సింగ్ (92 ఏళ్లు).. కంపెనీలో నేరుగా ఉన్న వాటాలను విక్రయించగా వచ్చిన రూ.730 కోట్లను దాతృత్వ కార్యకలాపాలకు కేటాయించారు. జిరోధా కామత్ (37 ఏళ్లు) 'డబ్ల్యూటీఎఫ్ ఈజ్' పేరిట వ్యాపార దిగ్గజాలతో నిర్వహించే యూట్యూబ్ పాడ్‌కాస్ట్ సిరీస్ ద్వారా స్వచ్ఛంద సేవా సంస్థలకు రూ. కోటి వరకు విరాళాలు అందచేస్తున్నారు.

టాటా టెక్ సూపర్ హిట్.. గాంధార్ ఆయిల్ ఘనం

న్యూఢిల్లీ: టాటా టెక్నాలజీ షేరు లిస్టింగ్ రోజే భారీ లాభాలు పంచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.500)తో పోలిస్తే 140% ప్రీమియంతో రూ.1,200 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 180% ఎగసి రూ.1,400 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 163% లాభపడి రూ.1,314 వద్ద స్థిరపడింది. వెరసి ఈ ఏడాది(2023) లిస్టింగ్ రోజు అత్యధిక లాభాలు పంచిన షేరుగా రికార్డు సృష్టించింది. కంపెనీ విలువ రూ.52,940 కోట్లుగా నమోదైంది.

గాంధార్ సెంచరీ...

గాంధార్ ఆయిల్ రిఫైనరీ షేరు ఘనంగా లిస్టయ్యింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.169)తో పోలిస్తే 75% ప్రీమియంతో రూ.295 వద్ద లిస్టయ్యింది. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో ట్రేడింగ్‌లో మరింత దూసుకెళ్లింది. ఒక దశలో 104% ర్యాలీ చేసి రూ.345 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. మార్కెట్ ముగింపు సమయంలో అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో లాభాలు కొంతమేర తగ్గాయి. చివరికి 78% లాభంతో రూ.301.50 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో మొత్తం 29.06 లక్షల షేర్లు చేతులు మారాయి. కంపెనీ మార్కెట్ విలువ రూ.2,951 కోట్లుగా నమోదైంది.




టాటా టెక్ (ఎడమవైపు), గాంధార్ ఆయిల్ లిస్టింగ్‌లో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు

ఫెడ్ ఫినా.. ఫ్స్!

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు లిస్టింగ్‌లో నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.140)తో పోలిస్తే 1.50% డిస్కౌంట్‌తో రూ.138 వద్ద లిస్టయ్యింది. ప్రారంభంలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో లిస్టింగ్ నష్టాలు భర్తీ చేసుకొంది. ఒక దశలో 6% ర్యాలీ చేసి రూ.148 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. లాభాల స్వీకరణతో చివరికి ఇష్యూ ధర రూ.140 వద్దే ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.5,378 కోట్లుగా నమోదైంది.

మూడోరోజూ మార్కెట్ ముందుకే...

ఒడిదుడుకులున్నా స్వల్ప లాభాలు



ముంబై: స్టాక్ సూచీలు గురువారం స్వల్పంగా లాభపడి మూడోరోజూ ముందడుగేశాయి. అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలకు సంబంధించిన ఎగ్జిట్ పోల్స్, దేశీయ క్యూ2 జీడీపీ వృద్ధి రేటు, అక్టోబర్ ద్రవ్యలోటు డేటా వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. అమెరికా మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాలు సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. ట్రేడింగ్‌లో 460 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 87 పాయింట్లు పెరిగి 66,988 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 37 పాయింట్లు బలపడి 20,133 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు నవంబర్ నెలవారీ డెరివేటివ్‌ల గడువు ముగింపు కావడంతో ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఫార్మా, కన్జూమర్, రియల్టీ, పారిశ్రామిక, క్యాపిటల్ గూడ్స్, కన్జూమర్ షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు ఒకశాతం మేర లాభపడ్డాయి. బ్యాంకులు, యుటిలిటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఆసియాలో చైనా, హాంగ్‌కాంగ్ స్టాక్ సూచీలు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు సానుకూలంగా ట్రేడయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 5 పైసలు బలహీనపడి 83.37 వద్ద స్థిరపడింది.

జీడీపీ.. టాప్‌గేర్!

- క్యూ2లో భారత్ వృద్ధి 7.6 శాతం
- అంచనాలను మించి పరుగు
- ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా హోదా
- తయారీ రంగం దూకుడు
- వ్యవసాయం.. 'బలహీనం'



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 2023–24 ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండవ త్రైమాసికంలో (జూలై–సెప్టెంబర్) అంచనాలను మించి 7.6 శాతంగా నమోదయ్యింది. చైనా వృద్ధి రేటు ఇదే కాలంలో 4.9 శాతంగా నమోదుకావడంతో ప్రపంచంలో తన వేగవంతమైన ఎకానమీ హోదాను సైతం భారత్ మరోసారి ఉద్ఘాటించింది. సమీక్షా త్రైమాసికంలో తయారీ, మైనింగ్, సేవలు చక్కటి పనితీరును ప్రదర్శించాయి. వ్యవసాయ రంగం మాత్రం బలహీన ఫలితాన్ని నమోదుచేసుకుంది. మొదటి త్రైమాసికంలో భారత్ ఎకానమీ వృద్ధి రేటు 7.8 శాతంగా నమోదయ్యింది. రెండవ త్రైమాసికంలో ఈ రేటు 6.5 శాతానికి పరిమితం అవుతుందన్న అంచనాలను మించి పటిష్ట ఫలితం నమోదుకావడం పట్ల ఆర్థికవేత్తలు, విశ్లేషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో వృద్ధి 6.2 శాతం కావడం గమనార్హం. 2022–23లో భారత్ జీడీపీ వృద్ధి రేటు 7.2 శాతం. 2023–24లో ఈ రేటు 6.5 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) అంచనావేస్తోంది.

7.6 శాతం వృద్ధి అంటే..

2011–12 ధరల ప్రకారం (ఈ సంవత్సరం బేస్‌గా ద్రవ్యోల్బణం సర్దుబాటు చేసిన రియల్ ఎకానమీ వృద్ధి) 2022–23 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో భారత్ ఎకానమీ విలువ రూ.38.78 లక్షల కోట్లు. 2023–24 ఇదే కాలంలో (సమీక్షా కాలంలో) ఈ విలువ రూ.41.74 లక్షల కోట్లుగా నమోదయ్యింది. అంటే వృద్ధి రేటు 7.6 శాతమన్నమాట. ఇక ద్రవ్యోల్బణం సర్దుబాటు చేయకుండా కరెంట్ ప్రైస్ ప్రాతిపదిక చూస్తే, ఇదే కాలంలో జీడీపీ వృద్ధి రేటు (నామినల్) రూ.65.67 లక్షల కోట్ల నుంచి రూ. 71.66 లక్షల కోట్లకు ఎగసింది. అంటే నామినల్ వృద్ధి రేటు 9.1 శాతంగా ఉంది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకూ చూస్తే... రియల్ జీడీపీ విలువ రూ.76.22 లక్షల కోట్ల నుంచి రూ. 82.11 లక్షల కోట్లకు ఎగసింది. అంటే ఆరు నెలల్లో వృద్ధి రేటు 7.7 శాతంగా నమోదయ్యింది. ఇక ఇదే సమయంలో నామినల్ రేటు 8.6 శాతంగా ఉంది.

ఎకానమీ పటిష్టతకు ప్రతిబింబం



ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న పరీక్షా కాలంలో ఎదురవుతున్న సవాళ్లను భారత్ ఆర్థిక వ్యవస్థ పటిష్ట స్థాయిలో తట్టుకుని నిలబడుతోందని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరిన్ని అవకాశాలను సృష్టించేందుకు, పేదరికాన్ని త్వరితగతిన నిర్మూలించడానికి, మన ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, వేగవంతమైన వృద్ధిని కొనసాగించడానికి కట్టుబడి ఉన్నాము.

– ప్రధాని నరేంద్ర మోదీ

రంగాల వారీగా వృద్ధి తీరు ఇలా...

వస్తువులు, సేవల ఉత్పత్తికి సంబంధించి గ్రాస్ వ్యాల్యూ యాడెడ్ (జీవీఏ)విలువల ప్రకారం... జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) రంగాల వారీగా విడుదల చేసిన ఫలితాలు పరిశీలిస్తే...

తయారీ: మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు 78 శాతం వాటా కలిగిన ఈ రంగంలో వృద్ధి భారీగా 13.9 శాతంగా నమోదయ్యింది. 2022 ఇదే కాలంలో అసలు వృద్ధిలేకపోగా 3.8 శాతం క్షీణత నమోదయ్యింది.

గనులు, తవ్వకాలు: ఈ రంగంలో 0.1 శాతం క్షీణత సమీక్ష కాలంలో 10 శాతం వృద్ధిలోకి మారింది.

విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సేవలు: వృద్ధి రేటు 6.1 శాతం నుంచి 10.1 శాతానికి ఎగసింది.

నిర్మాణం: వృద్ధి రేటు 5.7 శాతం నుంచి 13.3 శాతానికి ఎగసింది.

వ్యవసాయం: ఎకానమీలో దాదాపు 15 శాతం వాటా ఉన్న ఈ కీలక రంగంలో వృద్ధి రేటు (2022 ఇదే కాలంతో పోల్చిచూస్తే) 2.5 శాతం నుంచి 1.2 శాతానికి తగ్గింది.

ఫైనాన్షియల్, రియల్టీ, ప్రొఫెషనల్ సేవలు: 7.1% నుంచి వృద్ధి 6 శాతానికి పడిపోయింది.

అల్ట్రాటెక్ చేతికి కేశోరామ్ సిమెంట్

- షేర్ల మార్పిడి ద్వారా ఒప్పందం
- కేశోరామ్ వాటాదారులకు షేర్లు
- ప్రతీ 52 షేర్లకు 1 అల్ట్రాటెక్ షేరు



కోల్‌కతా: సిమెంట్ రంగ దిగ్గజం అల్ట్రాటెక్.. కేశోరామ్ ఇండస్ట్రీస్‌కు చెందిన సిమెంట్ బిజినెస్‌ను కొనుగోలు చేయనుంది. ఇందుకు ఏవీ బిర్లా గ్రూప్ దిగ్గజం షేర్ల మార్పిడి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీంతో బీకే బిర్లా గ్రూప్ కంపెనీ కేశోరామ్ ఇండస్ట్రీస్ వాటాదారులకు అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లను జారీ కానున్నాయి. రుణాలుసహా సుమారు రూ. 7,600 కోట్ల విలువలో కేశోరామ్ సిమెంట్ కొనుగోలుకి అల్ట్రాటెక్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. కాగా.. షేర్ల మార్పిడి డీల్ ప్రకారం సిమెంట్ బిజినెస్‌ను విడదీసేందుకు బోర్డు అనుమతించినట్లు కేశోరామ్ ఇండస్ట్రీస్ పేర్కొంది. ఒప్పందంలో భాగంగా కేశోరామ్ వాటాదారులకు తమ వద్దగల ప్రతీ 52 షేర్లకుగాను 1 అల్ట్రాటెక్ సిమెంట్ షేరు లభిస్తుంది.

కేశోరామ్ సామర్థ్యం..

ప్రస్తుతం కేశోరామ్ సిమెంట్ కర్ణాటక(సేదమ్), తెలంగాణ(బసంత్‌నగర్)లలో రెండు సమీకృత ప్లాంట్లను కలిగి ఉంది. వీటి సామర్థ్యం వార్షికంగా 10.75 మిలియన్ టన్నులు(ఎంటీపీఏ). మహారాష్ట్ర(సోలాపూర్)లో 0.66 ఎంటీపీఏ ప్యాకింగ్ యూనిట్‌ను సైతం నిర్వహిస్తోంది. గతేడాది(2022–23) సిమెంట్ బిజినెస్ టర్నోవర్ రూ. 3,534 కోట్లుగా నమోదైంది. ఇక అల్ట్రాటెక్ ప్రపంచంలోనే సిమెంట్ తయారీకి మూడో భారీ కంపెనీగా నిలుస్తోంది. ప్రస్తుత సామర్థ్యం 137.85 ఎంటీపీఏకాగా.. కొనసాగుతున్న విస్తరణ పూర్తయితే 160 ఎంటీపీఏకు చేరుతుంది.

ఈ వార్తలతో అల్ట్రాటెక్ షేరు 3.2% ఎగసి రూ. 9,004 వద్ద ముగిసింది. కేశోరామ్ ఇండస్ట్రీస్ షేరు 5% జంప్‌చేసి రూ. 139 వద్ద స్థిరపడింది.

అక్టోబర్‌లో 'మౌలికం' అదుర్స్

వృద్ధి రేటు 12.1 శాతం



న్యూఢిల్లీ: ఎనిమిది రంగాల గ్రూప్‌నకు సంబంధించిన మౌలిక పరిశ్రమ వృద్ధి రేటు అక్టోబర్‌లో భారీగా 12.1%గా (2022 ఇదే నెలతో పోల్చితే) నమోదైంది. బేస్ ఎఫెక్ట్, కొన్ని రంగాలు రెండంకెల్లో భారీ వృద్ధిని నమోదుచేసుకోవడం దీనికి కారణం. బొగ్గు (18.4%), స్టీల్ (11%), సిమెంట్ (17.1%), విద్యుత్ (20.3%) రంగాల ఉత్పత్తి వృద్ధి రెండంకెల్లో నమోదైంది. ఎరువుల రంగం వృద్ధి రేటు 5.3%. క్రూడ్ (1.3%), సహజ వాయువు (9.9%), రిఫైనరీ ప్రొడక్టు రంగాలు (4.2%) కూడా ఉన్న ఈ గ్రూప్ వెయిటేజ్ మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లో దాదాపు 40%.

సాక్షి స్పోర్ట్స్



భారత్ 12 - కెనడా 0

మహిళల జూనియర్ హాకీ వరల్డ్ కప్‌ను భారత జట్టు భారీ విజయంతో మొదలు పెట్టింది. ఏకపక్షంగా సాగిన తొలి మ్యాచ్‌లో భారత్ 12–0 గోల్స్ తేడాతో కెనడాను చిత్తుగా ఓడించింది. చిలీలోని శాంటియాగోలో జరుగుతున్న ఈ టోర్నీలో మ్యాచ్ అర్ధ భాగం ముగిసే సరికి 4–0తో ముందంజలో నిలిచిన భారత్ తర్వాతి అర్ధ భాగంలో మరో 8 గోల్స్ కొట్టడం విశేషం. భారత్ తరఫున ముంతాజ్ ఖాన్ ఏకంగా నాలుగు గోల్స్‌తో (26వ నిమిషం, 41వ ని., 54వ ని., 60వ ని.) చెలరేగగా...దీపిక సోరెంగ్ (34వ నిమిషం, 50వ ని., 54వ ని.), అన్ను (4వ నిమిషం, 6వ ని., 39వ ని.) చెరో మూడు గోల్స్ సాధించారు. దీపిమోనికా టోపో (21వ ని.), నీలమ్ (45వ ని.) ఒక్కో గోల్ కొట్టారు. తమ తర్వాతి మ్యాచ్‌లో శుక్రవారం జర్మనీతో భారత్ తలపడుతుంది.

నజ్ముల్ హుస్సేన్ శతకం


- రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా 212/3
- కివీస్‌తో తొలిటెస్టు



సిల్హెట్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ నిలకడ ప్రదర్శించింది. మ్యాచ్ మూడో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి బంగ్లా 3 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ షంతో (193 బంతుల్లో 104 నాటౌట్; 10 ఫోర్లు) అజేయ సెంచరీతో జట్టును నడిపించగా, ముష్ఫికర్ రహీమ్ (43 నాటౌట్), మోమినుల్ హక్ (40) రాణించారు. ప్రస్తుతం బంగ్లా 205 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 266/8తో ఆట కొనసాగించిన న్యూజిలాండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 317 పరుగులకు ఆలౌటైంది. దీంతో కివీస్‌కు 7 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. కెప్టెన్ టిమ్ సౌతీ (35) చివర్లో కీలక పరుగులు సాధించాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో తైజుల్ ఇస్లామ్ నాలుగు, మోమినుల్ హక్ మూడు వికెట్లు పడగొట్టారు.

హర్మన్‌ప్రీత్ నాయకత్వంలో...

5 దేశాల టోర్నీకి భారత హాకీ జట్టు



న్యూఢిల్లీ: యూరోప్‌లో పటిష్టమైన నాలుగు అగ్రశ్రేణి జట్లతో తలపడేందుకు ఐదు దేశాల టోర్నీలో భారత్ బరిలోకి దిగనుంది. ఇందులో పాల్గొనే 24 మంది సభ్యుల భారత జట్టును గురువారం హాకీ ఇండియా (హెచ్ఐ) ప్రకటించింది. హర్మన్‌ప్రీత్ సింగ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. స్పెయిన్‌లో వలెన్సియాలో డిసెంబర్ 15నుంచి 22 వరకు ఈ టోర్నీ జరుగుతుంది. భారత్‌తో పాటు స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, బెల్జియం ఇందులో పోటీ పడుతున్నాయి.

జట్టు వివరాలు: హర్మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), పీఆర్ శ్రీజేష్, కృషన్ బహదూర్ పాఠక్, సూరజ్ కర్కేరా, జర్మన్‌ప్రీత్, జుగ్‌రాజ్, అమిత్ రోహిదాస్, వరుణ్ కుమార్, సుమీత్, సంజయ్, నీలమ్ సంజీప్, యశ్‌దీప్, వివేక్ సాగర్, నీలకంఠ శర్మ, రాజ్‌కుమార్, షంషేర్, రవిచంద్ర సింగ్, మన్‌దీప్ సింగ్, అభిషేక్, సుఖ్‌జీత్, లలిత్ ఉపాధ్యాయ్, కార్తి సెల్వమ్, దిల్‌ప్రీత్, ఆకాశ్‌దీప్.

రాహుల్‌కు వన్డే పగ్గాలు



మూడు ఫార్మాట్లకు రుతురాజ్

- టి20లకు సూర్య కొనసాగింపు
- రోహిత్, కోహ్లిలకు విశ్రాంతి
- సాయి సుదర్శన్, రింకూలకు ఛాన్స్



రాహుల్

న్యూఢిల్లీ: వచ్చే నెల దక్షిణాఫ్రికా పర్యటనలో ఆడే మూడు ఫార్మాట్లకు భారత జట్లను ఎంపిక చేశారు. సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరుగుతున్న టి20 సిరీస్‌లో జట్టును నడిపిస్తున్న సూర్యకుమార్ యాదవ్‌ను సఫారీలోనూ కెప్టెన్‌గా కొనసాగిస్తున్నారు. ఈ పొట్టి ఫార్మాట్‌లో జడేజాకు వైస్ కెప్టెన్సీ అప్పజెప్పారు. వన్డే జట్టుకు కేఎల్ రాహుల్‌ను కెప్టెన్‌గా నియమించారు. ఈ రెండు జట్లకూ భారత టాప్‌స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, కోహ్లిలు విశ్రాంతి తీసుకున్నారు. దీంతో వన్డేల్లో ఇద్దరు కొత్త ముఖాలు బి. సాయి సుదర్శన్, రింకూ సింగ్‌లకు టీమిండియాకు ఆడే అవకాశమిచ్చారు. మిడిలార్డర్‌లో డాషింగ్ బ్యాటర్ సంజూ సామ్సన్, స్పిన్నర్ చహల్‌లకు వన్డే జట్టులో తిరిగి చోటు లభించగా, రుతురాజ్ గైక్వాడ్ లక్కీఛాన్స్ కొట్టేశాడు. పూర్తిస్థాయిలో మూడు ఫార్మాట్లకూ ఎంపికయ్యాడు. సీమర్ ముకేశ్‌కూ ఇలాంటి అవకాశమే లభించింది. హైదరాబాద్ స్పీడ్‌స్టర్ సిరాజ్‌ను టి20, టెస్టులకు ఎంపిక చేసినప్పటికీ వన్డేల నుంచి తప్పించారు. సఫారీలో ముందుగా భారత్ డిసెంబర్ 10, 12, 14తేదీల్లో మూడు టి20లు... 17, 19, 21 తేదీల్లో మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొంటుంది. చివరగా 26 నుంచి 30 వరకు తొలిటెస్టు, జనవరి 3 నుంచి 7వరకు జరిగే రెండో టెస్టుతో పర్యటన ముగుస్తుంది.

సిరీస్ వేటలో బౌలర్లపై భారం!

- నేడు భారత్, ఆస్ట్రేలియా నాలుగో టి20
- మరో విజయంపై టీమిండియా దృష్టి
- ఆత్మవిశ్వాసంతో ఆసీస్
- రా.గం.7 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



రాయ్‌పూర్: పరుగుల వరద పారిన భారత్, ఆస్ట్రేలియా సిరీస్‌లో మరో సమరానికి రంగం సిద్ధమైంది. ఇరు జట్లు నేడు జరిగే నాలుగో టి20లో తలపడనున్నాయి. భారత్ ఇప్పటికే 2–1తో ఆధిక్యంలో ఉండగా, ఈ మ్యాచ్‌లో గెలిస్తే సిరీస్ సొంతమవుతుంది. అయితే గత పోరులో ఆసీస్‌నుంచి ఎదురైన ప్రతిఘటనను చూస్తే ఇది అంత సులువు కాదు. మ్యాక్స్‌వెల్ సహా పలువురు ఆసీస్ కీలక ఆటగాళ్లు స్వదేశానికి వెళ్లిపోవడంతో జట్టు కాస్త బలహీనపడగా...దీనిని భారత్ సానుకూలంగా మార్చుకుంటే సిరీస్ గెలవచ్చు.

ముకేశ్ పునరాగమనం...

గత మ్యాచ్‌లో ఆడిన జట్టునుంచి పలు మార్పులతో భారత్ బరిలోకి దిగే అవకాశం ఉంది. తన పెళ్లి కోసం మూడో మ్యాచ్‌కు దూరమైన పేసర్ ముకేశ్ కుమార్ తిరిగొచ్చాడు. దీంతో గత మ్యాచ్‌లో చెత్తబౌలింగ్ వేసిన ప్రసిధ్ కృష్ణను పక్కనబెట్టొచ్చు. అలాగే శ్రేయస్ అయ్యర్ నాలుగు, ఐదో టి20ల కోసం జట్టులోకి రావడంతో తిలక్‌వర్మ బెంచ్‌కే పరిమితం కానున్నాడు. దీంతో పాటు అదనంగా జట్టులో చేరిన దీపక్ చహర్‌ను కూడా ఆడించే అవకాశం ఉంది. చహర్‌ను ఎంచుకుంటే అర్ష్‌దీప్‌ను పక్కన పెడతారు. స్పిన్నర్ బిష్ణోయ్ మాత్రం మెరుగ్గా ఆడుతుండటంతో అతని స్థానానికి ఢోకా లేదు. అయితే బ్యాటింగ్ విషయంలో ఎలాంటి సందేహం లేదు కాబట్టి ఈ సారైనా గెలిపించాల్సిన భారం బౌలర్లదే. భారీ స్కోర్లు నమోదవుతున్న మ్యాచ్‌లలో మెరుగైన బౌలింగ్‌తోనే మ్యాచ్‌ను కాపాడుకోవచ్చు. బ్యాటింగ్‌లో రుతురాజ్ అద్భుత ఫామ్‌తో తానేంటో చూపించగా, సూర్యకుమార్ తన స్థాయిని ప్రదర్శిస్తున్నాడు. ఇషాన్ కిషన్ ఫర్వాలేదనిపించగా...యశస్వి కూడా మరో మ్యాచ్‌లో జోరు చూపించాల్సి ఉంది. అన్నింటికి మించి హైదరాబాదీ తిలక్ వర్మ చెలరేగడం కీలకం. ఈ సిరీస్‌లో ఇంకా అతని ముద్ర కనిపించలేదు.

హెడ్ మినహా...

ఆరుగురు ఆటగాళ్లు ఇప్పటికే ఆసీస్‌కు వెళ్లిపోవడంతో ఆసీస్ జట్టు మొత్తం కొత్తకొత్తగా కనిపిస్తోంది. వరల్డ్ కప్‌లో ఆడిన ట్రవిస్ హెడ్ ఒక్కడే సిరీస్‌లో కొనసాగేందుకు నిర్ణయించుకున్నాడు. వేడ్ బ్యాటింగ్ పదును గత మ్యాచ్‌లో కనిపించగా, టిమ్ డేవిడ్ అంచనాలను అందుకోలేకపోతున్నాడు. షార్ట్, హార్డీ, మెక్‌డెర్మాట్‌లాంటి బ్యాటర్లు ఏమాత్రం ప్రభావం చూపిస్తారనేది సందేహమే. బౌలింగ్‌లో కూడా బెహ్రెన్‌డార్ఫ్ ఒక్కడే ఆకట్టుకున్నాడు. ఎలిస్, సంఘా విఫలం కాగా, కొత్త ఆటగాడు క్రిస్ గ్రీన్ ఎలా ఆడతాడనేది ఆసక్తికరం. ఓవరాల్‌గా ఆసీస్ మరీ పటిష్టంగా కనిపించకపోయినా... పోరాడే తత్వం ఉన్న జట్టు సభ్యులంతా ఎలాంటి సమయంలోనైనా టీమిండియాను ఇబ్బంది పెట్టగలరు.

తుది జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), యశస్వి, రుతురాజ్, ఇషాన్ కిషన్, అయ్యర్, రింకూ సింగ్, అక్షర్, బిష్ణోయ్, చహర్, అవేశ్, ముకేశ్.

ఆస్ట్రేలియా: వేడ్ (కెప్టెన్), హార్డీ, హెడ్, షార్ట్, మెక్‌డెర్మాట్, డేవిడ్, క్రిస్ గ్రీన్, డ్వార్‌షుయిస్, ఎలిస్, బెహ్రెన్‌డార్ఫ్, సంఘా.

పిచ్, వాతావరణం

సాధారణ బ్యాటింగ్ వికెట్ కాబట్టి మరోసారి భారీ స్కోర్లు ఖాయం. టాస్ గెలిస్తే ఛేజింగ్‌కు మొగ్గుచూపొచ్చు. ఈ గ్రౌండ్‌లో గతంలో ఒకే ఒక అంతర్జాతీయ మ్యాచ్, అదీ వన్డే జరిగింది. ఇది తొలి టి20 కానుంది. మ్యాచ్ రోజు వర్షసూచన లేదు.

సెమీస్‌లో శివ, పంఘాల్

షిల్లాంగ్: భారత స్టార్ బాక్సర్లు శివథాపా, అమిత్ పంఘాల్ జాతీయ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. ఆరుసార్లు ఆసియా చాంపియన్‌షిప్ మెడలిస్ట్ శివథాపా 63.5 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్లో 5–0తో శశాంక్ ప్రధాన్ (ఢిల్లీ)పై అలవోక విజయం సాధించాడు. అమిత్ పంఘాల్ 51 కేజీల కేటగిరీలో 5–0తో మొహమ్మద్ ఆరిఫ్ (జమ్మూకశ్మీర్)పై ఎదురులేని పంచ్‌లతో గెలుపొందాడు. సంజీత్ (92 కేజీలు) కూడా 5–0తో 2018 కామన్వెల్త్‌గేమ్స్ కాంస్య పతక విజేత నమన్ తన్వర్ (రైల్వేస్)పై ఏకపక్ష విజయం సాధించాడు. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో సంజీత్... విక్కీ (ఆలిండియా పోలీస్)తో, శివథాపా... వంశాజ్‌తో, పంఘాల్... అంకిత్ (రైల్వేస్)తో తలపడతారు.

క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ

లక్నో: హైదరాబాద్ మేటి షట్లర్లు గాయత్రి గోపీచంద్–ట్రెసా జాలీ సయ్యద్ మోడి బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ గాయత్రి–ట్రెసా జాలీ జోడీ 21–9, 21–5 భారత్‌కే చెందిన ధన్య–రిధి కౌర్ జంటపై నెగ్గింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి–సుమిత్ రెడ్డి ద్వయం 9–21, 17–21తో మూడో సీడ్ నరు షినొయా–క్యోహె యమాషిటా (జపాన్) జోడీ చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ప్రియాన్షు రజావత్ 21–18, 11–6తో భారత్‌కే చెందిన సతీశ్ కుమార్‌పై ఆధిక్యంలో ఉండగా... ప్రత్యర్థి రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. దీంతో ప్రియాన్షు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు.

టి20 ప్రపంచకప్‌కు ఉగాండా క్వాలిఫై

జింబాబ్వే చేజారిన అవకాశం



విండోక్ (నమీబియా): వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌కు ఆఫ్రికా దేశం ఉగాండా అర్హత సాధించింది. ఏ ఫార్మాట్‌లోనైనా సీనియర్ వరల్డ్ కప్‌కు ఉగాండా క్వాలిఫై కావడం ఇదే తొలిసారి. ఆఫ్రికా రీజియన్ క్వాలిఫయర్ టోర్నీలో భాగంగా గురువారం జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో ఉగాండా 9 వికెట్ల తేడాతో రువాండాను చిత్తు చేసింది. రువాండా 18.5 ఓవర్లలో 65 పరుగులకే కుప్పకూలగా...ఉగాండా 8.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 66 పరుగులు సాధించింది.

ఆఫ్రికా రీజియన్ నుంచి మొత్తం 7 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన టీమ్‌లకు వరల్డ్ కప్ ఆడే అవకాశం లభిస్తుంది. ఈ మొత్తం జట్లలో అన్నింటికంటే ఎక్కువ అనుభవం ఉన్న, ఫేవరెట్‌గా బరిలోకి దిగిన జింబాబ్వే మాత్రం ముందంజ వేయలేకపోవడం విశేషం. 5 విజయాలతో నమీబియా ఇప్పటికే అర్హత సాధించగా రెండో స్థానం కోసం ఉగాండా, జింబాబ్వే మధ్య పోటీ నడిచింది. ఉగాండా ఓడితే జింబాబ్వేకు అవకాశం దక్కేది. అయితే ఉగాండా టోర్నీలో ఐదో విజయం (మొత్తం 10 పాయింట్లు) సాధించగానే జింబాబ్వేకు దారులు మూసుకుపోయాయి. తర్వాత జరిగిన తమ చివరి మ్యాచ్‌లో 110 పరుగుల తేడాతో కెన్యాను ఓడించినా లాభం లేకపోయింది. లీగ్ దశలో జింబాబ్వే నాలుగు మ్యాచ్‌లు గెలవగలిగినా...నమీబియాతో పాటు అనూహ్యంగా ఉగాండా చేతిలోనే ఓడటంతో ఆ జట్టు లెక్క మారిపోయింది. క్వాలిఫయింగ్ టోర్నీలో విఫలం కావడంతో 2023 వన్డే వరల్డ్ కప్‌కు దూరమైన జింబాబ్వే ఇప్పుడు 2024 టి20 ప్రపంచకప్‌లో పాల్గొనలేకపోతోంది.


ఓటోగ్రాఫ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసిన సినీ ప్రముఖులు.. చిరంజీవి, సురేఖ, నాగార్జున, నాగచైతన్య, అమల, వెంకటేష్, రాజమౌళి, రమ, మహేష్‌బాబు, నమ్రత, రామ్‌చరణ్, ఉపాసన, అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్, లక్ష్మీప్రణతి

జేఈఈ మెయిన్ పరీక్ష దరఖాస్తుల గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్ పరీక్షకు దరఖాస్తు గడువును పొడిగించినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపింది. ఈ మేరకు గురువారం తన వెబ్‌సైట్‌లో స్పష్టం చేసింది. వాస్తవానికి మెయిన్ పరీక్షకు దరఖాస్తు గడువు గురువారం ముగిసింది. అయితే దీన్ని డిసెంబర్ 4వ తేదీ వరకూ పొడిగించారు. అభ్యర్థులు తమ దరఖాస్తులో ఏవైనా సవరణలు చేయాల్సి ఉంటే డిసెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకూ పూర్తి చేయాలని తెలిపింది. పరీక్షలు ముందు ప్రకటించినట్టు జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 మధ్య జరుగుతాయని పేర్కొంది.

ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో సీట్ల కేటాయింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశాలకు మొదటి విడత కౌన్సెలింగ్‌లో 5,912 మంది అభ్యర్థులకు సీట్లను కేటాయించారు. గురువారం మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సులో ప్రవేశాలకు 3,589, అయిదేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సులో ప్రవేశాలకు 1,579, ఎల్‌ఎల్‌ఎం పీజీ కోర్సులో ప్రవేశాలకు 744 మందికి సీట్లు కేటాయించినట్లు అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ రమేష్‌బాబు వివరించారు.

సొరంగాలు దాటిన కృష్ణా తరంగం

- అవుకు టన్నెల్‌తో 'సీమ' సస్యశ్యామలం
- రెండో సొరంగాన్ని జాతికి అంకితం చేసిన ఏపీ సీఎం జగన్



సాక్షి ప్రతినిధి, కర్నూలు: సొరంగాలు దాటుతూ.. సుడులు తిరుగుతూ పరవళ్లతో కృష్ణమ్మ 'సీమ'ను ముద్దాడిన సుందర ఘట్టం సాక్షాత్కారమైంది. పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ గాలేరు–నగరిలో అంతర్భాగమైన అవుకు రెండో టన్నెల్‌ను గురువారం రోజు ఘనంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతికి అంకితం చేశారు. ప్రస్తుత డిజైన్ మేరకు గాలేరు–నగరి వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కులను తరలించేందుకు మార్గం సుగమం చేశారు. ఈ సందర్భంగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ పాయలుగా చీలి రెండు టన్నెళ్ల ద్వారా దిగువకు వేగంగా ప్రవహిస్తున్న దృశ్యాన్ని సీఎం సంతోషంతో కొద్దిసేపు అలాగే చూస్తుండిపోయారు. ఈ నీటితో రాయలసీమ సస్యశ్యామలం కానుందనే ఆనందం ముఖ్యమంత్రి ముఖంలో స్పష్టంగా కనిపించింది. చిరునవ్వుతో నీటిపారుదల శాఖ అధికారులను అభినందించిన సీఎం జగన్ ప్రజాప్రతినిధులను ఆత్మీయంగా పలకరించారు. ఈ టన్నెల్ ద్వారా గోరుకల్లు నుంచి అవుకు రిజర్వాయర్‌కు 20 వేల క్యూసెక్కుల జలాలు పరవళ్లు తొక్కనున్నాయి. టన్నెల్‌ను ప్రారంభించేందుకు విజయవాడ నుంచి నంద్యాల జిల్లా అవుకు మండలం మెట్టుపల్లికి చేరుకున్న సీఎం జగన్ తొలుత ఎగ్జిబిషన్‌ను తిలకించారు. నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇతర అధికారులు టన్నెల్ ముఖ్యాంశాలను వివరించారు. అనంతరం సీఎం జగన్ అక్కడి నుంచి వేదమంత్రాల మధ్య టన్నెల్ వద్దకు చేరుకుని నీటిని దిగువకు విడుదల చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు. టన్నెల్ ప్రారంభించిన తర్వాత వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు, కార్యకర్తలను కలిసి ఆత్మీయంగా పలకరించారు.


అవుకు టన్నెల్2 శిలాఫలకం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి


ఎర్రమంజిల్ సరస్వతి శిశుమందిర్ పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో ఓటు వేసిన జస్టిస్ ఈవీ వేణుగోపాల్


నకిరేకల్ నియోజకవర్గం బోగారంలో కుటుంబ సభ్యులతో కలసి ఓటు హక్కు వినియోగించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్

రాష్ట్రంలో కాంగ్రెస్‌దే విజయం: భట్టి



మధిర: రాష్ట్రంలో ప్రజల ప్రభుత్వం ఏర్పాటు కావాలని, ప్రజాస్వామ్యయుత సామాజిక నిర్మాణం జరగాలనే ఆకాంక్షతో ఓటర్లు కాంగ్రెస్‌కు ఓటు వేశారని సీఎల్పీ నేత, మధిర కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మధిరలో ఓటు హక్కు వినియోగించుకోవడంతో పాటు నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర సంపద ప్రజలకు పంచాలని.. సక్రమంగా అన్ని వర్గాలకు అందాలని బలంగా కోరుకుంటున్నానని చెప్పారు. పదేళ్ల కాలంలో వనరులు, సంపద రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు భిన్నంగా దోపిడీకి గురైందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ప్రజలు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు బాటలు వేశారని భట్టి వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలతోపాటు మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్నీ తూ.చ. తప్పక అమలు చేస్తామని చెప్పారు.

ఏపీలో తగ్గిన నిరుద్యోగం

- రాష్ట్రాల వారీగా నిరుద్యోగితపై నివేదిక విడుదల చేసిన ఆర్‌బీఐ
- సత్ఫలితాలనిస్తున్న వైఎస్ జగన్ సర్కార్ చర్యలు

సాక్షి, అమరావతి: ఏపీలో వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో నిరుద్యోగిత రేటు తగ్గింది. ఈ విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) గణాంకాలు స్పష్టం చేశాయి. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేస్తూనే.. మరోవైపు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు పెద్ద పీట వేస్తూ ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తోంది. ఈ కృషి ఆర్‌బీఐ గణాంకాల్లో స్పష్టంగా కనిపించింది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో నిరుద్యోగితపై ఆర్‌బీఐ నివేదిక విడుదల చేసింది. చంద్రబాబు హయాం (2018–19)లో నిరుద్యోగుల సంఖ్యతో పోల్చి చూస్తే 2022–23లో నిరుద్యోగుల సంఖ్య తగ్గిందని ఆర్‌బీఐ వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా చంద్రబాబు పాలనలోని 2018–19లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మందికి 45 మంది నిరుద్యోగులుండగా.. 2022–23లో ఆ సంఖ్య 33కు తగ్గింది. అలాగే 2018–19లో పట్టణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మందికి 73 మంది నిరుద్యోగులుండగా.. 2022–23లో ఆ సంఖ్య 65కు తగ్గిందని ఆర్‌బీఐ నివేదిక తెలిపింది. అలాగే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళలు, పురుషుల్లోని నిరుద్యోగుల సంఖ్యలో 2018–19 కంటే 2022–23లో తగ్గిందని ఆర్‌బీఐ వెల్లడించింది.

మహిళల సమస్యలపై 'సాహస్' అస్త్రం

- పని ప్రదేశాల్లో భద్రతపై ప్రత్యేక యాప్
- సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని సూచించిన మహిళా భద్రత విభాగం

సాక్షి, హైదరాబాద్: పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులు ఎదుర్కొనే లైంగిక వేధింపులు, ఇతర సమస్యలపై 'సాహస్'పోర్టల్‌లో ఫిర్యాదు చేయవచ్చని మహిళా భద్రత విభాగం అధికారులు తెలిపారు. ఉద్యోగం చేసే మహిళలు ఈ పోర్టల్‌లో తమ సమస్యలు చెప్పుకునేందుకు 'గెట్ హెల్ప్'ఆప్షన్ ఉన్నట్టు వారు వెల్లడించారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతి రోజూ ఉదయం 10–30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 7331194540 నంబర్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచించారు. సాహస్ పోర్టల్‌ను ఇప్పటికే ప్రారంభించామని, మహిళల్లో అవగాహన కోసం దీనిపై మరింత ప్రచారం చేస్తున్నామని పేర్కొన్నారు. పని ప్రదేశంలో మహిళా ఉద్యోగుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు మొదలు.. లైంగిక వేధింపులపై ఎలా ఫిర్యాదు చేయాలి, న్యాయ సాయం ఎలా పొందాలో పోర్టల్‌లో పొందుపరిచినట్టు తెలిపారు. ఫిర్యాదులకు https:// womensafetywing. telangana. gov. in/ sahas/ లో క్లిక్‌చేసి వివరాలు పొందవచ్చని వివరించారు.

మహిళాభివృద్ధికి మోదీ కృషి

- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్
- సత్యసాయి జిల్లాలో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'లో పాల్గొన్న మంత్రి
- 'నాసన్'లో అభివృద్ధి పనులపై సమీక్ష


నిర్మలా సీతారామన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఏపీ మంత్రి బుగ్గన

గోరంట్ల: దేశంలో మహిళల అభివృద్ధికి మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఆమె గురువారం ఏపీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రావత్, అజేయ్‌జైన్‌తో కలిసి శ్రీసత్యసాయి జిల్లా గోరంట్లలో పర్యటించారు. గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో కలెక్టర్ అరుణ్‌బాబు అధ్యక్షతన జరిగిన 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'లో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ... ఆయుష్మాన్ భారత్, పీఎం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, పీఎం విశ్వకర్మ, పీఎం కిసాన్, కిసాన్ క్రెడిట్ కార్డ్, పోషణ్ అభియా న్, జల్ సహా 10 ప్రభుత్వ పథకాల గురించి విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా మహిళలకు లబ్ధి కలిగేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగంపై స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 15,000 మంది మహిళలకు డ్రోన్లు అందజేస్తామన్నారు. ఇందుకోసం రానున్న రెండు ఆర్థిక సంవత్సరాల్లో కేంద్రం రూ.1,261 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 1.57 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా జిల్లాలో 27 వేల మందికి లబ్ధి కలిగిందన్నారు. అనంతరం ఉజ్వల 2.0 పథకం లబ్ధిదారులకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి గ్యాస్ కనెక్షన్, స్టౌ అందజేశారు. ఆ తర్వాత నిర్మలా సీతారామన్ పాలసముద్రం సమీపంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసన్)లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై ఆ సంస్థ, జిల్లా అధికారులతో సమీక్షించారు.

పేదల సుఖసంతోషాలే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం అభినందనీయం
- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్
- అందుకోసం ప్రత్యేక ప్రణాళికలు
- పేదల అభ్యున్నతి కోసం 17 రకాల పథకాలు
- వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా.. వర్చువల్‌గా మాట్లాడిన ప్రధాని మోదీ


వర్చువల్‌గా మాట్లాడుతున్న ప్రధాని నరేంద్రమోదీ

సింగరాయకొండ: పేద ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, అందుకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సహాయ, సహకారాలు అభినందనీయమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. 2047 సంవత్సరం నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం 17 రకాల పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఆయా పథకాల గురించి అందరికీ తెలిసేలా చేయడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమని వివరించారు. కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రకాశం జిల్లా కనిగిరి మండలం చాకిరాల పంచాయతీ భూతంవారిపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు కొమ్మలపాటి వెంకట రమణమ్మతో ప్రధాని మోదీ వర్చువల్‌గా మాట్లాడారు. డ్రోన్ ద్వారా సాంకేతిక పద్ధతిలో చేస్తున్న వ్యవసాయం ద్వారా ఆమెకు కలిగిన లబ్ధిని, అనుభవాలను చెప్పాలని మోదీ కోరారు. రమణమ్మ మాట్లాడుతూ తాను ఎంఏ బీఈడీ చదివానన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాల ద్వారా డ్రోన్ ద్వారా వ్యవసాయం చేస్తున్నానని తెలిపారు. అందుకోసం ఆచార్య రంగా యూనివర్సిటీలో 12 రోజుల పాటు శిక్షణ పొందానన్నారు. ఈ విధానం ద్వారా తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేసుకుంటున్నానని, నీటి అవసరం కూడా బాగా తగ్గిందని ఆమె చెప్పారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ ప్రతి రైతూ సాంకేతిక పద్ధతిలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. అలాగే సింగరాయకొండ మండలంలోని పాకల గ్రామంలోని మరికొంత మందితోనూ ప్రధాని మోదీ వర్చువల్‌గా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నదని కొనియాడారు. అనంతరం 24 స్వయం సహాయ గ్రూపులకు రూ.4.80 కోట్ల విలువైన బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులు అందించారు. పారిశుధ్య పనులు చేస్తున్న క్లాప్ మిత్రలను సత్కరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం చేశారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. ఉజ్వల భారత్ పథకంలో భాగంగా గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. డ్రోన్ వినియోగంలో శిక్షణ పొందిన రమణమ్మకు లైసెన్స్ పత్రాన్ని అందజేశారు. కలెక్టర్ దినేష్‌కుమార్, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రోగ్రాం జిల్లా ఇన్‌చార్జి ఎం.రామచంద్రుడు, జేసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.


ప్రధానితో మాట్లాడుతున్న మహిళా రైతు రమణమ్మ, చిత్రంలో ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి

ఓటు గల్లంతు.. వృద్ధురాలి కంటతడి



వయసు సహకరించకున్నా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చిన 80 ఏళ్ల వృద్ధురాలు ఓటు గల్లంతైందని తెలుసుకొని కన్నీటిపర్యంతమైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లి పోలింగ్ కేంద్రానికి జడల ఎల్లవ్వ వీల్‌చైర్‌పై వచ్చింది. ఓటరు జాబితాలో తన పేరు లేకపోవడంతో కన్నీరు పెట్టుకుంది. తన జీవితంలో మొదటిసారి ఓటు వేయలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేసింది. –తంగళ్లపల్లి (సిరిసిల్ల)

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.